జి. పి. రెడ్డి అండ్ కో రిజిస్టర్డ్
గోవాలపల్లి
సుప్రసిద్ధం
ఆయుర్వేద మహౌషధాలు
బిళ్ళ
లభించును
కేటలాగు సలహా ఉచితం
సర్వాంగవాతాదులకు
బ్రాంచి కార్యాలయం: జనగామ P. O. వరంగల్ జిల్లా.

స్థాపితము 1926 రిజిష్టరు నెం. ఎ.92

గోలకొండ పత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి. ఎం.ఏ

101503

పంటకములకు ఉపకరించని
కొబ్బరినూనె
వంటకములకు ఉపకరించని కొబ్బరినూనె అమ్మకమునకు ఏజంట్లు మరియు ఎస్టాబ్లిష్డ్ డీలర్లు కావలెను. ఎస్టాబ్లిష్డ్ డీలర్లు మాత్రమే ఇంగ్లీషులో సంప్రదించవలెను.
స్టేట్ ట్రేడింగ్ కంపెని
లిబర్టీ బిల్డింగ్, బషీర్ బాగ్,
హైదరాబాద్ – (ఆం. ప్ర.)

సంపుటి: 14 సంచిక: 224 :: హైదరాబాద్, శనివారము 26 - 8 - 1961 :: 8 పేజీలు 10 నయాపైసలు

ఏమీ ప్రాతిపదిక లభించకుండానే అకాలీలచర్చలు ముగింపు

సుప్రీంకోర్టుకు కరంజియా దరఖాస్తు

తనకు లోకసభ సమన్లుపంపడం రాజ్యాంగ విరుద్ధమని వాదన

న్యూఢిల్లీ, ఆగస్టు 25

లోకసభహక్కులకు తాము భంగకరంగా ప్రవర్తించినట్లు నిర్ణయించి సభవారిమందలింపును స్వీకరించడానికై సభముందుకు హాజరు కావాల్సిందిగా లోకసభ కావించిన నిర్ణయాన్ని త్రోసివేయాలని కోరుతూ బిల్జ్ సంపాదకుడు శ్రీ కరంజియా, ఢిల్లీ విలేఖరి శ్రీ రాఘవన్‌లు సుప్రీంకోర్టులో రిట్ దరఖాస్తు పెట్టుకున్నారు.

ఈ రిట్ దరఖాస్తు పరిశీలన ఆగస్టు 28 న జరుగుతుంది. లోకసభ నిర్ణయం అమలు జరుగకుండా స్టే ఇవ్వాలని కూడా శ్రీ కరంజియా, శ్రీ రాఘవన్‌లు సుప్రీంకోర్టును కోరారు. లోకసభ స్పీకర్ తదితర ప్రతివాదులచర్య రాజ్యాంగపు 19 (1) (ఎ), (బి); 21 నిబంధనల ప్రకారం లభించిన ప్రాథమికహక్కులకు భంగకరమనీ రాజ్యాంగపు 19 (2) నిబంధన ప్రకారము వారి చర్య ఏ చట్టాన్నీ అనుసరించి జరిగినది కాదనీ రిట్ లో వాదులు పేర్కొన్నారు.

సభాహక్కుల నేరముపై క్షమాపణ చెప్పుకోడానికి లోకసభ ముందు హాజరు కావలసినదిగా పిలువబడిన లోంబాయి వారపత్రిక బ్లిట్జ్ సంపాదకుడు ఈ సమస్యపై సుప్రీంకోర్టుకు రిట్ దరఖాస్తు పెట్టుకున్నట్టు తమకు సమాచారం అందినదని నేడులోకసభలో స్పీకర్ తెలిపారు.

శ్రీ ఎస్. జి. గోరే నేడు లోకసభలో నిన్నటి తంతి అనంతరము శ్రీ కరంజియా లేఖ వచ్చిందా అని అడుగగా స్పీకర్ సుప్రీంకోర్టులో రిట్ వేసినట్లు న్యాయమంత్రిద్వారా సమాచారం అందిందని తెలిపారు. తరువాత శ్రీ కరంజియా లేఖ కూడా చేరింది. తాను సుప్రీం కోర్టుకు పోతున్నట్లా లేఖలో ఉంది.

నిమ్మట స్పీకర్ తరపున, లోకసభ కార్యదర్శి తరపున హాజరయ్యేందుకు ఒక న్యాయవాది ప్రతినిధిని ఏర్పాటు చేయాలని అటార్నీ జనరల్‌ను ఆదేశించడానికి లోకసభ నిర్ణయించింది. డిప్యూటీస్పీకర్ హనుమంతయ్య ఇదుకై తెచ్చిన తీర్మానం ఆమోదింపబడింది. ఇటువంటి ఏర్పాటు అవసరమా అని కొంతచర్చ జరిగింది. ఎక్స్‌పార్టీ నిర్ణయము జరగడం తనకు ఇష్టంలేదని స్పీకర్ అన్నారు.

శ్రీ కరంజియా లేఖను లోకసభవారు సోమవారంనాడు పరిశీలిస్తారు.

పోస్టల్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాల దొంగలు

రు. 1 లక్ష 60 వేల స్వాహా

గయా, ఆగస్టు 25

పోస్టల్ డిపార్టుమెంట్‌ను మోసగించి రు. 160 వేల వరకు కాజేసిన దొంగల ముఠాను పట్టుకోవడానికై దేశ వ్యాప్తముగా పోలీసు సిబ్బందికి హెచ్చరిక ఇవ్వబడింది.

ఈ దొంగలముఠా ఇట్టి వ్యాపారాన్నే పెక్కు రాష్ట్రాల్లో చేసిందట. పోస్టాఫీసులలోని సేవింగ్స్ బ్యాంకు ఖాతాల మార్పిడము సేవింగ్స్ బ్యాంకు ఖాతాపుస్తకాల దొంగిలించడము వల్ల ఈ ముఠా పై మొత్తాన్ని కాజేసింది.

ఎవరెస్టును వదులుకోము

నేపాల్ రాజు ప్రకటన

ఖాట్మాండు, ఆగస్టు 25

ఎవరెస్టును నేపాలీయు దెవ్వడూ వదులుకోడని నేడు నేపాల్ రాజు మహేంద్ర విలేఖరుల గోష్ఠిలో అన్నారు. సరిహద్దు సమాలోచనలు నేపాల్ చైనాలమధ్య ప్రగతి పూర్వకంగానే ఉన్నాయనీ తాను వచ్చే నెలలో పెకింగ్ వెళ్లినప్పుడే సమస్యపై చైనా చైనా అధికారులతో చర్చిస్తానని అన్నారు.

గయా జిల్లాలో కలరా వ్యాధి

1234 మంది మృతి

గయా, ఆగస్టు 25

గయా జిల్లాలో గత మూడునెలలందు 1008 మంది కలరా వల్ల మరణించారు. ఆగస్టు 19 వ తేదీతో అంతమైన వారములో 166 మంది చనిపోయారు.

ఈ అంటెలలో గయా పట్టణంలో చనిపోయిన 60 మంది చేర్పబడలేదు.

.....

సర్దార్ పటేల్ కంచు విగ్రహం

హైదరాబాదు, ఆగస్టు 25

పబ్లిక్ గార్డెన్స్‌కు యెదురుగా మున్సిపల్ కార్పొరేషన్ నెలకొల్పదలచిన సర్దార్ పటేల్ నిలువెత్తు కంచువిగ్రహము మరో రెండు వారాలలో తయారు కాగలదని తెలుస్తున్నది.

విగ్రహాన్ని వుంచు దిమ్మను యేర్పాటు చేయుటకయి కార్పొరేషన్ సొమ్మును మంజూరు చేసిన తరువాత విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమము నిర్వహించబడుతుంది.

ఇండియాపై పాకిస్తాన్ యుద్ధానికి దిగబోదు

మార్షల్ ఆయూబ్‌ఖాన్ ప్రకటన

కరాచి, ఆగస్టు 25

భారతదేశముపై పాకిస్తాన్ దురాక్రమణకు దిగబోదని ఆ విధముగా చేయడము పాకిస్తాన్‌కు ఆత్మ విధ్వంసనకరము కాగలదని పాక్ అధ్యక్షులు ఆయూబ్‌ఖాన్ ప్రకటించాడు

పాకిస్తాన్ అంతర్జాతీయ వ్యవహారాల సంస్థలో 70 నిముషాల సేపు ప్రసంగిస్తూ యునైటెడ్ స్టేట్స్‌నుండి పాకిస్తాన్ సైనిక సహాయాన్ని పొందుతూ ఉన్నా పాకిస్తాన్ సైనిక బలము భారతదేశ సైనిక బలంలో మూడవ వంతు మాత్రమే కలదని తెలిపారు.

గోవా విముక్తికై హంగెరీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, ఆగస్టు 25

హంగెరీ ప్రధాని ఫెరంక్ మునిక్ నేడు ఎర్రకోటలో జరిగిన పౌర సన్మానసభలో ప్రసంగిస్తూ గోవా, డయ్యూ, డామన్‌లలో పోర్చుగీసు వలసతత్వాన్ని తొలగద్రోయడానికై ఇండియా చేస్తున్న కృషిని హంగెరీ పూర్తిగా బలపరుస్తున్నదన్నాడు.

వలసరాజ్య తత్వానికి తుది ఘడియలు సమీపించాయనీ తమ ప్రభుత్వాలు ప్రజలూ భావిస్తున్నట్లు మునిక్ అన్నాడు. కలోనియల్ పద్ధతి తక్షణమే రద్దుకావాలని హంగెరీ కోరుతున్నదన్నాడు.

సంత్ ఫతేసింగ్ అమృతసర్ ప్రయాణం

గౌరవప్రదమైన సహేతుక ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను నెహ్రూ సూచించలేదట

న్యూఢిల్లీ, ఆగస్టు 25

పంజాబీ సూబా సమస్యపై మూడుదినాలుగా ప్రధాని శ్రీ నెహ్రూ-అకాలీ అధ్యక్షుడు సంత్ ఫతేసింగ్‌లు జరుపుతున్న మంతనాలు నేడు 90 నిమిషాలపాటు సాగిన పిమ్మట దాదాపు విఫలమైనాయి. మంతనాలకై తను ఇద్దరిమధ్య ఒక ప్రాతిపదికయేకుదరలేదని ఫతేసింగ్ ప్రకటించాడు. అకాలీ కార్యవర్గానికి పరిస్థితిని నివేదించేందుకు ఫతేసింగ్ ఈ రాత్రికే రైల్లో అమృత్‌సర్ బయలు దేరివెడుతున్నారు.

ప్రధానిబసనుండి బయటికి రాగానే ఫతేసింగ్‌ను విలేఖరులుచుట్టుముట్టారు. కానిఆయన ఏమీచెప్పనిరాకరించాడు. అక్కడ నుండి రాకబ్‌గంజ్ గురుద్వారాకు వెళ్ళి ప్రధానులైన అకాలీ నాయకులతోను, సానుభూతిపరులతోను ఫతేసింగ్ చర్చించాడు. మరో పావుగంటకు అకాలీదళ కార్యదర్శి జ్ఞానీ అజ్మీర్ సింగ్ బయటికివచ్చి నెహ్రూ - ఫతేసింగ్ చర్చలు ముగిసిపోయినట్లు ఒక ప్రకటన చదివాడు.

ప్రధానిని తాను ప్రత్యామ్నాయ ప్రతిపాదనలుసూచించాల్సిందిగాకోరానని సహేతుకమైన గౌరవనీయ ప్రతిపాదన ఏమీ ప్రధాని నుండి రాలేదనీ యీ పరిస్థితిలో తాను అమృతసర్‌కు తిరిగి వెళ్ళిపోతున్నాననీ ఫతేసింగ్ వెల్లడించిన ప్రకటనలో ఉంది.

ఈఉదయంనుండే ప్రతిష్టంభన పరిష్కారానికై నేపథ్య ప్రయత్నాలు చాలా చురుకుగా సాగాయి. పాటియాలా మహారాజా కేంద్ర హోంమంత్రి శ్రీ లాల్ బహద్దర్ శాస్త్రి, పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హాను కలిసి చర్చించారు. ఆయన ఢిల్లీలోని ఆర్యసమాజ నాయకుల్ని కూడా కలిశారు. మాస్టర్ తారాసింగ్ 11 దినాల ప్రాయోపవేశ విరమణకు అనువుగా వారి దృక్పథంలో మార్పు సాధ్యపడుతుందేమోనని పాటియాలా మహారాజా ప్రయత్నం చేశారు.

గమనిక

నేడు రాశిపున్నమి పండుగ సందర్భంగా మా కార్యాలయానికి సెలవు. కావున రేపటి పత్రిక వెల్వడదు.

మేనేజర్
గోలకొండ పత్రిక

నెహ్రూకు లేఖ:

చండీగఢ్‌లో జాగ్రత్తలు

ఢిల్లీ చర్చల వైఫల్యంవల్ల చండీగఢ్‌లోని అకాలీలు తీవ్రనిరాశకు గురయ్యారు. భద్రతాచర్యగా చండీగఢ్‌లోని పంజాబ్ మంత్రుల ఇళ్ళవద్ద పోలీసుదళాలు నిలుపబడ్డాయి. రైల్వే, టెలిఫోన్, టెలిగ్రాఫ్, ఎలక్ట్రిక్ సంస్థల రక్షణకు కూడా ఏర్పాట్లు జరిగాయి. ప్రధాన నగరాలన్నింటా యివే జాగ్రత్త చర్యలు జరిగాయి.

నేడు పంజాబ్‌నుండి 14 గురు ఎం. పి. లు ఒక లేఖను ప్రధానినెహ్రూకు వ్రాస్తూ ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రాన్ని మార్చవలదనీ ప్రజాప్రతినిధులను విశ్వాసములోకి తీసుకొని చర్చించనిదే సమస్యపై నిర్ణయంకూడదనీ అభ్యర్థించారు. వీరిలోహిందువులూసిక్కులూ కూడా ఉన్నారు.

హైదరాబాదు మత్తుమందుల చట్టం ప్రకారం క్లోరల్ హైడ్రేట్ మత్తుమందుగా రాష్ట్రగవర్నర్ ప్రకటించారు.

హిందూ మహాసముద్రంలో 5 వేల అడుగులలోతున 9వేల అడుగులఎత్తు పర్వతం

న్యూఢిల్లీ, ఆగస్టు 25

రష్యాకు చెందిన సాగర శాస్త్ర పరిశోధన నౌకలోని శాస్త్రజ్ఞులు సిలోన్‌కు ఆగ్నేయంగా 550 మైళ్ళ దూరంలో హిందూ మహాసముద్రంలో జలనిమగ్నమై ఉన్న 9,000 అడుగుల పైచిలుకు ఎత్తుగల పర్వతం ఉన్నట్లు కనిపెట్టారని ప్రపంచ విద్యావైజ్ఞానిక సంస్థ వారి ఒక నివేదిక మూలముగా తెలుస్తున్నది. అగ్ని పర్వతాల జాతికి చెందిన ఈ పర్వతానికి అనేక శిఖరాలు ఉన్నాయి. వాటిలోఅన్నింటికంటెఎత్తయినది జలోపరిభాగానికి 5,000 అడుగుల క్రిందుగా ఉన్నది.

దీనికి వారు హిందూ మహాసముద్రంలో ప్రయాణించిన మొట్టమొదటి రష్యన్ ప్రయాణికునిపేరిట "అఫనాసినికిటిన్" అని పేరు పెట్టారు.

కొత్తచక్కెర ఫ్యాక్టరీలకు మంజూరీ ఉండదు

లోకసభలో ఆహార ఉపమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 25

దేశంలో పంచదార ఉత్పత్తి అధికంగా ఉండడంవల్ల ప్రస్తుతం పంచదార పరిశ్రమలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి లైసెన్సులు ఇవ్వకూడదని భారత ప్రభుత్వం నిశ్చయించిందనీ, లైసెన్సులు మళ్ళీ ఇవ్వడానికి నిశ్చయించడం జరిగితే అప్పుడు కొత్త పంచదార ఫ్యాక్టరీల స్థాపనకు అనుమతి కోరుతూ ఇదివరలో పెట్టుకొన్న దరఖాస్తులను, పెండింగులో ఉన్న వాటిని, పరిశీలించడం జరుగుతుందనీ, కేంద్ర ఆహారశాఖ ఉపమంత్రి శ్రీ ఏ. ఎమ్. థామస్ లోకసభలో కొన్ని ప్రశ్నలకు లిఖితంగా జవాబిస్తూ చెప్పారు.

నర్మదానది పొంగులు

ఇందోర్, ఆగస్టు 25

నర్మదానది పొంగడం వల్ల ఇక్కడికి 60 మైళ్ళ దూరంలోగల కాలిఘాట్ బ్రిడ్జిపై 8 అడుగుల ఎత్తుగా వరదనీరు ప్రవహిస్తున్నది. ఈ నది వరదలవల్ల బొంబాయి అగ్రాజాతీయ రహదారిపై శకటముల రాకపోకలు నిలిపివేయబడినవి.

పోచంపల్లిలో హైస్కూలు

నల్లగొండ, ఆగస్టు 25

తొలి భూదాన గ్రామమైన పోచంపల్లిలో హైస్కూలు తెరువబడినది. రాయగిరిలో మిడిల్ స్కూలు తెరువబడింది.

సమితిలో ఆఫ్రేషియా తీర్మానానికి మెజార్టీ

మాజీ ఫ్రెంచి ఆఫ్రికాకాలనీ రాజ్యాల మద్దతుతో ఫ్రాన్స్‌కు భంగభంగావకాశం

న్యూయార్క్, ఆగస్టు 25

బ్రాజ్‌విల్ వర్గంగా పేర్కొన బడుతున్న మాజీ ఫ్రెంచి ఆఫ్రికా కాలనీ రాజ్యాలగు మొత్తం 11 రాజ్యాలు బిజెర్టా సమస్యపై యిప్పుడు ఐక్యరాజ్యసమితిలో చర్చించ బడుతున్న ఆఫ్రేషియా-యుగోస్లావియా దేశాల తీర్మానాన్ని బలపరిచాయి. దీనితో 82 రాజ్యాల తీర్మానం సమితిలో గెలుపడం ఖాయమౌతున్నది.

ఈ వేళతో ఆయిదుదినాలుగా బిజెర్టా సమస్యను ఐక్యరాజ్యసమితి చర్చిస్తూన్నది. ఫ్రెంచి ప్రతినిధివర్గం పూర్తిగా సమావేశాల్ని బాయికాట్ చేసింది. నేడు మాజీ ఫ్రెంచి ఆఫ్రికా కాలనీ రాజ్యాలుకూడా తీర్మానాన్ని బలపరచడంతో తీర్మానానుకూలముగా వచ్చేఓట్లసంఖ్య 60 వరకూ పెరిగింది.

బిజెర్టా నుండి తక్షణ ఫ్రెంచి ఉపసంహరణకై చర్చలు జరుగాలని సమితి ముందున్నతీర్మానం డిమాండు చేస్తున్నది.

టునీషియా హక్కుల్ని, ఐక్యరాజ్య సమితిపట్ల చూపవలసిన గౌరవాన్ని నిర్లక్ష్యం చేయవలదని యీ బ్రాజ్‌విల్ వర్గం రాజ్యాలు నేడు ఫ్రాన్స్‌కు విజ్ఞప్తిచేశాయి.

సమితికి భారత ప్రతినిధివర్గం

సెప్టెంబరు 19 నుండి జరిగే ఐక్యరాజ్యసమితి సాధారణ సర్వసభ్య సమావేశానికి భారతప్రతినిధివర్గనాయకుడుగా శ్రీ మీనన్ హాజరు కాగలరని ఢిల్లీనుండి వార్త అందింది. చైనాలోని భారత రాయబారి శ్రీ పార్థసారథి, మద్రాసు మంత్రి శ్రీ ఆర్. వెంకట్రామన్, అస్సాంమంత్రి మొయినుల్ హక్ చౌదరి, సమితిలోనిశాశ్వత ప్రతినిధి సి. ఎస్. ఝా, ఎన్. ఎం. లింగం (రాజ్యసభ), సి. ఆర్. వట్టాభి రామన్ (లోకసభ) ప్రతినిధివర్గ సభ్యులుగా ఎంపికయ్యారట.

ఫ్రాన్స్‌కు బోర్గిబా హెచ్చరిక

ట్యునీస్, ఆగస్టు 25

బిజెర్టా సమస్యపై అంతర్జాతీయ అభిప్రాయాలను ఫ్రాన్స్ నిర్లక్ష్యం చేసేట్లయితేయుద్ధాన్ని తిరిగి సాగించడానికి టునీషియా వెనుకాడదని నేడు అధ్యక్షుడు బోర్గిబా ప్రకటించాడు.

దక్షిణ టునీషియాలో ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ బోర్గిబాటునీషియాకు అంతిమ విజయం ఖాయమేనన్నాడు. టునీషియా నుండి ఫ్రెంచి సేనలు పూర్తిగా వైదొలగడం తప్పనిసరి అని కూడా అన్నాడు. ఐక్యరాజ్య సమితిలో బిజెర్టా సమస్య చర్చించబడుతున్నదంటే టునీషియా సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం అన్ని రాజ్యాలూ పోరాడుతున్నాయన్నమాటేననీ సమితికి యిదొక సవాలువంటిదనీ కూడా బోర్గిబా అన్నాడు.

ఇండో-చైనాలోని విదేశీ సైన్యాలు

ఉపసంహరణకు స్థూలముగా అంగీకారం

జెనీవా, ఆగస్టు 25

ఇండో-చైనా నుండి విదేశీసైన్యాలను సైనిక వ్యక్తులను ఉపసంహరించేందుకు ఇక్కడ లావోస్ సమస్యపై సమావేశమవుతున్న 14 రాజ్యాల సమావేశంలో స్థూలముగా ఒక అంగీకారం కుదిరింది.

దీని వివరాల రూపొందించుటకు డ్రాఫ్టింగ్ కమిటీకి నివేదింపబడినది.

ఉదయపూర్‌లో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపన

త్వరలో నిర్మాణం ప్రారంభం

జైపూర్, ఆగస్టు 25

ఏటా లక్షటన్నుల దుక్కఇనుమును ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీ నిర్మాణపుపనులు రాజస్థాన్‌లోని ఉదైపూర్‌లో త్వరలో ప్రారంభం కాగలవు. యుగోస్లావియా మెటల్ ఇన్‌స్టిట్యూట్ సహాయంతో ప్రయివేటు విభాగంలో ఈ ఫ్యాక్టరీ రు. 8 కోట్లతో నిర్మింపబడుతున్నది. 1964 లో దీనిలో ఉత్పత్తి ప్రారంభమవుతుంది. 1967కు ఏటా లక్ష టన్నుల ఇనుము ఉత్పత్తి లక్ష్యాన్ని అందుకోగలదు.

కటాంగా నిరాయుధీకరణకుసమితి ప్రయత్నాలు ప్రారంభం

ఆత్మరక్షణకు పూనుకుంటామని కటాంగా విదేశాంగమంత్రి ప్రకటన

ఎలిజబెత్‌విల్, ఆగస్టు 25

కటాంగా ప్రభుత్వానికి గల 18 వేల మంది సైనిక పోలీసు బలగాన్ని నిరాయుధం చేసేందుకు ఐక్యరాజ్యసమితి నేడు పని ప్రారంభించింది. ప్రథమ చర్యగా కటాంగా దళాల రాకపోకలపై సమితికిచెందిన 11 వేల మంది బలగం నిఘా ఉంచుతున్నది. ఎలిజబెత్‌విల్‌కు సమితి సేనలు పంపబడుతున్నాయి కూడా

సమితి కటాంగాను నిరాయుధం చేయడానికి పూనుకుంటేఆత్మరక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటామని కటాంగా విదేశాంగ మంత్రి ఇ. కింబా యీ రాత్రి ఒక ప్రకటన చేశాడు. సమితి దళాలు దాడిదాడులు దళాలుగానే పరిగణింపబడుతాయని కూడా అతడున్నాడు.

ఇటీవల ఢిల్లీలోజరిగిన ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య సమావేశాల్లో పాల్గొని వచ్చిన శ్రీ వి. పి. రాఘవాచారి, యం. యల్. సి. శ్రీ వామనరావు అంజుట్లగారలు 1961 ఆగస్టు 26 వ తేదీన సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర కేంద్ర గ్రంథాలయములో సమావేశ విశేషాలను గురించి ప్రసంగిస్తారు.

ప్రాథమికవిద్యారంగంలో ఎక్కువగా కృషి వృథా

లోకసభలో శ్రీమాలి వివరణ: పరిష్కారచర్యగా నిర్బంధ ప్రాథమిక విద్యాపథకం

న్యూఢిల్లీ, ఆగస్టు 25

విద్యారంగంలో ప్రాథమిక స్థాయియందు గణనీయమయిన మేరకే వృథాకృషి జరుగుతున్నదనీ, ఈ విద్యాబోధన వృథా కావడం పైస్థాయిలకు పోయిన కొద్దీ తగ్గుతున్నదనీ నేడు లోకసభలో ఒకప్రశ్నకు విద్యామంత్రి శ్రీమాలి జవాబిస్తూ అన్నారు.

అయితే మునుపు జరిగినంతవృథా కృషి యీనాడు జరుగడంలేదు, అలాయీ వృథాకృషి కూడా క్రమంగా తగ్గుతున్నదని శ్రీమాలి అన్నారు. విద్యారంగానికి జరుగుతున్న నష్టము అంచనా వేయడానికి అఖిల భారత ప్రాతిపదికమీద ఏమీ సర్వే జరుపబడలేదని కూడా శ్రీమాలి అన్నారు.

అయితే ఈ విద్యాబోధన వృథా కావడాన్ని తొలగించడానికి తీసుకుంటున్న చర్యలేమిటని ఒక సభ్యుడు ప్రశ్నించగా సాధారణంగా ఒకటవ తరగతిలో చేరిన పిల్లలు క్రమముగా జారుకుంటున్నట్లు వెల్లడి అయిందనీ నిర్బంధ ప్రాథమిక విద్యద్వారా ఈ వృథా అరికట్టబడుతుందని విద్యామంత్రి చెప్పారు. ఉచితముగా పాఠ్యగ్రంథాలు, పాఠశాలయూనిఫారంలు సప్లయిచేయడంద్వారా కూడావృథా ఖర్చు తక్కువ కాగలదని ఆయన అన్నారు.

డా॥ ఆవోకు పార్లమెంటు శ్రద్ధాంజలి

న్యూఢిల్లీ, ఆగస్టు 25

ఒక హంతకుని తుపాకిగుండ్లకు బలియై నిన్న అనువులుబాసిన నాగాలాండ్ జాతీయవాద సంఘాధ్యక్షుడు డా॥ ఇన్‌కాంగ్లిబా ఆవోకు నేడు పార్లమెంటు ఉభయ సభలూ శ్రద్ధాంజలి ఘటించాయి. లోకసభలో డా॥ ఆవోఆత్మశాంతికై సభ్యులు ఒక నిమిషము నిలబడి మౌన ప్రార్థనజరిపారు.

డా॥ ఆవో విరమరణం పొందారని ప్రధాని శ్రీ నెహ్రూ ఉభయ సభల్లోనూ రుద్ధకంఠంతో ప్రకటించారు.

డా॥ ఆవో మృతికి దురపిల్లుతూ ప్రధాని నెహ్రూ అస్సాం గవర్నర్‌కు ఒక తంతి కూడా పంపారు.

శ్రీ వేమన ఆంధ్రభాషానిలయము (నాంపల్లి)లో మూడవ పంచవర్ష ప్రణాళిక విజయానికి "జాతి ఐక్యత, భావసమైక్యతలప్రాముఖ్యం" అనే విషయంపై శ్రీ చావలి వేంకట హనుమంతరావు (పంచవర్షప్రణాళికా ప్రచారశాఖ ప్రాంతీయాధికారి) 27వ తేదీ ఆదివారం సాయంత్రం 3 గంటలకు ప్రసంగిస్తారు. అనంతరం చలనచిత్ర ప్రదర్శనం కూడా ఉంటుంది.

ఫిబ్రవరి 22-28లోపున ఎన్నికలు: మార్చి 4కు ఫలితాలు: మేలో రాష్ట్రపతి ఎన్నిక

న్యూఢిల్లీ, ఆగస్టు 25

ఫిబ్రవరి 22 నుండి 28లోపుగా దేశంలో జనరల్ ఎన్నికలు జరిపించడానికి అన్ని రాజకీయ పక్షాలూ ఆమోదించినట్లు నేడు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ కె. వి. కె. సుందరం ప్రకటించారు.

ఏవైనా అత్యవసర హేతువులు ఏర్పడితే తప్ప ఈ కార్యక్రమం మారబోదని ఆయన పేర్కొని పార్లమెంటరీ, స్టేట్ నియోజకవర్గాల్లో పోలింగ్ తేదీల్ని జనవరి 15 నాటికి రాష్ట్రపతి, గవర్నర్లు ప్రకటించగలరన్నారు. హిమాచల ప్రదేశ్, కాంగ్రా (పంజాబ్)లో మాత్రం ఎన్నికలు ఏప్రిల్ ఆఖరుకు జరుగుతాయి. (ఫిబ్రవరిలో ఆ ప్రాంతమంతా మంచుతో నిండి ఉంటుంది.)

ఫలితాలప్రకటన ఫిబ్రవరి 28నుండి ప్రారంభమై మార్చి 4తోపూర్తి కాగలదని కూడా శ్రీ సుందరం ప్రకటించారు. ఒరిస్సాలో విజయవంతంగా అమలు పరచబడిన గుర్తు బ్యాలెట్ పద్ధతినే ఈ ఎన్నికల్లోకూడా అమలు పరుచుతారు. పార్లమెంటు సీటుకై తెల్లపత్రం, రాష్ట్రశాసనసభ సీటుకై ఎర్రపత్రం ఉంటాయి.

ఆయా పార్టీల ఎన్నికల ప్రణాళికల్ని ఆలిండియా రేడియో ద్వారా ప్రసారం చేసుకోడానికై అన్ని పార్టీలకూ ఒక కనీస కాలవ్యవధిని పెద్ద పార్టీలకు ఎక్కువ వ్యవధిని కేటాయించే ప్రతిపాదనతో తాను కేంద్ర సమాచార మంత్రిని కలిసి చర్చించనున్నట్లు కూడా శ్రీ సుందరం అన్నారు.

రాష్ట్రపతి ఎన్నిక 1962 మేలో జరుగుతుందనీ ఏప్రిల్‌లో యిందుకుగాను ప్రకటన వెల్వడుతుందనీ కూడా శ్రీ సుందరం తెలిపారు.

రాజ్యసభలోమూడోవంతుసభ్యుల ఎన్నిక (రెండేళ్లకొకసారి జరిగేది) ఏప్రిల్ 2 న జరుగుతుంది. వీరుకూడా రాష్ట్రపతి ఎన్నికలో పాల్గొడానికి అనువుగా ఉంటుందని జనరల్ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్ణయమైనాయని కూడా ఆయన విలేఖరులకు వివరించారు.

సగరానికి రక్షణ మంత్రి రాక

సికింద్రాబాదులో ఎన్.సి.సి. దళాల ప్రదర్శనలు

హైద్రాబాద్, ఆగస్టు 25

1931 ఆగస్టు 27 వ తేదిన రక్షణ శాఖమంత్రి శ్రీ వి.కె. కృష్ణమేనన్ హైద్రాబాద్‌కు వస్తారు. ఆయనగౌరవార్థం ఆరోజు 7-30 గంటలకు సికింద్రాబాదు పరేడుమైదానంలో హెడ్ క్వార్టర్సు 12 వ బెటాలియన్ కెడెట్లు, ఎన్. సి.సి. ప్రదర్శనలు జరుపుతారు.

ప్రదర్శనలలో ఎన్. సి. సి బాల బాలికల పరేడును రక్షణమంత్రి తనఖీ చేయుట, జూనియర్ డివిజన్ బాలురు సామూహికంగా వ్యాయామ ప్రదర్శనలు 15వ ఆంధ్రవైమానిక ఎన్.సి.సి. కెడెట్ల ప్రదర్శనలు, కృత్రిమ యుద్ధ ప్రదర్శన ప్రత్యేకాంశాలు. బాలబాలికల జూనియర్, సీనియర్ డివిజన్లనుండి 200 మంది కెడెట్లు పరేడులో పాల్గొంటారు. ఇందులో ఎ. సి సి. ఎన్.సి.సి. రైఫిల్ దళ సభ్యులు, హైద్రాబాదు పోలీసుబ్యాండు, ఎఐఆర్ కేంద్రంబ్యాండు, ఇ.ఎం.ఇ. కేంద్ర బ్యాండులు కూడా పరేడులో పాల్గొంటాయి. రక్షణమంత్రి ప్రదర్శనలన్నింటినీ తిలకించిన తరువాత వారినివుద్దేశించి ప్రసంగిస్తారు. జంటనగరాల ప్రజలు అధికసంఖ్యలోవచ్చి యీప్రదర్శనలను చూడవలసిందిగా ఎన్.సి.సి. వారు ఆహ్వానిస్తున్నారు. తమపిల్లలు చేసే యీ సాహసోపేతమైన యీ ప్రదర్శనలను ప్రజలుచూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. మొదట్లో యీ ప్రదర్శనలను 1961 ఆగస్టు 26వతేదిన జరపాల్సి వుండెనుకాని రక్షణ మంత్రి 27వ తేదీన ఆదివారం వస్తారుకాబట్టి యీ కార్యక్రమాన్ని కూడా ఆరోజు జరుపడానికి నిశ్చయించారు.

దండకారణ్య ప్రాజెక్టు

2,88 కుటుంబాలకు పునరావాసం

భువనేశ్వర్, ఆగస్టు 25

దండకారణ్య ప్రాంతంలో జూలై అఖరువరకు 2288 కాందిశీరకకుటుంబాలకు పునరావాసం కల్పించబడిందని ఒరిస్సాస్థానికస్వపరిపాలనామంత్రి బీరేన్ మిశ్రా నిన్న ఒరిస్సా శాసన సభలో తెలిపారు. వీరంతా తూర్పు పాకిస్తాన్ నుండి వచ్చినవారు. ఈప్రాంతంలో టికెట్ శరణార్థులెవరూలేరని కూడా వారు సూచించారు.

మీ పిల్లలను అదుపులో పెట్టండి

ఒక వేళ వారు పుస్తకమును 15 ఇంచుల ఎడముగా పెట్టి చదువు అభ్యాసముగలవారైన లేక అధికముగా వంగి వ్రాయువారైనా మరియు దూరపు వస్తువులను కండ్లు చిట్లించిచూచువారైన లేక దీపమును యెదురుగాపెట్టి చదువు వ్రాయువారైన యీ పద్ధతులవల్ల కండ్ల చూపులకు నష్టము కలుగును. ఇట్టి పిల్లలకు కాళ్ళవ్రేళ్ళు లేక పాలు అధికంగా వాడండి. మరియు వెంటనే ఏ నేత్ర పరీక్షకునితోనైన పరీక్ష చేయించండి.

మేనేజర్ పోరూం:

డాక్టర్ లుఖ్మాన్

(నేత్ర పరీక్షకులు)

జనతా ఆప్టీషియన్

నిజాంపాహిరోడ్,

ఫోన్: నెం. 5141. హైద్రాబాద్

స్త్రీలకు పర్దా యేర్పాటు కలదు.

కంటి జోడు కొనువారి నుంచి ఫీసు తీసుకొనబడదు.

మరో 4 రోజులు

గొప్ప వేలం

కీర్తిశేషులైన నవాబ్ సాలార్ జంగ్ బహదూర్ చే సేకరించబడిన అమూల్యమైన వస్తువులను 1961 ఆగస్టు 27, 28, 29, 30 తేదీలు ఆది, సోమ, మంగళ, బుధవారములలో దివాన్ దేవిడి సిటీ ప్యాలెస్ నందు వేలం వేయబడును.

నేడు, తనిఖీ.

రేపు ఉ॥ 10-00 వేలం.

జె. మూసా అండ్ సన్స్,

ప్రఖ్యాత ప్రభుత్వ, పబ్లిక్ ఆక్షనీర్స్

దివాన్ దేవిడి, ఫోన్: 5111.

టార్పాలిన్స్

వర్షాకాల భద్రతకు లభింపగలవు.

DAISY TRADING CORPORATION,
Post Box No. 3185,
BOMBAY- 3,
Gram: 'Prooftalp',
Tel. C/o. 20757

ప్లవ సం॥ శ్రావణ శు॥ పూర్ణిమ ఉ. 7-48 కృ॥సా తె. 5-1 రా. 1-37 ఉ.వ. 10-51 మొ: 12-15 వరకు రా॥ పూర్ణిమ

(శాలివాహన శకము: 4-6-1883)

26-8-1961 శనివారము

ప్లవ సం॥ శ్రావణ బ॥ విదియ రా. 1-33 పూర్వా రా. 10-55 ఉ. వ. 7-18 మొ: 8-43 వరకు

(శాలివాహన శకము: 5-6-1883)

27-8-1961 ఆదివారము

ప్లవ సం॥ శ్రావణ బ॥ తదియ రా. 10-28 ఉత్తా రా. 8-35 ఉ. వ. 7-35 మొ: 9-32 వరకు

(శాలివాహన శకము: 6-6-1883)

28-8-1961 సోమవారము

"వికృతులు మహాదాదిక సప్తక ముభయ విధేంద్రియములు పదియువిషయ పంచకమును మనసును గూడఁగ వికారషోడశక మిది వివేకాభ్యర్థి."

— భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 35280

26 ఆగస్టు 1961

శని వారము

ప్రభుత్వ ఆస్పత్రులు

జీవితావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతూ ప్రతిదాని విలువ పెరుగుతున్నా మానవుని జీవితం విలువమాత్రం దినదినంతగ్గుతున్నది. యుద్ధాలు, అంటువ్యాధులు, కరువులు, ప్రమాదాలవల్ల ప్రతిరోజూవేలాది మంది చనిపోతున్నా కారుణ్యభావం నశించి ఎవరికీ చీమకుట్టినట్లయినా లేకుండా పోతున్నది.

సామాన్యులకు బ్రతుకుదెరువే దుర్భరమై పోతున్న ఈరోజుల్లో ప్రభుత్వం ప్రజల ఆరోగ్యరక్షణకై విరివిగా ఆస్పత్రుల తెరుస్తున్నా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో అవి ప్రస్తుతావసరాల తీర్చగలగడంలేదు. ఆస్పత్రుల్లో కొత్త విభాగాల ఏర్పరచి పడకలసంఖ్య పెంచుతున్నా ప్రయోజనం కలుగడంలేదు. గోరుచుట్టుపై రోకటిపోటులా ఆస్పత్రులలో ఉండే డాక్టర్లు ఇతర సిబ్బంది ప్రవర్తన స్వార్థపూరితంగా మారి రోగులకు తీరని అన్యాయాన్ని చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నటుల తయారవుతున్నది.

నిన్నటి పత్రికలలో పడిన ఒక వార్త మన ఆస్పత్రులు ప్రజా సేవను యేవిధంగా చేస్తున్నా యో చెప్పకచెబుతున్నది. ఇట్టి సంఘటనలు ఒక్క విక్టోరియా జనానా ఆస్పత్రికి సంబంధించినవి మాత్రమేకావు. దాదాపు అన్ని ప్రభుత్వఆస్పత్రులపరిస్థితి ఇంతేను. డబ్బు గుమ్మరించడమో లేక మరేవిధంగానైనా ఇన్‌ఫ్లుయన్సు చేయగలుగడమో సాధ్యమైతేనే గాని ఆస్పత్రుల్లో రోగులకు అడ్మిషన్ దొరకదు. రోగాలు కుదిరినా కుదరకపోయినా ఔషధమనే రంగునీళ్లు లభించవు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగికి ప్రవేశం కల్పించడానికై సాధారణులకు లభించే మార్గం ఒకటే. జబ్బు ఎంత తీవ్రంగా ఉన్నా ఆస్పత్రిలో బెడ్ దొరకదు. ఔట్ పేషెంట్‌గా ఉండి పోసే రంగునీళ్ళను త్రాగి పొమ్మంటారు. అసలుకు జబ్బు పరీక్షలేకుండానే మొహంచూచి మందు వ్రాస్తారు. ఆ యా ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్ల ఇండ్లకు వెళ్ళి కన్సల్టింగు ఫీజు ముట్టచెబితే వారు పనిచేసే వార్డులలో అడ్మిషన్ దొరుకుతుంది. రోగనిర్ణయంగూర్చి జరిపే వివిధ పరీక్షల ఫలితాలు సవ్యంగా ఉంటాయి. పాతరోగులలోఒకర్ని బెడ్‌పై నుండి దింపి మరొకరిని బెడ్‌పైకి మారుస్తారు. ప్రభుత్వం సరఫరాచేసే మందులు తమ పేషెంట్లకు వాడుకొని మిగతా వారిని డిస్టిల్డ్ వాటరుతో సహా ప్రతిచిన్న ఔషధాన్నీ కొనుక్కొ తెచ్చు కొమంటారు. ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఇది ప్రతిసాధారణుని అనుభవం.

డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆస్పత్రుల్లో చేర్చుకోనందు వల్ల రిక్షాలలో నీళ్ళాడినవారు, వ్యాధులు ముదిరి ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో ఉన్నారు. ఇట్టి ప్రతిసంఘటనా పత్రికలకు ఎక్కేఅవకాశం ఉండకపోవడం సహజం. ఆస్పత్రుల్లో ఏదోవిధంగా రోగులకు ప్రవేశం లభించినా అట్టివార్ని ఇన్‌చార్జి డాక్టర్లు స్వయంగాచూడక శిక్షణ పొందే మెడికల్ కాలేజి విద్యార్థులచే వారిప్రాణాలపై ప్రయోగాల జరిపించడం జరుగుతూ వుంటుంది. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ సారధ్యాన్ని చేపట్టినా ఇట్టి అవకతవకలు, కుళ్ళు నిర్మూలనం చేయడం సాధ్యం కావడంలేదు. కొన్ని ప్రభుత్వఆస్పత్రుల్లో మందులుంటే డాక్టర్లు ఉండరు. డాక్టర్లుఉంటే ఔషధాలుఉండవు. ఇట్టివార్తలుజిల్లాలనుండితరచుగా వస్తుంటాయి. ఇట్టి శోచనీయ పరిస్థితిని అంతమొందించవలసిన అవశ్యకత ఎంతోకలదు. రోగులపట్ల నిరాదరణ నిర్లక్ష్యభావం తగ్గడానికి, ఆస్పత్రులలో అవినీతి నిర్మూలనకు తొలిమెట్లుగ ప్రభుత్వం, గవర్నమెంటు ఆస్పత్రులలో పనిచేసే డాక్టర్లు ప్రయివేటుప్రాక్టీసు చేసుకోకుండా నిషేధించడం అత్యవసరం. ప్రజాసంక్షేమం కొరకు ప్రభుత్వం వివిధపథకాలను, స్కీములను అమలుపరుస్తున్నా అవన్నీ తొట్లలో పెంచబడే కోటన్ మొక్కల్లా ఉన్నాయేకాని వాని వల్ల ఆశించినంతగా ప్రజలకు ప్రయోజనం కాన్పించడంలేదు.

ఆర్. టి. సి. బస్సులు

జంటనగరాలలోనేకాక జిల్లాలలోనుఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ వారిబస్సులు ప్రయాణీకులకుఉపయోగకరంగా సేవ చేయగలుగుతున్నా ఈ మధ్య తెలంగాణా జిల్లాలలోని నారాయణ్‌పేట్, నిర్మల్, ఖమ్మం మొదలగు డిపోలలోగల కొన్ని బస్సులు అతిపాతవిగా ఉండడం వల్లమధ్యలోఫెయిలయి ప్రయాణీకులకు యిబ్బందులు కలుగుతున్నటుల తరుచుగా వార్తలు వస్తున్నాయి. కోర్టులు, హైద్రాజులు మొదలగు ముఖ్యమైన పనులకు వెళ్ళవలసినవారు ఇట్టి బస్సులలో ఎక్కడంవల్ల వారిపనులు చెడిపోయి ప్రజలకు తీరని అసౌకర్యం కలుగుటయేకాక కొన్ని సందర్భాలలో ప్రభుత్వానికి నష్టకారణ మవుతున్నది.

పూర్తిగా పనికిరాని పాత బస్సుల తీసివేయడం ఎప్పటికప్పుడు మరమ్మతు చేసి ప్రయాణయోగ్యంగా ఉన్నవానినే నడుపడం అవసరం. లేనిచో రైళ్ళకన్నా సరియైన సమయానికి ప్రయాణీకుల చేరవేస్తూ సమర్థంగా పని చేస్తున్నదని ఈ కార్పొరేషన్ తెచ్చుకున్న ప్రాచుర్యానికి ఆఘాతము కలుగగలదు.

ఆర్. టి. సి. కార్పొరేషన్ తన కార్యకలాపాల విస్తరించడం క్రొత్త రూట్లు చేపట్టడం సర్వదా హర్షణీయమే. సర్వీసుల విస్తరణ పేరుతో పాత రూట్ల నిర్లక్ష్యం చేయరాదు. తెలంగాణా ప్రాంతపు డిపోలలోగల పాత బస్సుల స్థానే క్రొత్త బస్సుల వేయడం సముచితమైన చర్య కాగలదు. జంటనగరాలలో ఎన్ని బస్సుల వేసినను ప్రయాణీకుల రద్దీ తగ్గడంలేదు. కావున ఇచ్చట గూడా బస్సుల సంఖ్యను పెంచవలసిన అవసరం కలదు.

ఈమధ్య ఆర్. టి. సి. వారు ప్రచురించిన టైంటేబుల్ గైడ్సులో ముఖ్యంగా జిల్లాల టైంటేబుల్ గైడ్ చాలా లోపభూయిష్ఠంగా ఉన్నది. దీనిలో బస్సుల రాకపోకల వేళలతో పాటు ప్రయాణపు ఛార్జీలగూడా చేర్చడం లగేజి ఛార్జీలను ఆర్. టి.సి. బస్సుల రూట్లను తెలిపే పటాన్ని జోడించడం అవసరం. టైంటేబుల్ గైడ్‌లో ఆర్. టి. సి. సర్వీసులు గల చారిత్రక తదితర ప్రధాన స్థలాల సంక్షిప్త చరిత్రను ఇచ్చినచో ప్రయాణీకులకు ఎక్కువ ప్రయోజనకారిగా ఉండగలదు.

ఆయుర్వేద అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

లభిస్తుందని ఉపముఖ్యమంత్రి ప్రకటన

హైద్రాబాదు, ఆగస్టు 25

భారతదేశంలోఆయుర్వేదానికి విశేషమయిన గౌరవ ప్రపత్తులుండేవి. ధన్వంతరి కాలంలో యీ వైద్యశాస్త్రము ఉన్నత స్థాయినందుకొన్నది. ఈదేశాన్ని విదేశీయులు ఆక్రమించుకొన్న తర్వాత యీవైద్య శాస్త్రము ప్రతిభ సన్నగిల్లడానికి అవకాశమేర్పడింది. పునః ఆయుర్వేదం పూర్వపు ఔన్నత్యమును పొందుటకు ప్రభుత్వంశ్రద్ధతీసుకొని చేస్తున్నదని ఉపముఖ్య మంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డి నిన్న వెల్లడించారు.

ఉపముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డినిన్న యిక్కడ ఐ.ఎం.ఎం ఏ. హాలులో జరిగిన ఆయుర్వేద పట్టభద్రుల ప్రథమ సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డా॥ కె. హరిహరస్వామి అధ్యక్షత వహించారు. ఉపముఖ్య మంత్రి తమ సంగమములో ఆయుర్వేదమతర్వాత యూనానీ, అల్లోపతి వైద్యవిధానాలు దేశంలో వ్యాప్తిచెందాయని, ఇప్పుడు అల్లోపతి వైద్యము ప్రథమస్థానమాక్రమించివుందన్నారు. వైద్యశాస్త్రంలో ఒక భాగంగా ఆయుర్వేద విధానం గుర్తించబడిందని దానిచేయీదేశంలో వైద్యులు చికిత్సచేయటం తటస్థిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

డా॥ కె. కె. శర్మ అతిథులకు సభికులకు స్వాగతం చెప్పారు.

డా॥ హరిహరస్వామి చేసిన అధ్యక్షోపన్యాసంలో ఆయుర్వేదం వైద్యశాస్త్రానికి సంబంధించినది కాదని చెప్పే అభిప్రాయం కాలగర్భములో కలిసిపోయిందన్నారు. ఆయుర్వేద వైద్యమునకు శాస్త్రములో ఒకవిశిష్ట స్థానము కలదని. దానిలోకృషిచేయు వృత్తి విద్యార్థులకుపయోగపడేశాస్త్ర పరిశోధనావకాశములుకల్పించిపోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారాయన.

అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకనిధి

విరాళాలకు ముఖ్య మంత్రి విజ్ఞప్తి

హైద్రాబాదు, ఆగస్టు 25

రాష్ట్రపిత అమరజీవి పొట్టి శ్రీరాములుకు గౌరవస్మృతి చిహ్నమేర్పాటు చేయుటకయి యేర్పాటు చేసినవిధికి ఉదారంగా విరాళాలిచ్చి తోడ్పడవలసిందని అమరజీవి పొట్టి శ్రీరాములు 60 వ జన్మదినోత్సవ సంఘ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య తెలుగువాడు ప్రజలకు నిన్న విజ్ఞప్తి చేశారు.

భారత జాతిపితగా పూజ్య బాపూజీని గుర్తించి స్మరించిన విధముగా ఆంధ్రజాతికి పితగా అమరజీవి పొట్టి శ్రీరాములును స్మరించి ఆరాధించుకొనవలసివున్నది. అమరజీవి ఆంధ్రప్రదేశ్ అవతరణకు శంకుస్థాపన చేశారు. ఆయన జీవితం ఆంధ్రులకు ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి తమ విజ్ఞప్తిలో పేర్కొన్నారు.

నగర మేయర్‌కు విస్తృతాధికారాలు

1955 హైద్రాబాదు మున్సిపల్ చట్టాన్ని సవరించి వీలును కల్పించాలని శ్రీ దుసాజ్ సూచన

హైద్రాబాద్, ఆగస్టు 25

హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 1955 చట్టాన్ని సవరించి మేయర్ అధికారాలను పెంచాలని మొన్న జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో పదవీ విరమణచేసిన మేయర్ శ్రీ వేదప్రకాశ్ దుసాజ్ సూచించారు

అధికార వికేంద్రీకరణ తర్వాత మేయర్‌కు కూడా విస్తృతాధికారాలను కల్పించాల్సిన అవసరమేర్పడిందని ఆయన అన్నారు. కార్పొరేషన్ నిత్య వ్యవహారాల విషయంలో మేయర్ నామమాత్రా పళిష్టుడుగా యున్నాడని మేయర్‌కు విస్తృతాధికారాలను కల్పించేందుకై ఒక సంఘాన్ని నియమించాలని ఆయన చెప్పారు.

ప్రస్తుతం గ్రేటర్ హైద్రాబాద్ కార్పొరేషన్ ఆదాయం రు. 1 54 కోట్లు వున్నదని, యితర కార్పొరేషన్లతోపోల్చిన యిదిచాలాస్వల్పమని, ఆదనపు పన్నులు వేయుటకు కూడ అవకాశంచాలా తక్కువని, ఆదాయాన్ని పెంచాలన్న విద్యుత్తు, రోడ్డు రవాణా మొదలగు రాబడిశాఖలను కార్పొరేషన్‌కు స్వాధీనపరచాలని, బొంబాయి కార్పొరేషన్ హాటిని నిర్వహిస్తున్నదని, బొంబాయికి ఒక పరిశీలకబృందాన్ని పంపి అదిసమర్పించు నివేదికను ప్రభుత్వ పరిశీలన కందజేయాలని శ్రీ దుసాజ్ అన్నారు.

వ్యాపారరీత్యా పెద్దహోటళ్ళు, సినిమాలు, మందులదుకాణాలు కార్పొరేషన్ స్థాపించాలని ఆయన సూచించారు. అలాచేసిన కార్పొరేషన్‌కు లాభముదక్కుటేకాక నమ్మకమైనవరుకు ప్రజలకు లభిస్తుందని శ్రీదుసాజ్ అన్నారు. పూలాలో పశు పరిశ్రమలను కూడా కార్పొరేషన్ స్థాపించవచ్చని ఆయన తెలిపారు.

'నగరాన్నిక్రమంగాఅభివృద్ధిపరచుటకు ఒక రక్షణ బెల్టును యేర్పాటు చేయాలి. పాతపట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించి యితర ప్రాంతాలతో సమానంగా తెచ్చుటకు యత్నించాలి, అన్నారు శ్రీ దుసాజ్.

సచివాలయ భవననిర్మాణ విషయంలో కార్పొరేషన్ చేసినతీర్మానాన్ని ముఖ్యమంత్రి కందజేయగా స్థానిక పరిపాలన మంత్రి కందజేయుమని ఆయనచెప్పారని శ్రీ దుసాజ్ తెలిపారు.

నూతనంగా ఎన్నుకోబడినమేయర్ శ్రీరామమూర్తికి ఆయన స్వాగతం చెప్పారు. అంతకుముందు గత సంవత్సరం మేయర్ శిబిరాల నిర్వహణ వల్ల సాధించిన విజయాలను ఆయన వివరించారు. తన పదవీకాలంలో కార్పొరేటర్లు, కమిష్నర్, తదితర సిబ్బంది యిచ్చిన సహకారానికి శ్రీ దుసాజ్ కృతజ్ఞత తెలిపారు.

సింగపూర్-మలయాల ఏకీకరణ

త్వరలో సంభవమని సింగపూర్ ప్రధాని వివరణ

సింగపూర్, ఆగస్టు 25

సింగపూర్ పొరుగునగల మలయాలో లీనంకావడం 1963 వరకు సంభవం కావచ్చని సింగపూర్ ప్రధాని లీలీకాన్ యు నిన్న ఇక్కడ తెలిపారు.

ఈ లీనీకరణ పైరెండు ప్రాంతాల అధికారుల మధ్య సంప్రదింపులు జరుగుతున్నవి.

స్వల్పవ్యవధి సర్టిఫికెట్ కోర్సు

హైద్రాబాద్, ఆగస్టు 25

ప్రభుత్వంచే గుర్తింపబడిన పాఠశాలల్లో పనిచేయుచున్న పట్టభద్రులైన ఉపాధ్యాయులను స్వల్పవ్యవధి సర్టిఫికెట్ కోర్సులో చేర్చుకొనుటకు పాఠ్యక్రమిక పెన్షు 1962 జనవరి 20 వ తేదీన నిర్వహింపబడునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపరీక్షలకమిషనర్ ఒక ప్రతికా ప్రకటన చేశారు.

ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, ఫిజికల్ సైన్సు నాచురల్ సైన్సు, సోషియల్ స్టడీస్, ఉర్దూ, హిందీ, సంస్కృతంలలో ఈప్రాథమిక పరీక్షలు నిర్వహింపబడతాయి. అభ్యర్థులు 1961 సెప్టెంబరు మాసాంతంవరకు స్వీయ పత్రాలతో కూడిన కవరు, తదితర అవసర సర్టిఫికెట్లతో దరఖాస్తు ఫారాలను అందజేయాలి. వివరాలు త్వరలోనే గజెట్‌లో ప్రచురింపబడతాయనికూడ ప్రకటించబడింది.

క్రీనీడల క్రింద

ఉపవాస డిండిమ !

ఉపన్యాస డమడమ !!

ఆస్ట్రేలియా వాసి ఒకడు రోజుకు ఒక లోటా నిమ్మరసాన్ని, అర లోటా టొమాటో రసాన్ని త్రాగి 48రోజులు ఉపవాసంఉండి ప్రపంచ రికార్డు బ్రేక్ చేశాడని తాజా వార్త! మహాత్మాగాంధి 42రోజులు మాత్రమే ఉపవాసంచేస్తే అంతకన్నా ఒకరోజు అధికంగా ఉపవాసంచేసి ఈ ఆస్ట్రేలియా వాసి క్రొత్త రికార్డును ఏర్పరచాడని, ఐతే ఈ నిరశన దీక్ష తన బరువును తగ్గించుకోవడానికి మాత్రమే చేశాడని పేర్కొనబడుతున్నది. నిరశన దీక్షలు ఒక్క రాజకీయ కారణాలను పురస్కరించుకొని మాత్రమే కాక వివిధ వ్యాధుల నివారణకు అంతరాత్మ పరిశోధనకు చేయబడుతుంటాయి. లంఘన పరమౌషధమనే నియమాన్ని ఈ రోజుల్లో ఉల్లంఘించే వారు అధికముగా ఉన్నట్టే చీటికి మాటికి వివిధ కారణాల పురస్కరించుకొని ఉపవాసాలు ఉండేవారుగూడా అధికముగానే ఉన్నారు.

ఆధ్యాత్మిక ప్రభావమైన మన దేశంలోనే కాదు దారిద్ర్యంతో అలమటించే మన భారతదేశంలాంటి అనేక దేశాలలో బలవంతపు బ్రాహ్మణార్థాలలాగేమివల్లతప్పని సరిగా ఉపవాసాలు చేసేవాళ్ళు చాలామంది ఉంటారు. పూర్వాచార పరాయణులు ఆదివారాలు, శనివారాలు, ఏకాదశీ తదితర పర్వదినాలలో ఒంటిపూట భోజనం చేసి శీర్ణావయవ మండలానికి విశ్రాంతిని కల్పిస్తుండటం కద్దు. ఉపవాస విద్య అనేది మన మునలమ్మలకు పేపిండి ముద్దవంటిది. భార్యపై భర్తఅలిగి భర్తపై భార్య అలిగి గూడా ప్రేమోపవాసాలను పాటిస్తుంటారు. దంపతులు ఈఉపవాసాల పేరుతో వివిధ చిరుతిండ్లను తినడం పండ్లరసాల త్రాగడంవల్ల పేరుకు ఒంటిపూట భోజనమైనా ముప్పూటలా తిన్నదానికంటే ఎక్కువే ఖర్చు అవుతుంది. జపాన్‌లో ఆత్మహత్యలు అధికమైనట్టే మన దేశంలో ఉపవాసాలు చేసేవారి సంఖ్య గూడా అధికం. ఈ రోజుల్లో ఆధ్యాత్మిక తదితర కారణాలవల్ల ఉపవాసాలుండేవారికన్నా రాజకీయ కారణాల పురస్కరించుకుని తుమ్మితే దగ్గితే మొదలుకొన్ని ప్రతి చిన్న సమస్యపై అమరణ నిరశన దీక్షలు బూనేవారు లోకొల్లలుగా ఉన్నారు. చూడబోతే ప్రతీవ్యక్తిదీక్షా గాంభీర్యంలా కాన్పిస్తున్నదే కాని అమరణ నిరశన దీక్షబూని చచ్చినవారు బహు అరుదు. (ఏదో పొట్టి శ్రీరాములును బోలిన ఒకరిద్దరు తప్ప) అందువల్ల అమరణ దీక్షను బూని స్వర్గారోహణకు ఉపక్రమించే వారిని చూడాలనుకునే వారికి తరచుగా ఆశాభంగం కల్గుతున్నది.

మన దేశం స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నప్పటి నుండి నిరశన దీక్షను పూనిన వారెందరో గణాంకశాఖ వారు లెక్కవేసిన పాపాన పోలేదు కాని బహుశః కొన్ని లక్షలు కోట్లు ఉంటారని నా అంచనా. అన్న ద్వేషంవుట్టిన వాళ్ళు, భాషావాదులు, గోహత్యా నిరోధపరులు, శాకాహారులు ఒక రేమిటి ప్రతి ఒక్కరూ ఈప్రాక్టీస్ చేసినవాళ్ళే. దేశంలో తీవ్రంగా ఆహారకొరత ఉన్నరోజుల్లో అప్పటి కేంద్ర ఆహార మంత్రి అయిన కె.ఎమ్. మున్షీ ఒకపూట తక్కువ భోజనంచేసి ఆహారాన్ని పొదుపు చేయాలని సలహా ఇచ్చారు. ఐతే ఆ సలహా అభివృద్ధి నిరోధకమైనది జాతిని నిర్వీర్యం చేసేదని "ఒకపూట నిరశన దీక్షను సాగించండనే" మున్షీ ప్రతిపాదనకు నిరసనగా నిరశనదీక్ష పూనదలచిన హెడా హెడీలు (అధిక బుర్ర కల వాళ్ళని అర్థం) లేకపోలేదు.

మనదేశంలో మూకఉమ్మడి నిరశన దీక్షల సాగించడానికి (సమష్టి సూత్ర యజ్ఞాలకువలె) ప్రయత్నంకొన్ని సందర్భాలలో జరిగినా వ్యక్తి దీక్షల అంతగా అవి ఫలప్రదంకాలేదు. ప్రాచుర్యంవహించలేదు. రాజకీయాలలో రాటుదేలిన రాజకీయ నాయకులకు ఉన్నంతగా ఉపవాసపు పిచ్చి వారి అనుయాయులకు పట్టకపోవడమే ఇట్టి లార్జ్ స్కేల్ ఉద్యమాలు ఫెయిలవడానికి ప్రధాన కారణం. అదికాక ఈ నిరశన దీక్షలలో నాయకులకు లభించినంతగా పబ్లిసిటీ సాధారణ కార్యకర్తలకు లభించదు. ఎవడైనా కార్యకర్త అమరణ నిరశన దీక్ష పూనవలసివస్తే ఖర్మంచాలక ఆతను చచ్చినా పడ్డేవాళ్ళెవరూ ఉండరు. (ఒంధువులు తప్ప)

ఇప్పటి మన కేంద్ర ఆహార మంత్రి ఎస్. కె పాటిల్ చేసే నిత్య ప్రకటనల అనుసరించి మనకు పంచదార ఆహారధాన్యాలకొరతలేదు. ప్రజల చేతుల్లో డబ్బుకొరత తప్ప. అందువల్ల ఆతనుగాని ఆతని అనుయాయులుగాని దేశంలో పెరుగుతున్న నిరశన దీక్షలవల్ల ఆహారధాన్యాలు పంచదార మార్కెట్ మిగిలిపోయి విపరీత విపత్కర పరిస్థితి ఏర్పడుతున్నదని ఎదురు నిరశన దీక్షల ప్రారంభించవలసిన అవసరం ఏర్పడుతున్నది. ఆమెరికాలాంటి ఆహారధాన్యాలు మిగులుగాగల దేశాలు నిరశన దీక్షలు అంటువ్యాధిలా తమ దేశాలకు వ్యాపించకుండా అతిగా తినండని, తిండిపోతుల ఉల్కాగా మేపే ఉద్యమాల ప్రారంభిస్తే బాగుంటుందేమో?

మన దేశంలో ఉపవాసాలతోపాటు నాయకుల ఉపన్యాసాలు గూడా అధికమే. అతిగా వాగే (ఉపన్యసించే) వాళ్ళు ఉపవాసాలుండేవాళ్ళు ఏయే రాష్ట్రాలలో ఎంతెంతమంది ఉన్నారో ఎవరెవరు నిర్విరామంగా ఏడాదికి ఎన్ని గంటలు ఉపన్యాసాల చేయగలరో ఎన్ని దినాలు ఉపవాసాల ఉండగలరో ప్రభుత్వం గణాంకశాఖ వారిచే వివరాల తయారుచేయించి వాళ్ళ మెరిట్ ప్రకారం ఉపన్యాస డమడమ రణగుణ, ఘంటానినాద, ఉపవాస డిండిమ గండభేరుండలాంటి బిరుదుల ప్రసాదిస్తే బాగుంటుంది. ఇట్టి ఉపవాస నిపుణుల దళాల తయారుచేసి అభివృద్ధి లోపదేశాలలో ఆకలి దారిద్ర్యంలాంటి పీడల నివారణకు ఈ దీక్షాపరులు పంపడంవల్ల మనదేశం కీర్తిప్రతిష్ఠలు ఇనుమడిస్తాయనడంలో సందేహం లేదు.

... ...

తిరుపతి వచ్చే భక్తులవల్ల దేవస్థానం వారికి పెరుగుతున్న ముడిశేష సంపదనువినియోగంలోనికి తెచ్చేందుకు త్వరలోనే కృత్రిమ మీసాలు గడ్డాలు, విగ్గుల తయారుచేసే పరిశ్రమ నెలకొల్పబడగలదని సోషలిస్టు సమాజ నిర్మాణానికి దోహదముగా దీనిని గూడా ప్రభుత్వం ప్రయివేటు సెక్టర్‌కే కేటాయించిందని సరిక్రొత్త సమాచారం!

[సిహెచ్]

బెర్లిన్ దారుల నిర్బంధం:

వాయుమార్గ వినియోగంపట్ల రష్యా నిరసన

పాశ్చాత్యరాజ్యాలకు కొత్తపత్రం అందింపు

రష్యా ధోరణికి బ్రిటన్ హెచ్చరిక

మాస్కో, ఆగస్టు 25

పశ్చిమ బెర్లిన్‌లోకి ప్రవేశించేందుకు వాయుమార్గాల్ని వినియోగించుకుంటూ పశ్చిమ బెర్లిన్‌ను విధ్వంస వ్యవహారాల కేంద్రముగా కావిస్తూ పాశ్చాత్య రాజ్యాలు 1945 ఒప్పందాన్ని ఉల్లంఘించడమేకాక ఆఒప్పందపు అంశాల్ని దుర్వినియోగ పరుస్తున్నాయని నేడు రష్యా పాశ్చాత్య రాజ్యాలకు ఒక నిరసన పత్రం అందజేసింది.

పశ్చిమ బెర్లిన్‌లోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలన్నీ మూసివేయాల్సిందిగా నేడు పశ్చిమ బెర్లిన్ నగర ప్రభుత్వం ఆదేశించింది కూడా.

మున్ముందు వాయుమార్గాల్ని కూడా బంధించే బెదిరింపు గానే యీ పత్రం ఉద్దేశింపబడినట్లయితే బెర్లిన్ సమస్యచాలాతీవ్రవ్యవహారంగా మారగలదని బ్రిటిష్ ప్రతినిధి ఒకరు రష్యా పత్రంపై వ్యాఖ్యానిస్తూ హెచ్చరించారు. పాశ్చాత్య రాజ్యాలు పశ్చిమ బెర్లిన్‌ను విధ్వంస కార్యక్రమాల కేంద్రం చేస్తున్నాయన్న ఆరోపణకూడా ఖండించబడింది.

పశ్చిమ జర్మనీ అధికారుల చట్టవిరుద్ధపు గిల్లికజ్జాచర్యల్ని నిలుపుదల చేయాల్సిందిగా కూడా రష్యా పాశ్చాత్య రాజ్యాల్ని కోరింది.

బెర్లిన్ సమస్యపై చర్చలే జరిగితే బెర్లిన్ ప్రవేశమార్గాలపై ఒకరకమైన కంట్రోలును రష్యా డిమాండు చేయడానికి వేటి ఆక్షేపణ పత్రం ప్రాతిపదిక కావించబడుతుందని పరిశీలకులు అన్నారు.

భారతదేశఅంధులకు అమెరికన్ విద్యావేత్త సహాయం

బొంబాయి,

STATE INFORMATION CENTRE
ANDHRA PRADESH
HYDERABAD.

గోలకొండ పత్రిక

వ్యాసాంబుధం

హైదరాబాదు 26 - 8 - 1961 శనివారము

వ్యవసాయ విజ్ఞానం

పైరులతెగుళ్లకు మందులవాడకం రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

పైరులకువచ్చే చీడలు, తెగుళ్ళ నివారణకై ఈనాడు పలురకాల మందులను క్రిమిసంహారక ద్రవ్యములను రైతులు వాడుతున్నారు. వీటిని ఇంగ్లీషులో పెస్టిసైడ్సు, ఫంగీసైడ్సు, ఇన్‌సెక్టిసైడ్స్ అంటారు. వీటిలో డి. డి. టి, బి. హెచ్. సి, ఎండ్రిన్, బోర్డోమిశ్రమం, గామెక్సీన్, ఫాలీడాల్, పెరాథియాన్, హెచ్. ఇ, టి. పి. ద్రావకం, ఆల్డ్రిన్, డీల్డ్రిన్. డి లేన్ ముఖ్యమైనవి. అయితే కొందరు వీటిని తగుజాగ్రత్తగా వాడకపోవడం చేత వీటివల్ల విషప్రయోగం జరిగి ప్రమాదాలు సంభవించినట్లు వార్తలు వింటూ వుంటాము. పోనీ ఇవి ప్రాణాంతకమైనవని చెప్పి వాడకుండా వుందామా అంటే పైరుల రక్షణకివి అత్యవసరమైనవి. వీటిని వాడకపోతే ఒక్కొక్కప్పుడు పైర్లు సర్వనాశనమై దుర్భిక్షం ఏర్పడవచ్చు. కనుక వీటి వాడకంలోనే రైతులు జాగ్రత్త వహించడం అవసరం. ముఖ్యముగా ఈ క్రింది సూచనలను ఆవశ్యం పాటించాలి.

1. ఈ మందులను పిల్లలకు అందకుండా ఒక ప్రత్యేక స్థలంలో భద్రపరచాలి. ఇంటిలోనివారు నేవించే మందుల ప్రక్కన వీటిని పెట్టకూడదు.

2. మూతలు బాగా బిగించి వుంచాలి.

3. ఈ మందుల డబ్బాలపై సీసాలపై లేబిల్సు వుంటాయి. వాటిపై వ్రాసివున్న అంశములను శ్రద్ధగా చదవాలి. వాటిని తొలగించకూడదు. ఆ సూచనలను తప్పక పాటించాలి.

4. ఈ మందులను వాడేప్పుడు చేతులపై తొడుగులేకుండా వుండకూడదు. బట్టో, పాతో చుట్టుకోవాలి.

5. ఈ మందులను వాడేప్పుడు శరీరమంతా బట్ట వుండాలి. వీటిని చల్లేప్పుడు పిచికారీ చేసేప్పుడు తల గుడ్డకాని నిండుటోపీగాని ధరించాలి. పని ముగిసిన తరువాత ఒళ్ళు, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుగుకోవాలి.

6. గాలివాటు ఎటు వుందో ఆ వైపుకు మందు పిచికారీ చెయ్యాలి. లేదా డస్టు చెయ్యాలి. చేతిలో మందు పిచికారీ చేయబడుతున్నప్పుడు గాలి కెదురుగా నిల్చోకూడదు.

7. మందు కొట్టేప్పుడు పిచికారీ చేసేప్పుడు ఏమీ తినకూడదు, త్రాగకూడదు, నమలకూడదు; చుట్ట, బీడి, కాల్చరాదు.

(8) మందు చల్లడం ముగిసిన పిమ్మట తొడుగుకొనివున్న బట్టలు విడిచి, వాటిని ఇతర బట్టలతో కలుపకుండా వేరుగా ఉతకాలి.

(9) మందు చల్లిన తరువాత తల నొప్పి అనిపించినా, తల తిరుగుడుగా వున్నా విష ప్రయోగం జరిగిందేమో తెలుసుకోవాలి. అలా జరిగితే వాంతి కావచ్చు. వెంటనే డాక్టరుకు చూపించాలి. తల నొప్పే కదా అని నిర్లక్ష్యము చేయరాదు. తల నొప్పికూడా విషప్రయోగ లక్షణమే.

(10) మందు, పంటికంటుకున్నట్లయితే బట్టలు విడిచి, నోళ్ళు బాగా తోముకొని స్నానం చెయ్యాలి. కండ్లకు మంటపాటు తగిలితే శుభ్రమైన నీటితో కళ్లు బాగా తుడుచుకోవాలి. ఒకవేళ విషం కడుపులోకి పోతే సాబ్లు వేసిన నీరు పుచ్చుకొని వాంతులు చేసుకుంటే విషపదార్థము బైటికి వెళ్ళిపోతుంది. ఇవన్నీ డాక్టరు వచ్చేలోపుగా చేయవలసిన ప్రథమ చికిత్సలు.

డాక్టరు వచ్చిన తరువాత ఏ మందువల్ల విషప్రయోగం జరిగిందో స్పష్టంగా చెప్పాలి. దాని లేబిలు చూపాలి. కొన్ని మందులకు లేబిల్సు పైనే ప్రథమ చికిత్స పద్ధతులు, నివారణ సూచనలు వుంటాయి.

సిల్వర్ నైట్రేట్, గంధకపు పొడి, అగ్రోసాన్ జి, సెరినాన్ విష ద్రవ్యములు. కనుక వాటితో కలిపిన విత్తనము మిగిలిపోతే దానిని మనుష్యులకు, పశువులకు ఆహారంగా పెట్టకూడదు. ఇవి కలిసిన నీటిని పిల్లలుగానీ, పశువులుగాని త్రాగకుండా చూడాలి. ఆ నీటిలో ఏదైనా రంగు కలిపితే ఎవరూ త్రాగరు.

ఎలుకల బెడద నివారణకై జింక్ ఫాస్ఫేడ్‌ను ఆహారంతో కలిపే పనిని చేతితోగాక గరిటెతో చెయ్యాలి. ఈ పనిని ఇండ్లలోగాక బాగా గాలి ఆడే పసారాలలో, లేదా ఆరుబైట చెయ్యాలి. అలా కలిపిన ఆహారాన్ని పిల్లలు, పశువులు తినకుండా జాగ్రత్త వహించాలి.

ఖటిక పాషాణము (కాల్షియమ్ ఆర్సనేట్), ఉల్లి పాషాణము (లెడ్ ఆర్సనేట్) చల్లిన చేలలోకి పశువులు పోకుండా చూడాలి.

కార్బన్ డైసల్ఫైడ్‌తో విష వాయు ప్రసారం చేసి క్రిమి కీటకాలను నశింపజేయదలచితే తగు జాగ్రత్తగా వుండాలి. కార్బన్ డైసల్ఫైడు నిప్పు తగిలిందంటే మండే స్వభావం గలది. పెద్ద ప్రమాదము జరగవచ్చు. నిప్పు స్పర్శ పనికిరాదు.

ఆహారంగా ఉపయోగించబడే ధాన్యాదులకు, బ్రతికివున్న చెట్టు చేమలకు పట్టిన పురుగును చంపడానికి సల్ఫర్ డయాక్సైడ్ పొగ పెట్టకూడదు.

పారిస్ గ్రీన్, హెచ్.బి.టి.పి. ద్రావకం విష ద్రవ్యాలు. వాటిని జాగ్రత్తగా వాడాలి.

పెరాథియాన్‌ను కాయల కోత తరుణం సమీపిస్తున్నప్పుడు వాడకూడదు. కాయల కోతకు 3 లేక 4 వారాలు ముందు వాడాలి.

(ఐ.సి.ఎ.ఆర్).

గేయ చౌర్యం

గత ఆదివారం సంచికలో శ్రీ డి. ఎస్. మూర్తి అను వారిపేరిట ప్రచురించబడిన "విషపానము" అను గేయం 1958 లో తాము రచించినదేనని శ్రీ సి. నారాయణరెడ్డిగారు మాకు ఒక లేఖ ద్వారా తెలియజేశారు. శ్రీ మూర్తిగారు మొదట యీ గేయాన్ని తెచ్చి తమ పేరు విద్వాన్ శ్రీ డి. ఎస్. నారాయణరెడ్డిగా చెప్పారు. మరునాడు వచ్చి ఆ పేరును శ్రీ డి. ఎస్. మూర్తిగామార్చి ప్రచురించాల్సిందిగా కోరారు.

ఈ తీరున ప్రముఖులైన శ్రీ నారాయణరెడ్డి గారి గేయం చౌర్యం జరిగినందుకు చింతిస్తున్నాం. ఇటువంటి చౌర్యాల తత్వం సాహితీ రంగానికి దురదృష్టకరం.

—సంపాదకుడు
గోలకొండ పత్రిక.

వింతలు : విశేషాలు :

పశ్చిమజాతులు తెల్లగా వుండడానికి కారణం?

మానవజాతి పుట్టుపూర్వోత్తరాల గురించి అనేక సిద్ధాంతాలున్నాయి. ఈమధ్యనే జర్మన్ శాస్త్రవేత్త రిచ్ఛర్డు ఫాస్టర్ మరోకొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అతని పరిశోధనల ఫలితంగా అక్కడి ప్రజలు మొదటి ఆశియాలో వుండేవారనీ, ఆశియా నుంచి యూరప్ వెళ్ళారనీ తెలుస్తుంది. ప్రజలు ఇలా ఆశియా నుంచి యూరప్ వలస వెళ్ళడం సుమారు శతదిలక్షల సంవత్సరాలకి క్రితం జరిగింది. ఆ తర్వాత పదివేల సంవత్సరాలకి, అంటే సుమారు 90 లక్షల సంవత్సరాలకి పూర్వం ప్రపంచంలో మంచుయుగం ప్రారంభమయి సుమారు 12 వేల సంవత్సరాల క్రితం ఆఖరయింది. అప్పట్లో ఆ మంచు నదీనదాలు, మంచుకొండలు, నేటి బెర్లిన్, పారిస్, నగరాలవరకూ అంటే ఇంచుమించు ఉత్తర యూరప్ అంతా వ్యాపించి ఉండేవని ఫాస్టర్ సిద్ధాంతం. మంచు యుగపు ఆఖరి 20 వేల ఏళ్ళలోనూ, మానవులు ఉత్తర సైబీరియా అలాస్కా ద్వారా అమెరికా వలస రావడం జరిగిందనీ, తూర్పు సైబీరియా, బేరింగు జలసంధుల ద్వారా వచ్చారన్నవాదం సరికాదనీ ఈ కొత్త సిద్ధాంతం నిరూపిస్తోంది. ఉత్తరపు మంచు ప్రాంతాలకీ, ఆల్పన్, పిరనీస్ కొండల ప్రాంతాలకీ మధ్య ఆనాటి మనుష్యులు మొదట జంతువుల వేటాడుకుంటూ, పండు ఫలము సేకరించుకుంటూ జీవితం గడిపేవారు. దక్షిణ ఫ్రాంన్సు, ఉత్తర స్పెయిన్‌లోని కొండగుహలలో దొరికిన రాతిశిల్పాల వల్ల, చిత్రలేఖనలవల్ల, ఆ ప్రాంతంలో వాతావరణం ఉష్ణంగానే ఉండేదని తెలుస్తుంది. అక్కడివారు చిత్రించిన జంతువులు ఉష్ణమండలాలతో నివశించే వి కావడం చేతనూ వాటిలో చిత్రించిన మనుష్యుల బొమ్మలకి దుస్తులు ఎక్కువగా లేకపోవడం చేతనూ, పరిశోధకులు ఆప్రాంతం చాలా ఉష్ణంగా వుండేదని భావిస్తున్నారు.

అంతేకాక, రిచ్ఛర్డు ఫాస్టర్ సిద్ధాంతాన్ని అనుసరించి, ఆ ప్రాంతంలో వున్న ఉష్ణవాహిని (గల్ఫ్ స్ట్రీమ్) కూడా, నేటికన్న అనాడు ఆప్రాంతం అంతా ఉష్ణంగా వుండడానికి తోడ్పడిందని, తెలుస్తోంది. అందుచేత నే ఆక్కడి రాతి గుహలలో, నీటి గుర్రాలు, సింహాలు, జింకలు, జిరాఫీలు, వీటి బొమ్మలు కనపడతాయని అతని వాదం. బిస్కే అఘాతం దగ్గర యీ ఉష్ణవాహిని ప్రభావం ఎక్కువగా ఉండేది. దీనివల్లనే డార్‌డోన్, ల్వాయర్, గరోన్, ఆడోర్, నదులు, వాటి ముఖద్వారం, పరిసర, ప్రాంతాలు వేడిగా వుండేవి. రోన్‌కొండల వరకూ యీ ఉష్ణవాహిని ప్రభావం బాగా వుండేది

తన నూతన సిద్ధాంత నిరూపణకి, రిచ్ఛర్డు ఫాస్టర్ మంచు యుగంలో, పిరనీస్ కొండల దక్షిణ చరియలలో మానవులు ఉన్నట్టు ఆధారాలులేవనీ. ఉత్తరపు చరియలలో ఉన్నట్టు ఆధారాలున్నాయనీ అంటాడు.

దీనికి కారణం. ఉష్ణవాహిని వల్ల కల్గిన వేడిని పిరనీస్ కొండలు నిరోధించడంవల్ల దక్షిణ ప్రాంతానికి చేరుకోలేక పోవడంవల్ల, ఆ ప్రాంతం మానవ నివాస యోగ్యంగా ఉండేది కాదని అతను ఋజువు చేశాడు. నేడు ఎడారిగాఉన్న సహారా అనాడు చెట్టు చేమలతో నిండిన పసరిక భూమి. జిబ్రాల్టర్ జలసంధి స్థానే అక్కడ ఒక పదిమైళ్ళమేర ఒక ద్వీపకల్పముండేది. నేటి మాల్టాదీవి శిఖరితో కలిసిఉండేది. ఈ కారణాల చేతనే మంచుయుగపు శిధిలాలలోనూ కళా ఖండాలలోనూ, ఒకేరకపు ధోరణులు; కొన్ని పదాల సమత్వం గోచరిస్తోంది.

అనాడు భూమి దక్షిణ ధృవం, యిప్పటికన్న యింకా దక్షిణాన ఉండేది. ఈ సిద్ధాంతాలని రిచ్ఛర్డుఫాస్టర్ తన "వైట్ బ్రిడ్జ్" అన్న పుస్తకంలో వివరించాడు. అతని సిద్ధాంతం గనుక నిజమయితే. మంచుయుగంలో దక్షిణ ఫ్రాంన్సులో నివశించిన మానవజాతి ఉత్తర ధృవానికి చాలా దగ్గరగా వుండేవారు. నేడు స్టాక్‌హోమ్, ఆస్లో నగరాలు ధృవానికి ఎంత దగ్గరగా ఉన్నాయో, నాటి దక్షిణ ఫ్రాన్సు అంతదగ్గరగా ఉండేది. నేడు స్కేండినేవియాలో ఉండే వాతావరణం అనాడు దక్షిణ ఫ్రాన్సులో ఉండేది.

కాగా, యిటువంటి వాతావరణంలో నేటి యూరోపియన్ల పూర్వులు 50 వేల సంవత్సరాలపాటు నివశించడం చేత, చర్మానికీ, జుట్టుకీ, కళ్ళకీ రంగు కల్గించే పదార్థం దేహంలో కొరత పడింది. మొదట నల్లజాతులకి చెందినా, దీర్ఘమైన శీతాకాలం వల్లనూ, సూర్యరశ్మి తక్కువ కావడం వల్లనూ వారంతా శ్వేతజాతులుగా రూపొందారని అతని సిద్ధాంతం. సరి కొత్తగా ప్రతిపాదించిన యీ వాదం గురించి అనేక సిద్ధాంత రాద్ధాంతాలుండవచ్చు. అయినా యిది గుర్తించతగిన పరిశోధన.

సువాసనగల కీటకాలు

నోబెలు బహుమానాలు పొందిన శాస్త్రవేత్తలు కొందరిమధ్య పశ్చిమ జర్మనీలోని లిండన్ నగరంలో సమావేశ మయారు. ఆ సమావేశంలో, కొద్ది సంవత్సరాలక్రితమే రసాయనక పరిశోధనకోసం నోబెల్ బహుమానం లభించిన ప్రొఫెసర్ బుటేనాంట్ తాను లోగడ, కీటక ప్రపంచంలో అతి చిత్రమైన ఒక పురుగు గురించి తాను జరిపిన పరిశోధనలు ప్రవరించాడు. "సిల్కుమాత్" అనే యీ పురుగులలో ఆడపురుగుకి, మగపురుగుని ఆకర్షించడ కోసం, ఒక రకపు సువాసన వుంటుంది. ఈ శాస్త్రవేత్త ఇరవయి పళ్ళపాటుక్రమపడి అయిదు లక్షల ఆడపురుగులని పట్టుకొని, వాటిలోగల యీ సువాసన పదార్థాన్ని వేరుచేసి, అదేరకం సువాసనగల కృత్రిమ రసాయనక పదార్థం తయారుచేశాడు అయిదు లక్షల పురుగుల నుంచీ యితనికి కంటికి కూడా కనిపించనంత స్వల్పమయిన సువాసన పదార్థం మాత్రమే లభించినా, దానితోనే పరిశోధనలు జరిపి కృత్రిమ రాసాయనిక పదార్థం తయారు చేశాడు.

కాగా యీ పరిశోధన అంతా మనకి పనిలేని మంగలి చేసినపనిలా కనపడవచ్చు. ప్రపంచానికి పనికిరాని క్షుద్రపరిశోధనలా గోచరిస్తుంది. కాని నేడు పరిశోధకులు, యీ రకం పురుగులలో లైంగిక వాంఛ కల్గచేసే యీ పదార్థాలని సాధించి, వాటి సహాయంతో. కృత్రిమ రాసాయనిక పదార్థాలు తయారుచేసి, తద్వారా మానవజాతికి శత్రుకోటిగా పరిగణించే యీగలని, దోమలని యితర క్రిమి కీటకాలని సంహరించాలని వారి మహాశయం. దీనికే వారి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఈ రాసాయనిక పదార్థాల సహాయంతో, అతిప్రమాదకరమైన కలరా, మలేరియా, అంటు జ్వరాలు కల్గచేసే క్రిమి కీటకాలని ధ్వంసం చేయడానికి వారు యత్నిస్తున్నారు.

అదే సమావేశంలో అమెరికన్ ప్రొఫెసర్ స్టాంటీ - "టు కాకో మెలొయిక్ క్రిమి" దేహంలో ఉన్న ఒక పదార్థం గురించి తాను జరిపిన పరిశోధనల వివరించాడు. అతని పరిశోధనలవల్ల యీ క్రిమి దేహంలో వున్న యీ పదార్థాన్ని కొద్ది మార్పు చేసి, క్రిములపై ప్రయోగిస్తే, దాని వల్ల క్రిముల సంతానంలో ఆ నేని మార్పులు కల్గుతాయని తెల్పింది. ఈ జ్ఞానంవల్ల మనకి లాభం ఏమిటని ఎవరైనా ప్రశ్నించవచ్చు. దీనివల్ల కేన్సర్ వంటి ప్రాణాలని కుదర్చడానికి వీలవుతుందని శాస్త్రజ్ఞులఅభిప్రాయం. ఈ పదార్థంవల్ల క్రిముల లక్షణాలు మార్చి వాటిని ప్రమాదం లేని క్రిములుగా రూపొందించ వచ్చునని వారు పరిగణిస్తున్నారు.

—ఇంటా

సెంట్రల్ రైల్వే
టెండర్ నోటీస్
నెం. 48/8/1961/Catg/KZJ/6

కాజీపేట స్టేషన్‌నందు క్యాటరింగ్ యూనిట్ డిపార్టుమెంటుకు 1-10-1961 నుండి 6 మాసముల కాలములో దిగువ పదార్థముల సప్లయి చేయుట మరియు ఉల్లిగడ్డలు అలుగడ్డ, (రు. 2,000/- అంచనా కంట్రాక్టు) 3 మాసములలో మాత్రమే సప్లయిచేయవలెను మరియు యానిఫారములు వుతుకుటకుగాను సెట్టు 1 కి రు. 2/- చెల్లించిన వ్యక్తిగతముగా కాని లేక పోస్టుద్వారా కాని డివిజనల్ సూపరింటెండెంట్ (క్యాటరింగ్) సికింద్రాబాద్ కార్యాలయమునుండి నిర్ణీతఫారములపొంది టెండర్లుపంపించవలెను.

వివరములు	కంట్రాక్టు యొక్క అంచనా విలువ.
(1) ముడిపదార్థములు (బియ్యము, పప్పులు)	రు. 37,000/-
(2) మాంసాహార పదార్థములు (గుడ్లు, కోళ్ళు, చేప, మటన్)	7,000/-
(3) లేకరి ప్రాడక్ట్సు (బ్రెడ్, బన్, నాన్- కకాయ్)	6,000/-
(4) బొగ్గు, వంటచెఱకు	4,000/-
(5) పరిశుభ్రమైన వేరుశనగనూనె	2,000/-
(6) పాలు & పెరుగు	12,000/-
(7) స్వచ్ఛమైన వెన్న (తినేనేతి కొఱకు కరుగనట్టి తెల్లరి)	3,000/-
(8) పాన్ ద్రవ్యములు (వక్కలు, తమలపాకులు, జర్దా, మొదలగునవి)	6,000/-

టెండరుఫారములు పోస్టుద్వారా కోరేయెడల పూర్తి పేరు అడ్రసు పేర్కొని ఏ అంశమునకు టెండరుఫారము కావలెనో గుర్తించవలెను. టెండర్లు నమూనాలతో సీల్డుకవరులో వుంచవలెను. టెండర్లు అంగీకరించుటకు ఆఖరుతేది 8-9-1961. టెండరుఫారములు 6-9-1961 సా॥ 14-0 గం॥ వరకు కార్యాలయపు వేళలలో యివ్వబడును. టెండర్లు 8-9-1961 తేదీ ఉదయం 11-0 గం॥ వరకు స్వీకరించబడును. టెండర్లు అదేరోజు అనగా 8-9-1961 శుక్రవారం ఉదయం 11-15 లకు తెరువబడును. కోరబడిన డిపాజిట్ పైకమును డివిజనల్ పేమాస్టర్ సికింద్రాబాద్ వారికి 7-9-1961 సాయంత్రం 14-30 వరకు చెల్లించవలెను.

నోటు:- (1) పోవువస్తువులు మినహా మిగతా ముడిపదార్థముల మూడు నమూనాసెట్లు కవర్లలోవుంచి సీల్డు ప్లాస్టిక్ బాక్సులో సంతకముచేసి పంపించవలెను. గెలుపొందని టెండరుదారుకు యీ నమూనాలు తిరిగి పంపబడును. అంగీకరించబడిన టెండరువిషయములో ఒకసెట్టు దిగువవారిచే సంతకము చేయబడి సీలుచేసి టెండరుదారుకు వాపసు చేయబడును. రెండవది కార్యాలయములో వుంచబడును. మూడవది కాజీపేటలోను క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించబడును.

(2) నమూనాలను 8-9-1961 ఉదయం 10-0 నుండి 10-30 మధ్యన డివిజనల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్, కార్యాలయమునకు అందజేసి రసీదుపొందవలెను.

(3) నమూనాలులేని టెండర్లు నిరాకరించబడును.

(4) ఏ కారణము చూపక ఏ టెండరయిన నిరాకరించుటకు దిగువ సంతకము చేసినవారు హక్కు గలిగియున్నారు.



ఈమధ్య ప్రధాని శ్రీ నెహ్రూ శ్రీనగర్‌ను దర్శించారు. పై ఫొటోలో ప్రధానికి ఘనమైన స్వాగతాన్నిచ్చుటను చూడవచ్చు. ప్రధాని నగరాన్ని చేరుటతోనే నదీ ప్రొసెషన్‌లో తీసుక పోబడుటను క్రింది ఫొటోలో చూడవచ్చు.

గోధుమ విత్తనాలు

[యన్. నొవొసెలోవ్]

ప్రపంచం మొత్తంమీద ధాన్యాలు అన్నిటిలోకీ ఎక్కువపండేది గోధుమ. భూమిపై సేద్య యోగ్యమైన నేల మొత్తంలో, అయిదోవంతు, గోధుమే పండుతుంది. అయితే, ఎంత అనుభవం కల వ్యవసాయ శాస్త్రజ్ఞుడు కానీ, ప్రపంచంలో ఉన్న గోధుమల రకాలలో నూరోవంతు కూడా పేర్లు చెప్పగలనంటూ సాహసించలేడు. సోవియట్ శాస్త్రజ్ఞులు సేకరించిన రకాలే 40,000 ఉన్నాయి!

లెనిన్ గ్రాడ్ చూడాలని వచ్చిన వారు, సెంట్ ఐజాక్స్ చౌకులో ఒక పాత కట్టడాన్ని గమనించే ఉంటారు. దాని ద్వారం మీద వ్రాసిఉంది ఒక బోర్డు. "వి. ఐ. లెనిన్ వ్యవసాయ విజ్ఞాన పరిషత్తు, వృక్షపోషణ విజ్ఞాన సంస్థ" అని.

ఎత్తయిన పెద్ద గుమ్మం తలుపులు తోసుకొని లోపలికి మెట్లెక్కి వెళ్ళాలి. విశాలమైన చావళ్ళ గోడల పొడుగునా కొయ్య బీరువాలూ అద్దాల బీరువాలూ ఉంటాయి. బీరువాలలో ఉన్నవి పుస్తకాలు కావు. వాటిలో చిన్న చిన్నవి పొడుగైన రేకు పెట్టెలు ఉంటాయి. వాటి లోపల అట్ట పెట్టెలు, వాటిలోఅన్నీ గోధుమ కంకులూ, పొట్లాలు కట్టిన గోధుమ విత్తనాలూ.

ప్రతి పెట్టెకీ ప్రక్కన గుండ్రని రంధ్రాలు, వాటిలో జల్లెడమోస్తరు తీగ అల్లికరేకు, "విత్తనాలకు గాలి పీల్చుకునే" దారి ఉండాలి. విత్తనాలు ఎలాఉంటున్నాయో ఎప్పటి కప్పుడు జాగ్రత్తగా గమనిస్తూ ఉంటారు. విత్తనాలు ఎంతకాలం అక్కడ నిలవ ఉంచడానికి వీలుంటుందో తెలుసుకోడానికి, ప్రత్యేక పరిశోధనాలయం ఉంది విత్తనాలు చచ్చిపోతే మళ్ళీ వాటిని అల్ట్రా - వయొలెట్ కిరణ ప్రభావంవల్ల బ్రతికించే పద్ధతి ఒకటి శాస్త్రజ్ఞులు రూపొందించారు.

రకరకాల గోధుమ గింజలు సేకరించడానికి రష్యన్ విజ్ఞాన శాస్త్రజ్ఞులు అరు దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. అయితే, సోవియట్ల కాలంలోనే, ఈ కృషి ఒక విశిష్ట క్రమంలో జరుగుతూ వచ్చింది. ఇటీవల చాల కాలంగా; ప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు అయిన పరిషత్సభ్యుడు నికొవాయ్ వావిలోయ్ ఈ కృషి విభాగానికి ఆధిపత్యం వహించాడు.

వృక్ష పోషణ విజ్ఞాన సంస్థకిచెందిన వారనేక మంది జట్లు జట్లుగా ప్రపంచంలో సర్వప్రాంతాలూ పర్యటించి వచ్చారు. దట్టమైన అడవులూ నీటి బొట్టు కనపడని ఎడారులు; పర్వత ప్రాంతాలు తిరిగారు. ఇదివరకెన్నడూ మానవుడు అడుగు పెట్టని ప్రాంతాలకుకూడా చొరవచేసి; ప్రాణాపాయానికికూడా లెక్కచెయ్యకుండా వెళ్ళారు. ప్రపంచంలో సర్వ ప్రాంతాల నుంచీ సర్వరకాలూ గోధుమల మచ్చులు తెచ్చి లెనిన్‌గ్రాడ్ ప్రదర్శన భవనంలో చేర్చారు. ఇథియోపియా నుంచి మెట్టపైరు గోధుమ; చీనాల నుంచి తక్కువ కాలంలో పండే మెత్తని గింజలు; తేమ ప్రాంతాలలో పండే; మధ్యధరా సముద్ర తీరపు రకాలు - అన్నిరకాలూ తెచ్చారు. పామీర్ పర్వత ప్రాంతాలలో పండే అతిసున్నని గోధుమ గింజలు; ఆర్మీనయాలో పండే నూగు కల గింజలు; ఉక్రేన్; వోల్గా; కాకసస్ ప్రాంతాలలో ఏనాడో పండించి ఇప్పుడు మానివేసిన పాతరకాల మచ్చులు; అన్నిరకాలనూ ఈ భవనంలో చూడవచ్చు.

ఈ పాతరకాలను కూడా "సజీవంగా" భద్రపరిచారు. వీటిని అవి మొదలు పండే ప్రాంతాలలోనే ప్రత్యేకంగా వేసి పండించి తెస్తూ ఉంటారు. కొన్ని రకాల గింజలు; కొన్ని వేల సంవత్సరాలుగా; మట్టి పాత్రలో భద్రపరచినవిఉన్నాయి.అతి ప్రాచీన కాలంలో స్లావ్ జాతివారు క్షేత్ర సంరక్షణలో; గొప్ప ఉన్నతిని అందుకున్నారని; శాస్త్రజ్ఞులు నిరూపించారు.

అద్భుతమైన ఈప్రదర్శనలో; ఎప్పటి కప్పుడు; కొత్త రకాలు చేరుస్తూనే ఉన్నారు. ప్రతియేడు పరిశోధక బృందాలు బెలో రష్యా; సఖలిన్ ప్రాంతాలకీ ట్రాన్స్-కకేషియా ప్రాంతాలకీ వెళ్ళి; కొత్త కొత్త రకాలు సేకరిస్తూ ఉంటారు. సోవియట్ దేశంలో సకల ప్రాంతాల నుంచీ ఫ్రాన్స్ నుంచీ; అర్జెంటినా; కెనడా; అమెరికా మొదలైన అనేక దేశాల నుంచీ; అనేకరకాల మచ్చులు వందలాది భంగీలలో వస్తాయి.

అయితే ఇది కేవలం ప్రదర్శించడానికే అనుకుంటే, అది పొరబాటు. కొత్త కొత్త రకాల విత్తనాలను-పుష్కలంగా పంట యిచ్చేవి; చలి దేశంలో పండేవి; వానతేని ప్రాంతంలో నీటి కరువుకి తట్టుకొని నిలిచేవి; మొదలైనవి - రూపొందించే ప్రయోగాలకు ఇది ఆధారం. దేశంలో పండే రకాలేకాకుండా ఇతర దేశాల విత్తనాలనుకూడా ప్రయోగక్షేత్రాలలో వేస్తారు. అర్జెంటినా విత్తనాలను మధ్య ఆసియాలోవేసి చక్కగా పండిస్తున్నారు. సోవియట్ దేశంలో విత్తనాలు పెంచే 40 కేంద్రాలకు మచ్చులను ఇక్కడ నుంచి సప్లయి చేస్తారు. అనేక దేశాలకు ఇక్కడ నుంచి అనేక రకాల మేలురకం విత్తనాలను పంపుతారు.

రచన: శ్రీ సూరంపూడి వెంకట సుబ్బారావు.

గాలిగోపురాలు

సీరియల్ ★ ★ నవల

9

సీతారామయ్యగారు మామూలు వేళ కాగానేలేచి స్నానాదికములు పూర్తిచేసుకుని సంధ్యావందన మాచరించి కాఫీకై ఎదురు చూస్తున్నారు. ఇంతలో గేటువద్ద వెంకటశాస్త్రినచ్చి నిలబడ్డాడు. గేటు తాళతీసి, వరండాలోకి వచ్చిన సుందరమ్మ చేతిలోని కాఫీ అందుకొని, వెంకట శాస్త్రిని లోనికిపోయి త్రాగమన్నారు. సుందరమ్మ శాస్త్రికి కాఫీయిచ్చి తాను కూడ త్రాగింది. కొంతసేపయిన తరువాత వెంకట శాస్త్రి "అమ్మా! ఒక చెడ్డవార్త మీతో మనవి చేయుటకు వచ్చానమ్మా. పాపాత్ముణ్ణి" అన్నాడు.

"ఏమిటా చెడ్డవార్తా శాస్త్రిగారూ" అని ఆదుర్దాగా అడిగింది సుందరమ్మ.

కంఠం రుద్దవరచుకొని కూర్చుంది,

"అమ్మా పంతులుగారికొక బుద్ధి పుట్టింది. ఇంతవరకు సంతానము లేకపోవడంతో ఆయనకు దత్తతమీద కూడ మోజులేదట. తిరిగి మళ్లీ పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని తలబెట్టినారమ్మా.....ఈ మాట తమతో చెప్పలేక నాద్వారా విన్నవించుకు-"

సుందరమ్మ ఈ మాటలు వింటూ నిలుచున్న మనిషల్లా నేలమీద చతికిలబడింది. ఎంతసేపటికీ ఆమె నోటివెంట మాట రాలేదు. తానింతకాలం కష్టమనది ఎరుగదు. అన్యోన్యంగా బతికే గౌరవ సంసారమున కప్రతిష్ట, అల్లరి, రాబోతోందని, శంకించింది. ఈ వయస్సులో తన కాక సవతి! తలుచుకోగానే సుందరమ్మ తలపై పిడుగు పడ్డట్టయింది. తన కాపురమునకు వచ్చినది లగాయతు పెత్తనమంతా ఆమె నడుపుతున్నా, యే చిన్న విషయంలోను భర్త మాట కెదురాడలేదు. గట్టిగా బావురుమని పైకి ఏడ్వవలేనని ఉన్నది కాని ఆమెకాధైర్యములేదు.

కొంతసేపటికామె తలెత్తి శాస్త్రి వంకజూచి "శాస్త్రిగారూ ఆయన అభిప్రాయం అల్లావుంటేనేనేమి చేసేదం?. దత్తతకు అంగీకరించారు. లక్ష్మి పిల్లల్ని చూచారుగా వారిని రప్పించాను. దత్తత జరుగుతుందని తలచాను. నలుగురిని చూడగా ఆయనకి నచ్చెత్తింది కాబోలు. ఈ వయస్సులో వివాహమా. నలుగురూ నవ్విపోరూ చెప్పండి. ఈ క్రూరవాడు కాకపోతే మరో క్రూరవానిని దత్తు చేసుకోవడంభావ్యంకాని మళ్లీపెళ్ళా. ఇంతవుంది గదా అని ఏ పొట్ట కక్కుర్తివాడో పిల్లనిస్తాడనుకోండి. పిల్ల సుఖంచూచి యిస్తాడా. తన కక్కుర్తి కొద్ది యిస్తాడు. వారి యిష్టం నా భాగ్యం అని చెప్పండి దూరమూలోచించమనండి" అంది. శాస్త్రి వెళ్ళిపోయాడు.

మరి కాలుగురోజులకు పంతులుగారు సుందరమ్మను సూటిగా ప్రశ్నించారు.

కొంత ధైర్యంతో సుందరమ్మ యిలా అంది "ఇది మంచి పనికాదు. ఈ వయస్సులో మళ్లీ వివాహం చేసుకుంటే నలుగురూ నవ్వుతారు. ముందు ముందు సంసారానికి చిక్కులు వస్తాయి. ఇంతకన్న దత్తత చేసుకుంటే ఏ గొడవా వుండదు" అని వూరుకుంది.

"ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా మగ సంతానం కలుగకపోతేనో" అని సుందరమ్మ కాస్సేపాగి పంతులుగారి మానం గ్రహించి"అంతగా కాకపోతే ఉన్న ఆస్తిఅంతా ఏ ధర్మ సంస్థకో వ్రాసేస్తే చిరకాలం ప్రజలన్నా చెప్పుకుంటారు" అని రోషంతో అక్కడ నుంచి లేచి వెళ్ళిపోయింది.

... ...

లోక కళ్యాణమూర్తి శ్రీ సత్యనారాయణమూర్తి అన్నవరం కొండపై వెలిశాడు. నుమారు నూరు మెట్లపైకు ఎక్కి పైకి పోవాలి. పైన విశాలమైన ప్రదేశముంది.

ఎత్తుగావుండి ఎవరెవరి కోర్కెలు తీర్చాలో ఎవరు తనను నమ్మి పూజిస్తున్నారో అని యీ విశాల ప్రపంచమంతా తన కన్నుల ఎదుట పెట్టుమని భక్తులు మొక్కులు చెల్లించుకుంటూ వారికపారమైన కోర్కెలనీడేర్చుతూ సత్యదేవుడని బిరుదు వహించిన మహావిష్ణువు రమా సహితంగా కరుణాలవాలుడై నిలిచిఉన్నాడు.

ఆ విశాల కల్యాణ మండపమున ఎందరో స్వామి సాక్షిగా వివాహములు జరుపుకొని ప్రొక్కులీడేర్చుకొని పోతుంటారు. భగవద్భక్తులు కొందరు యాత్రికుల సౌకర్యార్థము కొండపైన సత్రములు, విడిది గదులు కట్టించినారు. ధవళ కాంతులతో ఆలయ శిఖరం మెరిసిపోతూ ఎంతో దూరము కాన్పిస్తుంది.

అన్నవరం కొండమీద రమా సమేత శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి సమక్షమున స్వామి సాక్షిగా తారాదేవిని సీతారామయ్య పంతులుగారు వివాహం చేసుకున్నారు.

నిండుయౌవనంలో ఉన్న తారాదేవి వనుపు బట్టలతో సీతారామయ్యగారు పెట్టిన ఆ భరణములతో రతీదేవిలా మెరసిపోతోంది. నడివయస్సులో ఉన్న పంతులుగారిపట్ల ఏదో గౌరవభావం ఆమెలో మెదిలింది. పంతులుగారి శరీరచ్ఛాయ, పటుత్వము చూసి తారాసుందరి సరిపెట్టుకుంది. ఆమెకు ఇరవై ఆయిదు సంవత్సరాల వయస్సు వచ్చింది. ఈ వివాహము వెంకటశాస్త్రి ప్రోత్సాహము వల్ల వుభయులకు అంగీకారమయింది. ఎవ్వరూ రాలేదు వివాహానికి కొద్దిమంది స్నేహితులు, క్రొత్త పెళ్ళికూతురు తరపువాళ్ళు-అంతే. ఉభయ ఖర్చులు పంతులుగారే పెట్టుకున్నారు.

తారాదేవితో పంతులుగారు వాకిట్లోకి రాగానే మహాలక్ష్మిలా సుందరమ్మ, లక్ష్మి, ఎదురువచ్చి దిగదుడుపులుతీసి హారతిపట్టి లోనికి ఆహ్వానించారు. ఆ మరునాటి రాత్రికే పంతులుగారికి, తారాదేవికి పునస్సంధానమయింది.

తన కుమారుని దత్తత ఆగిపోయిందనీ చెడిపోయిందనీ తనకింక అక్కడ ఆస్కారంలేదనీ చాటుగాపోయి ఏడ్చింది లక్ష్మి.

తల్లివడే బాధ, తండ్రి కనవడకుండా పోవడం ప్రభాకరానికి అర్థమవుతున్నాయి. సీతారామయ్యగారు తనను దత్తత చేసుకోరని తెలిసిన ప్రభాకరం ఏమనుకున్నాడో ఏమో ఒకనాటి రాత్రి ఎచ్చటికో యిల్లు విడచి లేచిపోయినాడు. ఎంత వెదికినా కనిపించలేదు.

10

తారాదేవిని సుందరి అని కూడా పిలుస్తారు. ఈమె కాపురానికివచ్చి అప్పుడే ఆరుమాసాలైంది. తండ్రి బసవరాజుగారువచ్చి ఒకసారి పుట్టింటికి తీసుకువెళ్ళి నెలరోజులలో మళ్ళీ తీసుకువచ్చి దిగవిడిచి వెళ్ళారు. తరువాత సంక్రాంతి పండుగకు కూతురుని, అల్లుడిని రావలసినదిగా బసవరాజుగారు కోరారు. కాని సీతారామయ్యగారు. అత్తగార్ని మామగారిని, పిల్లల్ని, తనింటికే రావలసినదిగా వ్రాసి ఖర్చులకు డబ్బు పంపించారు. అల్లుడు వున్నవాడు. పైగా ఖర్చులకు కూడ డబ్బు కోరకుండానే పంపాడు. ఇక వెళ్ళక తప్పదని వారి కుటుంబం అంతా ప్రయాణమై వచ్చారు.

ఇప్పుడు పంతులుగారిల్లు కళకళలాడుతోంది. సంక్రాంతి పండుగకు వెనుకటివలెనే అందరికి చీరలు, జాకెట్లు, అన్నీ ఇప్పించారు. కాని కాంతారావు లేకపోవడంవలన కొంచెం బాధపడ్డారు పంతులుగారు. పండుగ వెళ్ళిన వారంరోజులవరకు బసవరాజుగారి కుటుంబం అక్కడే ఉంది.

వంట బ్రాహ్మణుడు శుచిగా షడ్రసోపేతంగా వంటలుచేస్తూ తృప్తిగా భోజనం పెడుతున్నాడు. లక్ష్మి పైనుండి ఎప్పుడెవరికేమి కావాలో అన్నీ శ్రద్ధగా చూస్తూ వుంది. పిలచినప్పుడు రావడంతప్ప మిగతా కాలంఅంతా దేవుడి మందిరంలోనే ఇంచు మించుగా కాలం గడుపుతూవుంది సుందరమ్మగారు. అయినా ఆమెతో చెప్పనివని, అనుజ్ఞ పొందనివని ఇంట్లో జరుగలేదు. ఆమెవంట వసారాకి ఎదురుగదిలోనే గీతా పారాయణం చేసుకుంటూవుంది. సీతారామయ్యగారు తారాదేవితో పడకకు తోటలోని బంగళాకు పోతున్నారు.

ఒకరోజుసీతారామయ్యగారింట్లోంచి దుఃఖం వినిపించింది. కాంతారావు చాలా రోజులనుండి జైలులో ఉన్నాడనీ అనంతరామయ్య అను బట్టల వర్తకుడి బాకీని పురస్కరించుకొని కోర్టువారు జైలుశిక్ష విధించారనీ, సీతారామయ్యగారు వ్రాసిన వుత్తరమునకు ఒక స్నేహితుడు జవాబు వ్రాశాడు. ఆ వుత్తరంచూచి లక్ష్మి ఎంతగానో గోలపెట్టింది. పిల్లలకు ఆధారం లేదని ఏడ్చింది. పంతులుగారు అన్నీ చక్కబరుస్తానని కాంతారావుని విడిపించి తీసుకువస్తానని ఊరడించారు. ఆమె ఇంటికి పోతానని గోలపెట్టగా కొంత డబ్బుయిచ్చి, లక్ష్మిని, పిల్లల్ని; ఇంటికి పంపివేశారు.

... ...

బసవరాజుగారి సంసారం మొదట్లో కాస్త బాగానే ఉండేది. కాని రానురాను ఆయన సంతానం పెరిగి కాస్త ఆస్తి కరిగిపోయింది. ఉన్న ఊళ్ళోనే కో-ఆపరేటివ్ బ్యాంకులో నెలకు ఏభై రూపాయలమీద పని చేస్తూన్నాడు. కొత్తగా పెట్టారు ఆ బ్యాంకి. కాస్త నోరున్నవారు, కొండ నాలుకలేనివారలు ఆ బ్యాంకి కధికపతులగుటవల్ల అచిరకాలంలోనే బ్యాంకు దివాలాపాలయింది. అందులో ఉద్యోగం పోగానే పంచాయితీ గుమాస్తాగా మళ్ళీచేరి పని చేస్తున్నారు. ఉదయం ఏడు గంటలు మొదలు రాత్రి ఏడు గంటలవరకు పంచిన నడుం ఎత్తకుండా పనిచేయవలసి వచ్చేది. అయితే జీతం ముప్పయ్యేవచ్చేది. పెద్ద కుమార్తె సూర్యకాంతం. ఆమెకిద్దరాడ పిల్లలు. ఆమె తలచెడి పిల్లలతో పుట్టింటికి చేరింది. రెండవ కుమార్తెరాధ నుంతమెదరి. పెద్దదైంది. చదువుకుంది. ఎవరో ఉమాపతిట ప్రేమించింది. ఉద్యోగం ఏదైనా దొరికితే తప్ప ఆనికి ఏ యితరాస్తి లేదని ఆతనితో వివాహానికి బసవరాజుగారు అంగీకరించలేదు. ఉమాపతి ఏవో కల్లబొల్లి మాటలు చెప్పి తారాదేవిని ఒకనాటి రాత్రి మద్రాసుకు తీసుకుపోయాడు. వివాహమాడ్తానని చెప్పి ఆమెతో కాపురం పెట్టి తను ఒక ఉద్యోగం సంపాదించుకొన్నాడు. ఒక్క ఏడాదివరకు వీరెక్కడ ఉన్నది ఎవరికీ తెలియనే లేదు. ఈ ఏడాదిలోగా ఇంకో పని తను చేరదీసి తారతో ఎడమొగం పెడమొగంగా ఉండడం ప్రారంభించాడు. బసవరాజుగారామెను వెదుకుతుదకు మద్రాసులో పట్టుకున్నారు. ఉమాపతితో కలహించి తారను తీసుకు వచ్చారు. ఏవో కారణాలవల్ల ఉమాపతి ఉద్యోగం పోయింది. అప్పటికే తారకు ఆరవమాసము. ఎవరికీ తెలియకుండా ఆమెను కూనూరు హాస్పిటలుకు పంపించారు. ఆమె ఒక ఆడ శిశువును కనింది. ఆ శిశువు వెంటనే మరణించింది. తారనొక సంవత్సరాని కింటికి తీసుకు వచ్చారు. ఇల్లు విడచి వెళ్ళిపోయిన తారను పదిమంది పది మాటలన్నారు, గౌరవం, మర్యాద అంతాపోయింది. మళ్ళీ ఎల్లాగయినా పెళ్లి చెయ్యాలని బసవరాజుగారు ఎంతగానో ప్రయత్నించారు. కాదని ఇంతలో వెంకట శాస్త్రిగారు బసవరాజుగార్ని కలుసుకోవడం జరిగింది.

"సీతారామయ్యగారు భార్యవుండగానే సంతానము కొరకు రెండవ వివాహం చేసుకోబోతున్నారు. ఉన్న సంసారం మీ బాధలు కూడా తీరిపోతాయి" అని ఎన్నో చెప్పగా ఎలాగో శ్రమపడి యీ వివాహానికి ఒప్పించారు నలుగురూ తారను. తారకూడా తనసెవ్వరు తెలిసినంత వరకు వివాహమాడరని ఏదో దూరంగా ఉండిపోవచ్చువనీ, అన్ని అల్లర్లు మాసిపోతాయనీ తలచి ఒప్పుకుంది. అనుకున్నట్లుగ తార వివాహం కావడం అత్తవారింటికి చేరడం అయింది. గత చరిత్ర మాత్రము ఇక్కడ ఎంతవరకు పొక్కలేదు.

తార తలిదండ్రుల దుర్భర దారిద్ర్యం తలచి కొంతవరకు సహాయం చేయాలని తలచింది. కాని భర్తని అడుగలేకపోయింది. తన తండ్రికి సహాయం చేయమని ఏ వనిత కోరగలదు క్రొత్తలో!

అందువల్ల యింట్లోవున్న లక్ష్మి, సుందరమ్మగార్లపై తోనుకుపోతుందని ఊహించి అలమారలోగల కట్టలలో అయిదువందలు రూపాయలు అపహరించి తల్లివద్దని గోలపెట్టినా విసక ఆమెకిచ్చింది. ఆ రాత్రి తెల్లవారగానే వెళ్ళిపోయారు.

మరి పది పదిహేను రోజులకు సీతారామయ్యగారు కొబ్బరికాయలు వగైరా అమ్మిన బాపతు సొమ్ము వేరే అలమరలో దాచినవి చెదుకున్నా కనిపించలేదు. సుందరమ్మగార్ని పిలిచి అడుగగా ఆమె అసలు అలమారు తీయలేదంది. తారను అడిగారు. ఏమో ఎవరు తీశారో అనీ! ఎక్కడో పెట్టి యిక్కడెందుకు చెదుకుతున్నారనీ ఇంట్లో ఎవరన్నా తీసిఉండాలనీ పెంకెగా జవాబులుచెప్పి నిర్లక్ష్యంగా నిలుచున్న పళంగా వెళ్ళిపోయింది. పైగా "మీకు మతేమన్నా పోయిందా" అనగానే పంతులుగారికి కోపమాగలేదు. నిజం చెప్పమని తారను దండించారు. తార పెంకిమాటలుగా జవాబుగా చెప్పినందుకు ఆమెను రెండు వాయించి గదిలో నుంచి గెంటివేసి పశువుల చావడి ప్రక్క గదిలో పడివుండమన్నారు.

సీతారామయ్యగారి హృదయం చాలా బాధపడుతోంది. తార ఆ పశువుల చావడి ప్రక్క గదిలో ఆలాగే పడివుంది నాలుగురోజులు.

సుందరమ్మగారుకూడ ఒకటి రెండు రోజులు నిర్లక్ష్యముగానే పూరుకుంది. చిన్నతనం. క్రొత్తగా కాపురానికి వచ్చింది. ఏదో పొరబాట్లువున్నా సర్దుకుపోవాలిగాని తరిమేస్తే అమర్యాదపాలవుతాము. మంచి చెడ్డలు మనమే నేర్చుకోవాలి" అని భర్త కోపం తగ్గించడానికి ఒకటి రెండుసార్లు చెప్పి చూచింది. పంతులుగారు విని వూరుకున్నారు.

తన సంసారమెంత బీదదైనా తనకు మాత్రలయినా ఆయనచుట్టపడి, అన్నవస్త్రాలకు లోటులేని సంబంధాలు దొరికితే ఆదేపదివేలని తలుస్తారు కొందరు.

మరికొందరు తమపిల్లలపల్ల తాము కూడా సుఖపడవచ్చుననీ, ఆపదలకు అడ్డుకోకుండా వుండగలరా యనీ అనుకుంటారు.

మనకొరకేగదా మన తల్లిదండ్రులు యింతంత బాధలు పడుతున్నారు. వాళ్ల బాధలు ఎలాగయినా మనం తీర్చకపోతే గత్యంతర మేమని కొందరి అభిప్రాయము. అందులో మొదటి తత్వం బసవరాజుగారిది రెండవ తత్వం కామమ్మది. మూడవతత్వం తారాసుందరిది.

మరిరెండు రోజులు పోయాక భర్తను ఒప్పించి తారను బుజ్జగించి సుందరమ్మ ఆమెను యింట్లోకి తెచ్చింది.

సీతారామయ్యగారు కొట్టిన దెబ్బలకు తారాదేవి శరీరం కుళ్ళు పొడిచినట్లయింది. ఒక వారంరోజులు సరిగాలేవనే లేదు. పంతులుగారామెతో మాట్లాడడం మానివేశారు. ఆమెకొక గదియిచ్చి అందులోనే వేరుగా పరుండమన్నారు. తన పడకగది తాళాలు సుందరమ్మకిచ్చి ఆమె నందు పరుండమని తాను ఆఫీసు గదిలోకి మకాం మార్చుకున్నారు.

ఈ మధ్య బంధు మర్యాదలకు, వివాహమునకు, పండుగ పబ్బములకు చాలా ఖర్చు అయిపోయింది- ఒక రోజున తనవద్దనున్న డబ్బు ఖర్చు అయిన మొత్తములు తోట ఫలసాయం బాపతు అమ్మకం వేర్వేరుగా అన్ని జమాఖర్చులు చూచుకొని లెక్కలు తేల్చుకున్నారు- ప్రజలవల్ల రావలసినవి నాల్గువేల రూపాయలు తేలింది- మహేశం వెయ్యి రూపాయలు, భాగన్న రెండువేల రూపాయలు ఇవ్వాలి- ఎంతలేదన్నా అయిదారువేలు ఖర్చులు అయిపోయాయి- మిగిలిన మొత్తములు లెక్కలు వ్రాసి చీట్లుకట్టి ఇనప్పెట్టెలో వుంచి తాళాలు సుందరమ్మ చేతికిచ్చారు- ఇంట్లో ఖర్చులకుగాను ఆరువందల రూపాయలు ప్రత్యేకంగా ఆమెకిచ్చారు-

(ఇంకా ఉంది)

అంతర్జాతీయ పర్యాలోకం

జర్మన్, భారతదేశాల కాందిశీకుల తారతమ్యాలు

శ్రీ డి. వి. తహ్మన్కర్

తూర్పు జర్మనీద్వారా పశ్చిమ బెర్లిన్‌కువెళ్లే దాని కవసరమైన మార్గాలను మూసివేయగా యిటీవల కొన్ని విషయాలు స్మృతిపథాన్ని కదిపాయి. సేనిటీవల మేరియన్ ఫీల్డులో ఒక కాందిశీకుల మహాసమును చూడడం తటస్థించింది. తొమ్మిదిమంది కలిగిన ఒక కుటుంబాన్ని మ్యూనిచ్‌కి, హాంబర్గుకివంపే ముందు అధికారులు ముఖాముఖి వీరిని కొన్ని ప్రశ్నలడిగారు. పునరావాసానికి సంబంధించిన పని కొరకు వీరిని మ్యూనిచ్‌కి హాంబర్గుకి పంపదలచారు. తండ్రికి సోవియట్ దేశంలో తన భార్య సహకారంతో ఏర్పరచుకొన్న ఒక చిన్న పూటకూలి యిల్లు ఉండేది; వారికి యిద్దరు కుమారులు, ఉపాధ్యాయులుగా పరిశ్రమలలో కార్మికులుగా పనిపాటలు చేసికొనేవారి భార్యలూ ఉండేవారు. ఉన్న యావదాస్తినీ వదిలిపెట్టి కేవలం కట్టుబట్టలతో వారు యెంతో దూరాన్ని అధిగమించి వచ్చారు.

తండ్రి తన విషాదగాథను వివరిస్తున్నప్పుడు తన ముఖంలో ధైర్యాన్ని కనుపరచాడు; కాని భార్య మాత్రం కరగి నీరయిపోయినట్లు కనిపించింది. ముఖ్యంగా తమ ప్రియాతిప్రియమైన పిల్లపిల్లను తాము వదిలిపెట్టి రావలసివచ్చిందన్నప్పుడు ఆమె చాల బాధపడింది... ఎంతో ఆప్యాయంగా చూచుకొన్న గృహాన్ని బంధుమిత్రులకు వదిలియిలా రావడం వారికి బాధాకరంగా ఉండినది. కనీసం స్నేహితులతో "పోయి వస్తాం" అని చెప్పే భాగ్యం కూడా లేకపోవడానికి రహస్య రక్షణ దళం కారణం. వారు మూడు ప్రత్యేక జట్టులలో వయసునించి కాందిశీకుల శిబిరానికి చేరుకున్నారు. కుటుంబంలోని వారంతా మళ్ళీ కలుసుకునే ముందు వారు యే వెయ్యి మార్లో వచ్చి బ్రతికారు. వారిలో కొంతమందిని అనుమానించి వెనక్కి యెక్కడ మరలించి తీసుకొని పోతారో అని భయకంపితులయ్యారు. బాధ వారి ముఖంలో పెద్ద అక్షరాల్లో వ్రాసినట్లు కనిపించింది. అధికారులముందు కూర్చుని సమాధానం చెప్పేటప్పుడు వారి ముఖాల్లో విషాద రేఖలు గోచరించాయి.

ఈ బాధాకరమైన నాటకాన్ని సూర్యోదయం మొదలు అర్ధరాత్రి వరకూ ఆడేవారు. భారతదేశం విభజన జరిగినప్పుడు పంజాబ్‌నుండి 1947లో వచ్చిన కాందిశీకులు నాకు జ్ఞప్తికి వచ్చారు. కాని వారికీ, వీరికీ

టిబెట్టులో చైనా దళీయులు చేస్తున్న రస్తాల నిర్మాణానికి, భారతదేశము ఉత్తర సరిహద్దులలో భారతీయులు చేస్తున్న రస్తాల నిర్మాణానికి యెక్కడా పోలిక లేదు. భారతీయులకు ప్రకృతిసిద్ధంగానే కొన్ని సాధక బాధకాలు అడ్డు వచ్చాయి, టిబెట్టు వైపు కూలీలు ఏకంగా 16 గంటలసేపు పని చేశారట. ఎసుడు దిగుడుగాఉన్న పర్వత ప్రాంతాలను చదును చేయవలసిన ఆవశ్యకత భారతదేశానికి వుండగా, ఆ అవసరం లేకుండానే చైనా దేశస్థులు సులభంగా రస్తాలు నిర్మించేందుకు వారికి భూమి అనుకూలించింది. ఏమైనా సిక్కిం, భూటాన్‌లలో వారు వేసిన రస్తాల నిర్మాణం ప్రశంసనీయమైనదే.

ఏడెలా ఉన్నా, చైనావల్ల ప్రస్తుతము మునిగిపోయేటంత ప్రమాదము ఏదీ రాదని మహారాజ కుమారుడు అభిప్రాయపడుతున్నాడు. దీనికి కారణాలు లేకపోలేదు.

చైనా దేశస్థులు, టిబెట్టు దేశస్థులు అనాదిగా వ్యాపార విషయాలలో ఉంచుకొన్న సంబంధ బాంధవ్యాలను మరలా పైకి తీసికొని వచ్చి వ్యాపారము వృద్ధి చేయాలని ఉబలాటపడుతున్నారు. ఆ వ్యాపార వృద్ధి చేయడంతో దొంగతనముగా విదేశాల నుంచి వస్తువుల్ని తీసుని రావడము తగ్గిపోతుంది.

ఇంతేకాకుండా టిబెట్టు, చైనా దేశాల సరిహద్దు ప్రాంతాలలో విపరీతముగా కొన్ని వ్యాధులు బయల్దేరి యుగయుగాలుగా వైద్య శాస్త్రంలో ప్రావీణ్యతనొందిన చైనా దేశము తన వైద్యశాస్త్ర నిపుణులను పంపి, వారిని బాధ నుండి విముక్తుల్ని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నది. మూలికలతో వైద్యం చెయ్యడం చైనా వైద్యులకు నల్లేరుపై బండి నడక. మరిన్ని పాతగుడ్డ పేలికతో, పాత కాగితపు ముక్కతో గొప్ప వ్యాధుల్ని నయం చేయగలగడము వారి ప్రత్యేకత. కాని యీ వైద్యానికి తగినట్లు ప్రజలలో విప్లవ తత్వానికి తగినంత స్థానం ఉండాలని ఒక చైనా నాయకుడు యిటీనల అన్నారు. ఈ విప్లవ స్వభావము ప్రారంభ దశలో ఉన్న క్షయ వ్యాధిని కూడా నివారింపగలదని ఆయన అన్నారు! చైనా 500 మంది వైద్యులను (వారేటయోయిస్ట్స్) టిబెట్టుకు పంపించింది. వీరందరూ మూలికా వైద్యులే. అలా చేయడము వల్ల టిబెట్టులో వెనుకబడినవారికి జాతీయతా భావాన్ని కలిగింపవచ్చునని చైనాఆశయం, ఆశ. (నెఫెస్)

సహకార మార్కెటింగ్ రంగంలో ప్రగతి

సహకారోద్యమంలో సహకార మార్కెటింగు కార్యకలాపాలకు కీలక స్థానం వుంది. తన పంటకు తగు మార్కెటింగు సౌకర్యాలుండడం రైతులకు చాలా ప్రధానం. ఇప్పటి పరిస్థితులవృష్ట్యా, దళారులు పాల్పడే అనేక అవినీతులకు రైతు లోనుకావలసి వస్తోంది. సహకార మార్కెటింగు విధానం అట్టి అవినీతులను పూర్తిగా నిర్మూలించక పోయినా, కనీసం వాటిని తగ్గించేందుకు దోహదం చేస్తుంది.

సహకార మార్కెటింగు సౌకర్యాలు అభివృద్ధిచెందితే, రైతుకు గిట్టే ధరకూ, వాడకందారు చెల్లించే ధరకూ మధ్య వ్యత్యాసం చాలా తగ్గుతుంది, చాలా సరుకుల విషయంలో అట్టి వ్యత్యాసం గణనీయమైనంత ఎక్కువగా వుంది.

తగువిధంగా సహకార మార్కెటింగు కార్యకలాపాలు విస్తృతమయితే,అది ధరల స్థిరీకరణకు తోడ్పడుతుంది. సహకార పరపతి సౌకర్యాల ప్రయోజనం సహకార మార్కెటింగు సౌకర్యాలు పెంపొందించడం ద్వారా అధికమవుతుంది. ఏమంటే, తన పంటకు రైతుకు మంచి ధర పలుకుతుంది. సహకార పరపతి సంఘాలపద్ధతానుబట్టగా తీసుకున్న సొమ్మును త్వరితంగా తీర్చివేయవుతుంది. ఆవిధంగా, సహకార పరపతి రంగంకూడా విస్తృతం చెందడానికి అవకాశం వుంది.

ఆహారధాన్యాలఉత్పత్తికిఅవసరమైన సరుకుల నప్లయి, పంపిణీ రంగాలలో కూడా మార్కెటింగు సంఘాలు ప్రముఖ పాత్ర నిర్వహించగలవు.

సహకార పరపతి సంఘాలు చాలా కాలం నుంచీ పనిచేస్తున్నా, సహకార మార్కెటింగు సంఘాలు యిటీవల యేర్పడినవే. ద్వితీయ ప్రణాళిక ప్రారంభమవడానికి ముందు, సహకార మార్కెటింగు సంఘాలు అక్కడఅక్కడా చెదురు వాటుగా వుండేవి. సహకార పరపతి సౌకర్యాలతోబాటు సహకార మార్కెటింగు సౌకర్యాలనుకూడా పెంపొందించడం అవసరమని తొలి పంచవర్ష ప్రణాళికలోనే పేర్కొనబడింది. అయితే, నిర్దిష్టమైన లక్ష్యాలు నిర్దేశించబడలేదు. ద్వితీయ ప్రణాళికప్రారంభంలోనే సహకార మార్కెటింగు సౌకర్యాల కల్పనకు శ్రద్ధవహించబడింది.

ప్రతి రాష్ట్రంలోనూ 1800 ప్రాథమిక మార్కెటింగ్ సంఘాలూ, ఒక కేంద్ర మార్కెటింగు సంఘమూ యేర్పడాలని రెండవ పంచవర్షప్రణాళిక నిర్దేశించింది. తదనుగుణ్యంగా, దాదాపు 1900 మార్కెటింగు సంఘాలు యేర్పడ్డాయి. చెరుకు, ప్రత్తి- వీటి క్రయవిక్రయాలను చూసే సంఘాలు ప్రత్యేకంగా యేర్పడ్డాయి.

గణనీయమైన పెరుగుదల

ఇటీవలి సంవత్సరాలలో, వివిధ స్థాయిలలో సహకార మార్కెటింగు సంఘాల వ్యాపారంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. 1960 జూన్‌తో అఖరైన సహకార సంవత్సరంలో ప్రాథమిక, కేంద్ర మార్కెటింగు సంఘాలద్వారా దాదాపు రూ. 200 కోట్ల విలువైన సరుకు విక్రయించబడింది. అంతకుముందు సంవత్సరం అమ్మకాలకంటే యిది నూటికి నూరు పాళ్ళు ఎక్కువ. ఈసహకార మార్కెటింగు సంఘాలద్వారా విక్రయించబడిన ప్రధానమైన సరుకులు యివి పత్తి, చెరుకు, ఆహారధాన్యాలు వాటి అమ్మకాల విలువ వరుసగా దాదాపు రూ. 17 కోట్లు, రూ. 8, కోట్లు, రూ. 27 కోట్లూను.

సహకార మార్కెటింగు రంగంలో యిటీవల సాధించిన ప్రగతి ఒక తీరుగా సాగలేదు. మహారాష్ట్ర ఉత్తరప్రదేశ్, పంజాబు, గుజరాత్ మద్రాసు, మైసూరు రాష్ట్రాలలో సహకార మార్కెటింగు రంగంలో విశేషమైన ప్రగతి సాధించబడింది ఆహారధాన్యాల మార్కెటింగు విషయంలో ఉత్తరప్రదేశ్ సహకార సంఘాలది అగ్రతాంబూలం.

పత్తి ప్రాసెసింగు, మార్కెటింగు రంగంలో గుజరాత్ రాష్ట్రానికి అగ్రస్థానం లభించింది. దేశమంతటా సహకార మార్కెటింగు సంఘాలద్వారా విక్రయించబడిన పత్తిలో నూటికి సుమారు 60 వంతులు గుజరాత్ రాష్ట్రంలోని సహకార సంఘాలద్వారానే విక్రయించబడింది.

చెరుకు, పత్తి వంటి నగదు సంటల మార్కెటింగుకు సహకార సంఘాలేర్పడి పనిచేస్తున్నా, దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెటింగు వ్యవస్థపై సహకార సంఘాల ప్రభావం కనిపించడానికి యింకా కొంతకాలం పడుతుంది. ఇంకా అభివృద్ధి సాధించవలసి వుంటుంది. ఇందుకై ఉత్పత్తికి అవసరమైన సరుకుల నప్లయి, పంపిణీ రంగాలలో సహకారోద్యమం బలపడాలి, అంతేకాదు, ఆనాదిగా రంగంలో స్థిరపడివున్న వ్యాపారుల పోటీకి అవి తట్టుకోగలగాలి.

తృతీయ ప్రణాళిక

600 కొత్త మార్కెటింగు సంఘాలను యేర్పరచాలనీ, ముఖ్యంగా ఇప్పుడు పనిచేస్తున్న మార్కెటింగు సంఘాలను పటిష్టం చేయాలనీ వాటికీ, గ్రామ సొసైటీలకూ సంధానంకూర్చి, వాటిమార్కెటింగు కార్యకలాపాలను విస్తృతపరచాలనీ తృతీయ పంచవర్ష ప్రణాళిక నిర్దేశిస్తోంది. మార్కెటింగు కార్యకలాపాలతోబాటు, ప్రాసెసింగు కార్యకలాపాలనుకూడా నిర్వహించేందుకు సహకార మార్కెటింగు సంఘాలకును ప్రోత్సాహమివ్వబడుతుంది.

పొరుగు దేశం సిక్కిం

గాంగ్‌టక్: టిబెట్ సరిహద్దు వైపున్న సిక్కిం దేశంలో జరుగుతున్న కార్యకలాపాలు సిక్కిం దేశస్థులకేమాత్రం బాధ కలిగిస్తున్నట్లు కనిపించదు.

సిక్కిందేశపు మహారాజకుమారుడు తన వార్తాపహుల ద్వారా చైనా దేశస్థులు టిబెట్ నుండి టక్కాన్ గోంపా అనే ప్రదేశానికి క్రొత్తగా రస్తాను నిర్మిస్తున్నట్లు తెలిసికొన్నారు. టక్కాన్‌గోంపా సిక్కిం సరిహద్దుకు ఐదు మైళ్ళ దూరంలోనే ఉన్నది. ఈ రస్తా యిప్పుడే పూర్తి గావించబడ్డ కలా-ఖంపా జంగ్ రోడ్డును కలుపుతూ యాటంగ్ నుంచి మోటారుపై వెళ్ళే దూరాన్ని చాలా వరకు తగ్గిస్తుంది. యాటంగ్, సిక్కిం సరిహద్దునుండి, టిబెట్‌లోని చైనా దేశీయుల సైనికుల ముఖ్య కేంద్రాలన్నిటిలోనికి దగ్గరగా నున్నది.

చైనా దేశీయులప్పుడే టిబెట్టులోని యెనిమిది పరిపాలనా కేంద్రాలను కలుపుతూ రోడ్లను నిర్మించారని విశ్వసనీయ వర్గాలు అంటున్నవి.

సుమాధురవంశం

మేనరికము

శ్రీమతి యశోదా తిరుమలరెడ్డి

తెల్లారితే బతుకమ్మ పండుగ అనంగ సీతమ్మ తన కొడుకు తిరుపతిని వెంట బెట్టుకొని తల్లిగారిల్లు రామచంద్రాపురం వచ్చింది. సవారిబండి వాకిట్లకు రాంగనేబంకుల్ల పదిమందిల గూసున్న కాశన్న రుమాలు దులుపుకుంటు లేసి బండితట్టు పారజూసిండు. సూడంగనే కాశన్నకు చెల్లె సీతమ్మ మేనబ్లుడు గండ్లవడ్డరు. పెద్దముల్లె సంపాయించు కున్నట్లు కాశన్న బిరాన బండి కాడికి వోయి సెల్లను. మ్యానబ్బున్ని దింపుకుంట, "ఎచ్చా" ఓ ఎచ్చ ఎవరొచ్చిం నోరి సూతువురా నాయనా అంకూత వెట్టిండు. తండ్రి మాటయినంగనే కాశన్న బిడ్డ, పెండ్లం, లోపలినుండి ఇవతలికి వచ్చిండ్రు. కాశన్న బిడ్డ. సూస్కుం సూస్కుమే, కిలకిల నవ్వుకుంట నాయనా! బావనుజూడే అన్నది. వచ్చిరాంగనే ఇదెక్కడి పంచాయతి అని కాశన్న పెండ్లం సరస్వతమ్మ బిడ్డను ఊకుండు అన్నట్లు గుడ్లురిమి చూసింది. కని ఇదంత ఓ కన్నుతోటి కనిపెట్టుకుంటున్న సీతమ్మ కొడుకును పిలిసి సంచిలకెల్లి బత్తీసలు దీసి చెరిన్ని పెట్టి, పోనాయనా! ఏశమ్మ నీవు ఇద్దరు ముద్దుగ ఆడుకోండి అని జత గలిపింది.

ఇంతకు సీతమ్మ ఈసారి అన్నగారింటికి బత్కమ్మ పండుగకని రాలేదు. అన్న వదినె పెట్టే జోడి చీరలకని రాలేదుగని తన కొడుకు తిరుపతికి, అన్నబిడ్డ ఏశమ్మకు, మనుము కుదిరిచ్చి గట్టిజేతామని వచ్చింది. అన్నగారింటికి వచ్చేముందు తన మనుసుల పరిపరి విధాల ఆలోచన జేసుకున్నది. ఉన్నమాట జెప్పాలె అంటె, అన్న వదినెవచ్చి తన కాళ్ళు పట్టుకోవల్సిన మాట తనకేంలోటు. తన కుటింబాని కేమి లోకువ. ఈయాళ్ళ గాటంటె రేపు వస్తరని ఊకున్నది. చూసింది, చూసింది. ఏశమ్మ బుట్టినంక కాశెన్ని సార్లు తల్లిగారింటికి పోలేదు ఒక్కనాడైన సరస్వతమ్మ ముడ్డుకన్న నీ కోడల్ని జేసుకో వదినే అనకపాయె. ఇంతకు వాళ్ళకులేంది నాకెందుకు అని ఊకుండమంటె పాణం ఒప్పదాయె. ఒగయాళ పిల్లను మా తిరుపతికి ఇయ్యకుంటె ఎంత నా దాని! నా కొడుకు బంగారమోలె మ్యానోడు ఉండంగ, వాణికయ్యె పిల్లను ఇంకోణికి యిస్తే నే నెట్లజూతు. నోటికాడి బుక్కను ఎత్తగొట్టినట్లు గాదా మావోండ్లకు తలగొట్టినంతనని గాదా! ఇంతకు మావోడు ముద్దుగ లేడనా? లేక మాఇల్లేమన్న ఖదరు తక్కువ ఇల్లు అనా? అయినా సూస్త ఊగిఊగి ఉయ్యాల యాడికొస్తదో? మమ్ముల గాదని మాఅన్న బిడ్డను ఎట్లా మందికి ఇస్తడో అని అనుకున్నది. మళ్ళ అయ్యో ఇట్లా నాలోపట నేనను కుంటె ఏం లాబం. పోవాలె కతేందో తేలాలె, పట్నంల ఉండంగనే అయిపోయినాది. ఇల్లు అలుకంగనే పండుగయినాది. నూరు ఆరుగాని అరు నూరుగాని యీసారి యీ సంబంధం గట్టి జేసుకోనన్న వస్త. తల్లిగారింటితో తెగదెంపులు జేసుకొనన్న వస్త. అని గట్టిమనుసు జేసుకొని వచ్చింది.

తెల్లారంగనే పండుగ, వటవార్పు అంత అయినంక పనితీర్క జేసుకొని ఏశమ్మ తల్లి బిడ్డకు జడపస్తనని సమరుసుకుంట గూసున్నది. ఇంగ సీతమ్మ ఈయాళ్ళ ఎట్లనన్న తన కొడుకు సక్కదనము తన ఇంటి గంచారం, తనకున్న ధోలం మాసం జూపాలెనని కొడుకును తెల్సుకోని ముందల గూసోపెట్టునున్నది. తిరుపతికి పదకొండేండ్లు దాటినా ఇంకా పుట్టు వెంట్రుకలు తీసలేగు. ఒక మొక్కుగాదు, రెండు మూడు దేవస్థానాలకాడ మొక్కు చెల్లించాలె. అందుకని వాణికి ఇంకా తల్లి జెడనే పస్తది. అయితే ఆ జడ ఒక్కటిగాదు. దినాం పిర్గనే ఈయాళ్ళగూడ వాణికి ముందల వేములవాడ రాజేశ్వరుల కాడ వెట్టిన గోపుపాదం సక్కగ దువ్విండి ఎన్కనేమొ తిరుపతి ఎంకటేశ్వర్ల కిడిసిన, ఎంటికలను జడ ఏసిండి. అల్లిన జడకు సందుగగదా

అని మంచి గులాబిరంగు ఊసురుచ్చు పట్టి కట్టింది. ఆంగరుంచి నిలువ రంగు బనారసు పూలఅంగి బొట్టిగింపి, మెళ్ళ అసిలి వెట్టింది. చేతులకు చాకట్లు, చెవులకు పెద్దముచ్చాల జోగులు పట్టి తన కొడుకు సక్కదనానికి జాడ మురిసిపోయి దగ్గరకు దీసుకొని ముద్దిచ్చి, అయ్యో పాపిష్టిదాన్ని పిల్లగాడికి దిష్టిసుక్క బెట్ట మర్సిపోయిన, ఆయన అందుకే అటడునన్ను ఉత్తఎడ్డగోరు అని అనుకొని కాటిక దీసి నెంపకు సుక్క బెట్టి ఆడుకోపోరా అన్నది. ఇట్లా సింగారం జేసుకున్న బాలను జూసి కొంటెపిల్ల ఏశి పడిపడి నవ్వుకుంట, అమ్మా,అమ్మా బావనుజూడే. అచ్చం ఆడిపిల్ల అయిండు అన్నది. ఈమాట ఇన్న తమ్మగు తలగొట్టినంతపని అయింది. పాసెంగ తిరుపతివచ్చి రెండు దినాలు గాలేదుగని "ఎశి" అంటే పంచప్రాణాలు ఇడుస్తడు. ఏశమ్మ తనను మెచ్చుకుంటదని అనుకొనే తల్లి బాలుదువ్వెన, సన్నదువ్వెన బెట్టి దువ్వుతుంటే గోలీలు ఆడుకున్కంమానె కదులకుండ గూసున్నదు పాపం. అంతా అయినంక ఏశి బాబు ఆడిపిల్ల అనేవరకు తిరుపతి కండ్ల నీళ్ళు గ్రక్కుకుంట అమ్మా ఏశి నన్ను ఎక్కిరిస్తున్నదే, నాకు గీ పూలంగి ఏం వద్దు, లాగు తొడిగియ్యి అనిఅన్నడు. ఇదిజూసి తల్లి అయ్యో! దేవుడా నేనేం జేసిన రొట్టె పిండికాడికి వచ్చెదాగ అని మనుసుల అనుకొని మీదికేమొ "ఆ దానిమొకం, అది నీకేమో పెద్ద గీటురాయి అయిపాయెను, అది అంటే నీవు సిగ్గువడ్తవా? పట్నాల పెరిగిన పోరి, మరి యీ పోషాకులు ఈ ఎన్కటి అలంకారాలు దానికెక్కడివి. అయినా తిరుపతి నీవింత అంబ్యాద సన్నాసివి అయితె ఎట్లరా? అది నీ పెండ్లాం గాదురా! అందుకే అట్లా పరాశ్కం అడ్డది. ఊకో నాయినా, ఇంగ జెట్టు సేపు ఉంచుకోవాలె: మాతండ్రి చంద్రదీపం అని కొడ్కునుబుజగరిస్తుంటె ఇన్ని మాటలు యింటున్న ఏశమ్మ తల్లి అడ్డంవచ్చి "వదినె పనికూనలు వాళ్ళు, వాళ్ళకు మనము పెండ్లాం, మొగడు అని మాటలు జెప్పితే ఏంబాగ? రేపు ఎవరి అదృష్టాలు ఎట్లా ఉన్నవో మనము మన పిల్లలను గన్నంగని వారి అంశలను గన్నమా అని అనెటాల్లకు సీతమ్మకు ఎక్కడలేని దుక్కం ముంచుకొచ్చి ఎక్కి ఎక్కి ఏడ్సుకం మొదలు వెట్టింది.

ఇంతట్లనె జమ్మికాడికి వోయిన కాశన్న బంగారం దీసుకొని ఇంటికి వచ్చి శోకనాలు వెట్టి ఏడుస్తున్న సెల్లె లిరుజూసి జెల్లంగొట్టిన రాయితీర్గ నిలవడ్డడు. కొంచెంసేపటికి రెండు దెల్వని కాశన్న సంగతి ఏందో తెలుసుకుందము అని "అమ్మా సీతమ్మ ఇదేందే పండుగపూట, నిండు ఇంట్ల కూర్చొటమ్మతీర్గ నీవు వచ్చినవని నేనుమురిస్తే ఇదేం, అన్యాయం అమ్మా" అన్న,అన్న మాటలుయిని సీతమ్మ ఇంకా కొంచెం గొంతు పెద్దగజేసి "మీ ఇంటికి జొరవడి వచ్చింది నాదె బుద్ధి తక్కువ ఏలెదంత లేదు నా పిల్లవాణ్ణి ఎక్కిరిచ్చి, ఎక్కిరిచ్చి మాలెకాకిపోలె పొడిసిపెడ్తుండది. ఏదో పసిపిల్లలు తెల్వనోళ్ళు అని ఊకుంటె నీ పెండ్లాం వాళ్ళకు బుద్ధిసప్పుతది అనిఅనుకుంటె అట్లపోయి తాను అందుట్లనే గలిసి పిల్లకు శాళం ఏస్తుండది. నా కొడుకుకు నీబిడ్డ పెండ్లాం అంటేనే తప్పు వచ్చిందా? మేము నీకంత కొఅగాలేదా? కండ్లకు గనవడలేదా? నేనూ జూస్త రేపు నీ బిడ్డను ఏ తాల్కదారుడు జేసుకుంటడో. ఏ అమిసుసాపు చేతవడ్తదో, అట్లా మ్యానోళ్ళను గాదనివచ్చి మనుము అందుకునేటోడు ఎంత గురేటు కాడో? అవును మావోడు కుంటోడా? గుడ్డో డా? సదువు రాదా? మాఊళ్ళ శంకరయ్య పంతులు వాడంటె అగ్గిప్రాణం ఇడుస్తడు. అప్పుడె వాణికి బొట్లు, సిన్నెరుసు, పెద్ద ఇరుసు, పెద్ద జాలశిక, కృష్ణశతకంల పద్యాలు అన్నివస్తవి. నిజంగజూస్తే నీ పిల్ల పిడ్గుతు సక్కగంపగయ్యాలి, మా ఇంట్ల ఎట్ల నెగుడుతది. అయినా పట్నంల పుట్నంగింజ నాకెందుకు. ఈ కొరివినిదెచ్చి నెత్తి గోక్కున్కం అని అనుకున్నగనిమళ్ళా ఎంతైన తల్లిగారిల్లు. తల్లిగారింటికి రాకపోకలుంచుకోవాలంటే ఇయ్యం అందుకోవాలె అని నీయింటికి వచ్చిన. నేనైనేనొప్పనందుకు కండ్లకు అద్దుకొని, సూసుకాడోలె ఉన్న నాకొడుక్కు నీవడిశిని ఇస్తే ఈడు జోడు కలిసిన పిల్లకు కండ్ల ఎదురుగ ఉంటే కండ్ల పండుగ అని అనుకున్న. అయినా సూస్త రేపు పరాయి పురుగు ఎట్లా వచ్చి మనుము అందుకుంటడో. ఈడనికడప ముంగలనే కొబగు పరుసుకొని పండుకుంట పిల్లను ఎత్తియిచ్చే అన్నవు, కొంచలోయె ఇయ్యబోడు నా మీదికెల్లి పడ్డుకుంట పోవాలె" అని ఇప్పుడైనా అన్న వదినె సరే అంటరు అనురున్నది. కాని పాపం వాండ్లు ఏమని అనాలె. ఏం సంగతి ఏం దెల్వక అట్లనే జూస్తుంటే సీతమ్మ అగ్గితీరు ఉన్న కోపాన్ని ఆపుకోలేక ఇంగ ఈడ ఒక్కగడియసేపు అయినా ఉండ, తల్లిగారిల్లు, అనుకున్న గని ఎక్కడి అన్నా ఎక్కడి నెల్లె "అమ్మ" పోయిననాడె అన్ని పోయినవి. ఇంత పాపం జరుగుతది అని అనుకోలే అని పాయ్యే అదుకు అన్ని జతనం జేసుకొని కొడుకుకొరకు జూస్తది. ఈ వెట్టి ఇద్దర్ని ముద్దువెట్టుకున్నది.

సందట్ల ఏశి, తిరుపతి సంగతి అందరు మర్సిపోయిండ్రు. ఏశికి ఏం దెల్వక పోయిన ఇదంత ఏందో తాను బావను ఎక్కిరిచ్చినందుకే అత్త, అమ్మ, నాయినా అందరు పంచాయతి బెట్టుకుంటున్నరని కోళ్ళగూడు ఎన్కదాగింది. తిరుపతి పాపం ఎన్కఉన్న జడ గత్తరిచ్చుకొని, ఎర్రఉలను ఏశికిస్తే అది జడకు ఏసుకుంటది, ఇంగ తన జతపట్టి ఆడుకుంటదని చేతులపట్టుకొని ఇంటెనుక మల్లెచెట్టుకింద గూసున్నడు. పిల్లగాడు యాడికి వోయెనో అని కూత బెట్టుకుంట వచ్చిన సీతమ్మకు కొడుకును జూసి నెత్తిన పిడుగు పడ్డంతపని అయింది. అల్లె కడుపు మసిలి. దేవునిదిక్కు మొకంజేసి "స్వామి! తిరుపతి ఎంకటేశ్వర్లు, పసికూన తప్పుజేసిండు, రెండు దెల్వని సంటోడు నీ సొమ్మును గత్తిరించిండు. అని మొక్కుకోని చెంపలేసుకొని, గుగ్గిలం ఏశినశిగమోలె తామసంతోటి "అయ్యో! ఈ కొంపల ఇంతఅన్యాలం జరుగుతది అని అనుకోలేదు. నీఇంటికి, నీ నమ్మదానికి దండం. ఇప్పుడె ఇంత ముంచుక వచ్చింది. కాడువడి కంపల వడకముందే మా ఎంకటేశ్వర్లు, అనుమాండ్లు అడ్డంవచ్చి సాయపడి, మీ నోటి నుంచి ఆమాట అనిపిచ్చిండు. అమ్మో పెద్దదయినంక నీబిడ్డ మావోణ్ణి మాలపక్కీర కుక్కనుజేసి తిప్పినట్లు దిప్పు. ఆఖరికి వాణ్ణి నాకుగాకుండ జేసు. ఏమిట్ల ఏమి లేదు ముందలజూడు ముసుళ్ళ పండుగ అని, ఏశమ్మ, ఎంకమ్మ నగింది అని మావోడు సామి సొమ్ము జుట్టు గత్తరిచ్చి పాడుజేసుకొనె. పువ్వు అసుంటి అంగిని నాకు వద్దు అనె నాయిన! తిరుపతి రాతండి పోరం! నూరు మంది దేవుళ్ళు సాయపడితే నీవు బుట్టినవు బిట్టా. దారా అని" వాన్ని పోదాం దారా అని గుంజితె వాడు రాడు. అమ్మా ఈ ఒక్కదినం ఉండిపో సీత! నామాట యిను. నాతల్లిఅని అన్న బతిమాలినా యినకుండ రాను రాను, అని ఏడుస్తున్న తిరుపతిని గొళ గొర గుంజుకొని పోతుంటే ఇంతసేపు ఊకున్న ఏశి దొడ్డిలకెల్లి ఉరుక్కుంటవచ్చి అత్తా నీవు పోకు, బావను దోల్క పోకు మీరు వోతే నేనువస్త నన్నుదోల్క పోండి. అత్తా ఇంగెప్పుడు బావను జూసి నగను, జుట్టు గత్తరియ్యను. బావ ఆడిపిల్ల అనను. నీవు, బావ అందరు నన్ను పెండ్లాం అనే పిలువుండి". అని ఏశి అనేవరకు, కాశన్న, సీతమ్మ, సరస్వతమ్మ అందరు గొల్లుమని ఒక్కసారి పిల్లలనిద్దర్ని పట్టుకొని ఎళ్ళింద్రు. ఇంగ కాశన్న మాత్రం కండ్లు రుమాలు గుడ్డతోని తూడ్సుకుంట సీత! రామ్మరా, ఇది అంతా దేవుని మాయ. నీ ఇష్టంవచ్చినట్లెగాని, జత గాండ్లను మన మెందుకు ఏరుతెయ్యాలె అని బంగారం దీసి చెల్లెకు వెట్టిండు. సంబురంగ సీతమ్మ ఏశిమెళ్ళ కంటె వెట్టి ఇద్దర్ని ముద్దువెట్టుకున్నది.

జాతీయఫలములు

శ్రీమదాచార్య రఘునాథ చక్రవర్తి

27-8-1961 ఆదివారము నుంచి 2-9-1961 శనివారము వరకు

గ్రహగతి: కర్కాటకములో శుక్రుడు - సింహములో రవి, రాహువులు 31 వరకు బుధుడు - కన్యలో కుజుడు - 1 నుంచి బుధుడు-మకరములో శని, గురులు కుంభములో కేతువు - కుంభ, మీన, మేష, వృషభములలో చంద్రుడును సంచరించెదరు.

మేషం:

అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము.

ఈవారము ప్రమోదముతో ప్రారంభమై వ్యయముతో అంతమవుతుంది. శుభప్రదమైన కాలము. సుఖము అవిచ్ఛిన్నముగా ఉంటుంది. లాభము ఎడతెగకుండా ఉంటుంది. కాని వైరము, ధననాశము, హాని, చిత్త చాంచల్యము సంప్రాప్తమవుతవి. 31 వరకు దరిద్రదశ 1 నుంచి ఆభరణ ప్రాప్తి. అశ్విని- రాజకీయ వ్యవహారాటంకము. 29 బంధుదర్శనము అమితాహార భక్షణము. 30 ఇష్టమిత్రగోష్ఠి బద్ధకము. భరణి- రాజకీయ వ్యవహార జయము. 30 బంధుదర్శనము, భోజనమువల్ల నీరసము. ఇష్టమిత్రగోష్ఠి మత్తు. కృత్తిక- రాజకీయ వ్యవహార జయము. 30 బంధుదర్శనము సాధుజన సందర్శనము 31 ఇష్టమిత్రగోష్ఠి, విచిత్ర వస్తు సందర్శనము.

వృషభం:

కృత్తిక 2, 3, 4 పాదములు,

రోహిణి, మృగశిర 1, 2 పాదములు.

ఈవారము లాభముతో ప్రారంభమై సుఖాంతమవుతుంది. సౌఖ్యప్రదమైన కాలము. సంతాన యోగక్షేమములు మేలుగా ఉంటవి. కాని కుటుంబపీడ, లోకులదృష్టిలో తేలికతనము, కలహము, వైకల్యము సంప్రాప్తమవుతవి. 31 వరకు శుభము 1 నుంచి దరిద్రదశ 27వ తేదీ మంచిది. రోహిణి- యత్నీకృత కార్యసాధనము. 27 ఇష్టమిత్రగోష్ఠి అరణ్యవస్తు ప్రాప్తి 31 బంధుదర్శనము మృదుమధుర పదార్థభక్షణము. ఇష్టమిత్రగోష్ఠి చోర భీతి. మృగశిర- నూతన కార్యనిర్మాణము. 27 బంధుదర్శనము ధనవ్యవహారములో ఆలోచన. 31 బందర్శనము దేవతాభక్తి 1 ఇష్టమిత్రగోష్ఠి ఉల్లాసము.

మిధునం:

మృగశిర 3, 4 పాదములు,

ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈవారం వ్యాకులత్వముతో ప్రారంభమై వ్యయముతో అంతమవుతుంది. సుఖప్రదమైన కాలము. అదృష్టము కలసివస్తుంది. సంపద అవిచ్ఛిన్నముగా ఉంటుంది. కాని కలహము, శత్రుభీతి, హాని, దుఃఖము సంప్రాప్తమవుతవి. 31 వరకు వ్యయము 1 నుంచి శుభము. 28, 29 తేదీలు మంచివి. ఆర్ద్ర- ప్రయత్నముతో కార్యసాధనము. 28 ఇష్టమిత్రగోష్ఠి అన్యసహాయాపేక్ష. 1 బంధుదర్శనము నాట్యదర్శనము ఇష్టమిత్రగోష్ఠి, నిర్మలమనస్సు. పునర్వసు- అకారణ శత్రుత్వము. 28 బంధుదర్శనము ధనలాభము. ఇష్టమిత్రగోష్ఠి సాహసకార్యాచరణము. 1బంధుదర్శనము జ్యోతిష విద్యావిషయము. 2 ఇష్టమిత్రగోష్ఠి, చిత్రవస్త్రధారణ.

కర్కాటకం:

పునర్వసు 4వ పాదము,

పుష్యమి, ఆశ్లేష.

ఈవారము వ్యయముతో ప్రారంభమై ప్రమోదముతో అంతమవుతుంది. లాభప్రదమైన కాలము. ఆరోగ్యము ఇనుమడించియుంటుంది. కాని హాని, దండుగలు, కలహము, భీతి సంప్రాప్తమవుతవి. 31 వరకు ఇనుమడించిన లాభము 1 నుంచి వ్యయము. 30, 31 తేదీలు మంచివి. పుష్యమి-ఆత్మబంధువైషమ్యము. 28 బంధుదర్శనము రాజజన సల్లాపము. 29 ఇష్టమిత్రగోష్ఠి, శయ్యాభోగము 2 బంధుదర్శనము, మానసోల్లాసము ఇష్టమిత్రగోష్ఠి వినోద క్రీడాసక్తి. ఆశ్లేష- ప్రాణమిత్ర వైషమ్యము. 29 బంధుదర్శనము, అప్రియ వార్తాశ్రవణము. ఇష్టమిత్రగోష్ఠి ఉత్సాహము. 2 బంధుదర్శనము సంగీత సరససల్లాపములు.

సింహం:

మఘ, పుబ్బ, ఉత్తర 1 పాదము.

ఈవారము లాభముతో ప్రారంభమై లాభముతో అంతమవుతుంది. ఐశ్వర్యప్రదమైన కాలము. సుఖము అవిచ్ఛిన్నముగా ఉంటుంది. కాని ద్విగుణీకృతభీతి విడువని వ్యయము, స్థానచలనము, దుఃఖము సంప్రాప్తమవుతవి. 31 వరకు నిర్బంధ పరిస్థితి 1 నుంచి లాభము, 27, 1, 2 తేదీలు మంచివి. మఘ- ధనవిషయమై ప్రయత్నము. 29 బంధుదర్శనము అధిక వ్యయము. 30 ఇష్టమిత్రగోష్ఠి మనోవైకల్యము. పుబ్బ- నూతన వ్యాపార ప్రయత్నము 30 బంధుదర్శనము చంచలమనస్సు.ఇష్టమిత్రగోష్ఠి తొందర మాటలు. ఉత్తర - నష్టధనప్రాప్తి. 30 బంధుదర్శనము కఠిన సంభాషణ 31 ఇష్టమిత్రగోష్ఠి చపలత్వము.

కన్య:

ఉత్తర 2, 3, 4 పాదములు

హస్త, చిత్త 1, 2 పాదములు.

ఈవారము ధనప్రాప్తితో ప్రారంభమై వ్యాకులత్వంతో అంతమవుతుంది. సంపత్ప్రదమైన కాలము. సంతోషము ద్విగుణీకృతముగా ఉంటుంది. కాని ఖేదము, పీడ, విడువని వ్యయము మోసఅవుతవి. 31 వరకుఆరోగ్యం 1 నుంచి నిర్బంధపరిస్థితి. 27, 28, 29 తేదీలు మంచివి. హస్త- వ్యాపారాది ఉద్యోగమూలక ధనలాభము 27 ఇష్టమిత్రగోష్ఠి ఘనకార్య ప్రయత్నము. 31 బంధుదర్శనము దూరవార్తాశ్రవణము. ఇష్టమిత్రగోష్ఠి ఇతరులవలన శ్రమ. చిత్త-స్వాధికారాభివృద్ధి. 27 బంధుదర్శనము ధనవిషయమై ప్రయత్నము 31 బంధుదర్శనము సత్కథాశ్రవణము. ఇష్టమిత్రగోష్ఠి ప్రియవస్త్రధారణ.

తుల:

చిత్త 3, 4 పాదములు, స్వాతి,

విశాఖ 1, 2, 3 పాదములు.

ఈవారము నష్టముతో ప్రారంభమై వ్యయముతో అంతమవుతుంది. లాభప్రదమైన కాలము. ఆరోగ్యమొకవంక - అనారోగ్యమొకవంక ఉంటూ ఉంటవి. కాని అవమానము, సంతాపము, క్లేశము, విడువనివ్యయము సంప్రాప్తమవుతవి. 31 వరకు సంతోషము 1 నుంచి ఇనుమడించిన ఆరోగ్యము. 28, 29, 30, 31 తేదీలు మంచివి. స్వాతి - స్వప్రజ్ఞాకార్యాలోచనము. 28 ఇష్టమిత్రగోష్ఠితో ందరవనులు. 1 బంధుదర్శనము, వర్తకజన స్నేహము. ఇష్టమిత్రగోష్ఠి యత్నీకృత కార్యసాధనము. విశాఖ - ఆకస్మిక ధనవ్యయము. 28 బంధుదర్శనము ధనలాభము. ఇష్టమిత్రగోష్ఠి, ధనలాభము. 1 బంధుదర్శనము క్రయవిక్రయ నిపుణత్వము. 2 ఇష్టమిత్రగోష్ఠి కేళీవిలాసము.

వృశ్చికం:

విశాఖ 4 వ పాదము,

అనూరాధ, జ్యేష్ఠ.

ఈవారము ఆనారోగ్యముతో ప్రారంభమై లాభముతో అంతమవుతుంది. సంపత్ప్రదమైన కాలము. స్త్రీలాభము ఒనగూడుతుంది. జయము ద్విగుణీకృతముగా ఉంటుంది. కాని ఆపద, విరోధము, హాని, సంప్రాప్తమవుతవి. 31 వరకు శత్రునాశము 1 నుంచి సంతోషము. 30, 31, 1, 2 తేదీలు మంచివి. అనూరాధ - ఈప్సిత కార్యవిఘ్నము. 28 బంధుదర్శనము, సత్పురుష సహవాసము. 29 ఇష్టమిత్రగోష్ఠి శుచియైన వస్త్రధారణ 2 బంధుదర్శనము ధనలాభము ఇష్టమిత్రగోష్ఠి, స్వేచ్ఛావిహారము. జ్యేష్ఠ- యత్నీకృత కార్యాలస్యము. 29 బంధుదర్శనము వ్యర్థముగా తిరుగుట ఇష్టమిత్రగోష్ఠి స్వకార్యానుకూల్యము. 2 బంధుదర్శనము ధనలాభము.

ధనుస్సు:

మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ

1 పాదము.

ఈవారము లాభముతో ప్రారంభించి ధనప్రాప్తితో అంతమవుతుంది. లాభప్రదమైన కాలము. సౌఖ్యము అవిచ్ఛిన్నముగా ఉంటుంది. కాని దరిద్రదశ హాని, ధనహానము, భీతి, సంతాపము సంప్రాప్తమవుతవి. 31 వరకు విఘ్నములు 1 నుంచి శత్రునాశము 27, 1, 2 తేదీలు మంచివి. మూల - క్రయ విక్రయ మూలక ధనలాభము. 29 బంధురర్శనము దేవతారాధన 30 ఇష్టమిత్రగోష్ఠి, కలసివచ్చిన పని చెడుట. పూర్వాషాఢ- మిత్రజన వశ కార్యానుకూల్యము. 30 బంధుదర్శనము శరీరశ్రమ ఇష్టమిత్రగోష్ఠి వృథాశ్రమ. ఉత్తరాషాఢ - యత్నకార్యదీక్ష 30 బంధుదర్శనము పుణ్యకథాశ్రవణము 31 ఇష్టమిత్రగోష్ఠి, మదవ్యవహారములు.

మకరం:

ఉత్తరాషాఢ 2, 3, 4 పాదములు

శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదములు,

ఈవారము వ్యయముతో ప్రారంభమై నష్టముతో అంతమవుతుంది. పొరపాటు, ఆపద, క్లేశము, త్రిప్పటం, అనారోగ్యము, విడువని వ్యయము సంప్రాప్తమవుతవి. 31 వరకు సంతోషము 1 నుంచి విఘ్నములు. 28, 29 తేదీలు మంచివి. శ్రవణం- మిత్రజన సహాయము. 27 ఇష్టమిత్రగోష్ఠి ధన వ్యయము. 31 బంధుదర్శనము నీటికి సంబంధించిన వస్తులాభము ఇష్టమిత్రగోష్ఠి ప్రయాణ తొందర. ధనిష్ఠ- సంగీత సాహిత్య సరససల్లాపముల యందు ఆసక్తి 27 బంధుదర్శనము ధన నిక్కచ్చి. 31 బంధుదర్శనము సంఘములో గౌరవము. ఇష్టమిత్రగోష్ఠి శయ్యాభోగము.

కుంభం:

ధనిష్ఠ 3, 4 పాదములు, శతభిషం,

పూర్వాభాద్ర 1, 2, 3 పాదములు.

ఈవారము సుఖముతో ప్రారంభమై అనారోగ్యముతో అంతమవుతుంది. క్లేశము, శోకము, అనారోగ్యము, దుఃఖము, త్రిగుణీకృత భీతి. సంప్రాప్తమవుతవి. 31 వరకు వ్యసనము 1 నుంచి సంతోషము, 30, 31 తేదీలు మంచివి. శతభిషం-మిత్రజన సల్లాపము. 28 ఇష్టమిత్రగోష్ఠి, కార్యాటంకము. 1 బంధుదర్శనము, విద్వద్గోష్ఠి ఇష్టమిత్రగోష్ఠి, శ్వేత వస్తు లాభము, పూర్వాభాద్ర-వంచకులైన మిత్రుల వల్ల మోసము, 28 బంధుదర్శనము, పుణ్యకర్మ చరణ. ఇష్టమిత్రగోష్ఠి, ఉష్ణము లేక జ్వరపీడ 1 బంధుదర్శనము, క్రయ విక్రయనిపుణత్వము 2 ఇష్టమిత్రగోష్ఠి, కేళీలలోత్వము,

మీనం:

పూర్వాభాద్ర 4 వ పాదము,

ఉత్తరాభాద్ర, రేవతి.

ఈవారము వ్యయముతో ప్రారంభమై లాభముతో అంతమవుతుంది. లాభము ఇనుమడించి యుంటుంది. సుఖము కూడా ద్విగుణీకృతముగా ఉంటుంది. శత్రువులు నశించిపోతారు. కాని కలహము, క్లేశము తప్పవు. 31 వరకు ఆభరణ ప్రాప్తి 1 నుంచి వ్యసనము. 1,2 తేదీలు మంచివి. ఉత్తరాభాద్ర-కీర్తిద్రవ్య లాభము. 28 బంధుదర్శనము, సుఖభోజనము, 29 ఇష్టమిత్రగోష్ఠి, మధుర పదార్థ భక్షణము, 2 బంధుదర్శనము, ధన లాభము ఇష్టమిత్రగోష్ఠి, స్త్రీసౌఖ్యము. రేవతి-రాజకీయ వ్యవహార భీతి. 29 బంధుదర్శనము, అన్యకులజులతో పరిచయము, ఇష్టమిత్రగోష్ఠి, శయ్యాభోగము 2 బంధుదర్శనము.

చెకోస్లావాకియాలో భారతీయ భాషా సాహిత్యాల అధ్యయనం

డా॥ జాన్‌మరెక్

డాక్టర్ జాన్‌మరెక్ ప్రాగ్‌లో చెకోస్లావాక్ శాస్త్ర విజ్ఞాన పరిషత్తుకు చెందిన ప్రాచ్యవిద్యా సంస్థలో భారతీయ విద్యాధ్యయన శాఖలో పరిశోధకులుగా వున్నారు.

ఆయన ప్రాగ్‌లో 1991 ఆగస్టు 31 న జన్మించారు. అక్కడే ఛార్లెస్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో పట్టభద్రులై, హిందీ, ఉర్దూ,పర్షియన్ భాషా సాహిత్యాలలో ప్రత్యేక కృషి చేశారు. ఉర్దూకవి ఇక్బాల్ కావ్యాలపై ఆయనొక సిద్ధాంత వ్యాసం వ్రాశారు. ప్రాగ్‌లోని ప్రభుత్వ భాషా పాఠశాలకు అనుబంధంగా వున్న ప్రాచ్యభాషల పాఠశాలలో ఆయన కొంతకాలం హిందీ ఉర్దూ పర్షియన్ భాషలు బోధించారు. 1955లో ఆయన ప్రాచ్యవిద్యా సంస్థలో చేరి ఉర్దూసాహిత్య పరిశోధనచేస్తున్నారు. డాక్టర్ మరెకు భారతదేశంలో మూడు మాసాలపాటు వుండడానికి వచ్చారు. ఇక్కడ హిందీ ఉర్దూ భాషలు బోధిస్తున్న ప్రధాన కేంద్రాలను ఆయన సందర్శించారు].

చెకోలూస్లావక్కులు భారతీయ భాషలను శాస్త్రీయంగా పరిశోధించడం భారతీయ యూరోపియన్ భాషలను సరిపోల్చి అధ్యయనం చేయడంతో ప్రారంభమైంది. ఇతర యూరోపియన్ దేశాలలో లాగనే ఇక్కడకూడా భారతీయ భాషలను ప్రత్యేకంగా చదవడం క్రమంగా ఆరంభమైంది. ఈవిషయంలో ప్రాగ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆగస్టు షిలిచెర్ (1822-69) నూ, ఆలోయిన్ వార్నిస్క్ (1825-87) నూ పేర్కొనాలి. భాషలను సరిపోల్చి చూడడమేగాని భారతీయ భాషలలో పండితులు కారు వారు. వీర్నిస్క్ తరువాత అతని స్థానంలో పనిచేసిన జోసెఫ్ జుబాటీ (1855-1931) కూడా ఇలాంటి పండితుడే గాని ఆయన సంస్కృత భాషను గూర్చి, వేదాలు, ప్రాచీన భారతీయపురాణాలు. నాటకాలగూర్చి అనేక వ్యాసాలు వ్రాశారు.

ఆల్ఫ్రెడ్ లుడ్‌వింగు (1837-1912) ఋగ్వేదాన్ని జర్మనీ భాషలోకి అనువదించారు. ప్రాచీన భారతీయ సాహిత్యం గురించి అనేక వ్యాసాలు వ్రాశారు. తరువాత, మొరిట్జ్ వింటర్ నిట్జు (1863-1937) తన "భారతీయ సాహిత్య చరిత్ర"ను మూడు సంపుటాలుగా ప్రచురించారు. వీటిలో మొదటి రెండు సంపుటాలు 1927 లోనూ, 1933 లోనూ కలకత్తాలో ఇంగ్లీషులో వెలువడ్డాయి,

చార్లెస్ విశ్వవిద్యాలయానికిచెందిన విన్‌సెన్స్ లెస్నీ (1882-1953)కూడా భారతీయ విద్యలో ప్రసిద్ధ పండితుడే. సంస్కృతం, అవెస్తాన్, ప్రాచీన పర్షియన్, ప్రాకృతం, పాళి, మరాఠీ, బెంగాలీ, రోమన్ భాషలలో కృషి చేశారాయన. ఆయన బౌద్ధమతంపై వ్రాసిన గ్రంథం 1921 లోనూ, మళ్ళీ 1948 లోనూ ప్రచురించబడింది. ఆధునిక భారతీయ భాషలపట్ల సంస్కృతిపట్ల కూడా ఆయనకు చాల ఆసక్తి వుండేది. 1923-23 లోనూ, 1927-28 లోనూ ఆయన రెండుసార్లు భారతదేశాన్ని సందర్శించారు, శాంతి నికేతనంలో బెంగాలీ భాషలో ఉపన్యసించారు. మహాకవి రవీంద్రనాథ్ టాగూర్‌తో పరిచయ మేర్పరచుకున్నారు. ఆచార్య లెస్నీ "రవీంద్రనాథ్ టాగూర్, ఆయన వ్యక్తిత్వం, కృషి" అనే గ్రంథం రచించి లండన్‌లో ప్రచురించారు, సాంస్కృతిక రంగంలో ఆయన చెకోస్లావాకియా ఇండియాలను సన్నిహితంగా తీసుకువచ్చారు. ఒటకర్ పెట్రోడ్ మొట్ట మొదట చెకు భాషలో పాఠశాలలకు హిందూస్తానీ భాషా వాచకాలను వ్రాశ

శ్రీనాథ భారతము

శివరాత్రిమాహాత్మ్యము (3)

ఇట్లు కాదంబరిలోని వర్ణనములు ననుకరించుచు యీ గ్రంథమున పెక్కు పద్యములు గోచరించును. ఈ గ్రంథమున హేమాంగదుడు, కాదంబరిలోని శూద్రకుండును, తారాపీడునకును ప్రతిగా కవి వర్ణించెను. తారాపీడుని పట్టమహిషి విలాసవతి, యిందు యజ్ఞదత్తుని భార్య సుశీలగా రూపొందినది. కాదంబరిలోని శుకనాసుడు యీ గ్రంథమున యజ్ఞదత్తుడుగా రూపొందెను. అందలి చంద్రాపీడ వైశంపాయనులిందు విద్యార్థిగా నున్న సుకుమారుడుగా రూపొందెను. కాదంబరిలోని శుకమును దెచ్చిన చండాల దారికా రూపచ్ఛన్నయగు "మహాలక్ష్మి" యిందు చండాల కన్యగా వర్ణింపబడినది. అందలి శబరసేనాని మాతంగకుడు, ఇందు మాతతో గాపురమున్నటువంటి సుకుమార రూపముగా మారెను. అందు శబర వృద్ధ సైనికులు, యిందు వృద్ధ సుకుమారుని సహచరులుగా, కాదంబరిలో సంతానములేక విచారించు విలాసవతి, యిందు సుశీలగా నవతరించిరి. సుశీలను యజ్ఞదత్తుడు పెళ్ళాడుట, ఆమె తాంబూల కరండవాహిని గుట్టు చెప్పుట, శివాలయ పురాణశ్రుతి, దానధర్మము లాచరించుట, గర్భప్రాప్తి, కుమార సంరక్షణము మొదలగునవెల్ల కాదంబరిలోని విలాసవతి ననుకరించుచు వర్ణింపబడినవి. ఇట్లు కాదంబరిలోని ననుకరణములు పెక్కు యీ గ్రంథమున గోచరించుచున్నవి. ఇంతేగాక "సంపద పేరి" అను పద్యము...

"తమ్మనూనుష కాలోచితంబులైన
కీర్తనంబుల మైపులకించు కొండ్రు
తామమర్త్యులుగా మదిఁదలఁతురహహ
విత్త మదమత్త చిత్తులై వెట్టి జనులు"

అను పద్యమునకు, యీ పద్యమునకు యీ గ్రంథమున ప్రసక్తి లేకున్నను "కాదంబరీ రసాస్వాదన పరవశత్వమున"నే కాదంబరిలోని వాక్యములను ఆంధ్రీకరించి యిందు వ్రాసెనన్న, యిది శ్రీనాథున కాంధ్రముపై గల ప్రీతిగా దెలియుచున్నది. ఇంతేగాక కాదంబరిని అనువదించు తలంపుతోడనే శ్రీనాథుడు యీ గ్రంథమును ఆరంభించియుండునని, కాశీఖండమునందు గుణనిధి దుర్గుణ వర్ణనముతోడను, శివరాత్రి వ్రత ప్రభావ వర్ణనముతోడను తృప్తిపడక సుకుమార చరిత్ర రూపముగా, యీ గ్రంథమును రచించెనని పండితుల అభిప్రాయము.

ఆంధ్రీకరణమునందలి కొన్ని స్వల్ప లోపములు

1 కాదంబరి గ్రంథమున "సుమతి రివ నలస్య" అని యుండగా, శివరాత్రి మాహాత్మ్యమున యజ్ఞదత్తుని వర్ణించుచు "నలునకు దమనుండునుం బోలె బ్రధానియై" అని ఆంధ్రీకరించెను. నలునకు మంత్రి సుమతిగాని దమనకుడుగాదని తెలియుచున్నది.

2. "దశరథుండు విభాండక తనయు నారాధించి దిగ్గజంబులం బోలిన కుమారుల సకల లోక హితంబుగా నలుగురం బడసె" నని యీ గ్రంథమున గలదు. దిగ్గజములు యెనిమిది కాగా, దశరథ కుమారులను నలుగురను పేర్కొనుట కుపయోగించుట యప్రసిద్ధము.

3. "బహుదినంబు లమ్మహా సచివు పట్టపు దేవికి" అని సుశీలను పేర్కొనెను. కాని మంత్రి భార్యను పట్టపుదేవి యనుట సమంజసము కాదని తెలియుచున్నది. ఇట్లు ఆంధ్రీకరణమునందు కొన్ని లోపములు గానవచ్చుచున్నవి.

శివరాత్రి మాహాత్మ్య గ్రంథము పెద్దన్న కాలమున ప్రాచుర్యము నందినట్లు యీ క్రింది పద్యముల వలన దెలియుచున్నది.

"కాయజ విక్రియం బడయఁగాని కులంబున సంభవించియ,
న్యాయము నేయునే యిటు దురాత్ముడు పీడు త్రపాభిమానముల్
మాయఁగఁదట్టి యంచు నతి మాత్రము లజ్జితుఁడైన కైవడిం,
దోయ జషండ బాంధవుఁ డధోముఖుఁడయ్యె నభోంగణమ్మునన్"

అని సూర్యాస్తమయ వర్ణనము శివరాత్రి మాహాత్మ్యమునందుండగా, యీ పద్యభావము ననుకరించుచు పెద్దన మనుచరిత్రమున...

చ. "తరుణిన నన్యకాంత నతిదారుణ పుష్ప శిలీముఖ వ్యథా
భర వివశాంగి నంగభవు బారికి నగ్గము చేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితోడ నని రోష భీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయ దీధితిన్"

అని సూర్యాస్తమయ వర్ణనము గావించెను.

2. క. "త్రుంకె విభాకర బింబము
పంకజషండములు మొగిడెఁ బత్యగ్వీథిం
గం కేలీ తరు పల్లవ
సంకాశ చ్ఛాయఁ గొమరు సంజ జనించెన్"

అని సంధ్యా సమయమును, తామర పుష్పముల వర్ణనను పెద్దన అనుకరించి యీ క్రింది పద్యమును మనుచరిత్రమున వ్రాసెను.

శా. "శ్రేణుల్గట్టి నభోంతరాళమునఁ బాఱెం బక్షు లుష్ణాంశుపా
షాణ వ్రాతము కోష్ణమయ్యె మృగతృష్ణా వార్థి లింకెం జపా,
శోణంబయ్యెఁ బతంగ బింబము దిశాస్తోమంబు శోభాదరి,
ద్రాణంబయ్యె సరోజషండములు నిద్రాణంబు లయ్యెంగడున్"

ఇట్లు శివరాత్రి మాహాత్మ్య గ్రంథమును పెద్దనాదులు బాగుగా నెరుగుదురనియు, యీ గ్రంథములోని పద్యముల భావముల ననుకరించి మనుచరిత్రమున కొన్ని పద్యముల వ్రాసెననియు దెలియుచున్నది.

శివరాత్రి మాహాత్మ్య గ్రంథమున శ్రీనాథుని యితర గ్రంథానుకరణములు పెక్కు గోచరించును. కాశీఖండమునందలి గుణనిధి చరిత్రము, శివరాత్రి మాహాత్మ్య గ్రంథమున సుకుమార చరిత్ర రూపమున వర్ణించెను. కాశీఖండమున కుబేర పూర్వ వృత్తాంతము చెప్పుచు యజ్ఞదత్తుని కుమారుడు గుణనిధి దుర్వర్తనమును వర్ణించెను. అదేవిధముగ సుకుమారుని దుర్వర్తనమును శివరాత్రి మాహాత్మ్యమున సుకుమారుని రూపమున వర్ణించెను. కాశీఖండమున గుణనిధి, తన దుర్వర్తనమునకు యిల్లు విడిచి పోవును. శివరాత్రి మాహాత్మ్యమునను, సుకుమారుడు తన దుశ్చేష్టలకు గృహము విడువవలసిన వాడై అరణ్యముల దిరుగాడెను. ఇట్లీ రెండు గ్రంథములలో గుణనిధి సుకుమారులు, క్షామికి వ్యథ జెంది, క్షుద్బాధకు లోనై తల్లిని, ఆమెయొక్క మాతృ హృదయమును తలంచుకొని చింతించుదురు.

"అరుణ గభస్తి బింబ ముదయాద్రిపయిం గనుపట్ట గిన్నెలోఁ
బెరుగును పంటకంబు పడి పిందియలుం గుడువంగఁ బెట్టు ని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్న దే
హర హర యెవ్వరిఁకఁ గడుపారని పెట్టెద రీప్సితాన్నముల్"

అను పద్యమును రెండు గ్రంథములలోను ఒకే విధముగ వ్రాసెను.

శ్రీనాథుని గ్రంథములందు సామాన్యముగా తరుచు ఉపయోగించు పదసంవిధానము, వీధి నాటకమునను, శివరాత్రి మాహాత్మ్యమునను గలవు. అందు "వ్యామ్రగాహ్య" కంకణ ఝుణ ఝుణాత్కారంబు, గంధ లసారీ పాణింధమంబు, చిఱుబంతి పనుపు, ఓలగంధము, నీర్కావిధోవతి మొదలగునవి గలవు. ఇవి శివరాత్రి మాహాత్మ్యమునను గలవు. ఇవిగాక జనంగమ ప్రమద, కర్ణాటతాటంకిని మొదలగు పదము లీకవి తరుచువాడును. ఈ పదములు శివరాత్రి మాహాత్మ్యమునను గలవు.

శ్రీశైల క్షేత్ర ప్రాచీనత-వర్ణన

శ్రీశైల క్షేత్రము మిగుల ప్రాచీనమైన క్షేత్రము. ఈ క్షేత్రము అనాదినుండి వెలసినది. ఈ శివ క్షేత్రము మిగుల ప్రాచీనమైనదని యీ క్రింది పద్యమువలన దెలియుచున్నది.

"మైనాకం, మంధరం మేరుం
శ్రీశైలం గంధమాదనం
పంచశైలాన్ పఠేన్నిత్యం
మహాపాతక నాశనం"

అని ఒక ప్రసిద్ధకవి పలికినట్లు గలదు. ఈ కవి యేకాలమునకు చెందెనో తెలియదు. ఈ శ్లోకమునుబట్టి యీ పద్యమును వ్రాసిన కవి ద్వాపర యుగమునకు చెంది యుండవచ్చునేమోనని విమర్శ. (శ్రీ రాయసం శేషగిరిరావు) ఈ క్షేత్రమునుగూర్చి రామాయణ, మహాభారత కాలములనుండియు భేదాభిప్రాయములు లేక వాల్మీకి వ్యాసులువ్రాసిరి. కైవల్యోప నిషత్తులో "శ్రీశైల దర్శనాన్ముక్తిః" అని పేర్కొనినట్లు గలదు. ఈ క్షేత్రము పురాజాతి పురాణమునుట నత్యదూరము కాదు. స్కాంద పురాణములో శ్రీశైల ఖండమొకటి గలదు. శ్రీశైలము పురాణప్రసిద్ధమైన ద్వాదశ లింగములలో ఒకటి. మనదేశము "త్రిలింగ దేశమ"ని ప్రసిద్ధి బడయుటకు శ్రీశైల మల్లికార్జునస్వామి ఒక కారణము. విష్ణుకుండిన రాజులు వైదికమత నిరతులు. వారు "శ్రీ మల్లికార్జునస్వామి పాదానుధ్యాతల"మని చెప్పుకొనినట్లు తెలియుచున్నది.

సోమవంశ రాజకుమార్తె చంద్రాదేవి తెల్లని కాంతితో వెలయు మల్లికా పుష్పములతో శ్రీశైల స్వామిని పూజించిన కారణమున యిచ్చటి శివలింగము మల్లికార్జున శివుడుగా పేరుపొందినట్లు తెలియుచున్నది. ఈకథ పండితారాధ్య చరిత్రమునను యిచ్చటి 16 వ శతాబ్ద శాసనమునను గలదు. ఆదికవి నన్నయ భారతమున శ్రీశైల క్షేత్రమును అర్జునుడు తీర్థయాత్రలు సల్పుచు దర్శించినట్లు వ్రాసెను. విదాశాఖుని ప్రతాప రుద్రీయములో మొట్టమొదట ఆంధ్రదేశము "త్రిలింగ దేశ"మని పేర్కొనబడినది. కాకతీయాంధ్ర చక్రవర్తులు పరమ మాహేశ్వరులు. అందు వలన కాకతీయాంధ్రులే ఆంధ్రదేశమును "త్రిలింగ దేశమ"ని వ్యవహరించియుండవచ్చునని చారిత్రకుల ఊహ. త్రిలింగ దేశమన ఆంధ్రదేశమని శ్రీశైల, ద్రాక్షారామ, కాళేశ్వరము లను మూడు క్షేత్రములు గలిగిన దేశముగాన దీని కీనామము ప్రాచుర్యము నందినట్లు తెలియుచున్నది.

శ్రీశైలము కర్నూలునకు 72 మైళ్ళ దూరమున గలదు. భారత దేశములోని తూర్పు కనుమలనుండి చీలిన నల్లమల కొండలోని ఒకపాయ యిది. నల్లమల కొండలు కర్నూలు మండలమునకు ఉత్తర భాగమునుండి చిత్తూరు మండలమువరకు ఉత్తర దక్షిణములుగానున్నవి. దానిలోయెత్తయిన శిఖరేశ్వరమే శ్రీశైలములోని ముఖ్యమైన స్థలము. ఈ నల్లమల కొండలు పది పన్నెండు పాయలుగా నున్నవి. అందులో కృష్ణాతీరమున ఆనుకొని ఉన్న కడపటి కనుమ శ్రీశైలము. కర్నూలు మండలమునుండి చిత్తూరు మండలము వరకుగల పర్వతశ్రేణిని శేషపర్వతమని యందురు. పుచ్ఛములో నవగా శ్రీగిరిలో శ్రీశైల మల్లికార్జునుడు మధ్యలో వేదగిరిలో శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిరి. శిరోభాగమున అనగా తిరుపతివద్ద యీ శేష పర్వతము సర్పమునకుగల ఏడు తలలుగా కొండపాయలగుటచే వేంకటేశ్వర స్వామిని ఆదిశేషుడు తలవాడా వెంకట రమణా!" యని యరుదురు.

శ్రీశైలము ద్వాదశ లింగములలో ఒకటి. ఈ క్షేత్రమునుగూర్చి కథలు, మాహాత్మ్యములు పెక్కు గలవు. ఎవరైనా నాలుగువేల ఋషులు నిరంతరము పరమేశ్వర ధ్యాన నిమగ్నులై ఉందురని ముప్పది మూడుకోట్ల దేవతలెల్లప్పుడు మల్లేశ్వరస్వామిని దర్శించుచుందురని ప్రతీతి. అందువలనే శ్రీనాథుడు అగస్త్యునిచే లోపాముద్రకు "గండ శిలలెల్ల శంభులింగంబులందు సిద్ధఋషులందు వసియించు చెంచులెల్ల" అని చెప్పించినాడు. భక్తి శ్రద్ధా తపస్సులు లేకభక్తులు కైలాసము చేరుట యెంత దుష్కరమో యాత్రికులు శ్రీశైలము చేరుట అంతకష్టము. శ్రీశైల క్షేత్ర పీఠభూమిరిర చదరపు మైళ్ళ వైశాల్యము గలిగియుండును. ఇది పురాతనమై ప్రాకారసహితమై కన్నుల పండువునేయు ఒక మందిరమును గలిగియుండును. ఈ మందిరమునకు మైలుకు లోపుగా కృష్ణానది ఉత్తరముగా ప్రవహించుచుండును. ఇదియే పాతాళ గంగతీర్థము. సాధారణముగా ఉత్తర వాహినిగాగల నదులవద్ద యాత్రాస్థలము లేర్పడుట పెక్కుచోట్ల కానవచ్చును. గంగాతీరమున కాశి, శ్రీప్రాణదివద్ద ఉజ్జయిని తుంగభద్రవద్ద అలంపూర్, గోదావరీతీరమున భద్రాచలము, కృష్ణాతీరమున అమరావతి మొదలగునవి ఉత్తర వాహినిగా గల నది క్షేత్రములు. ఉత్తర వాహిని మోక్షప్రదయని ప్రతీతి. శ్రీశైల ఆలయమునకు చుట్టును సిద్ధేశ్వరి, కామేశ్వరి, గౌరీశ్వర్యాది మూర్తులు పెక్కుగలవు. పాతాళగంగకుపోవు మార్గములో సింహబిలమను పురాణ బిలము గలదు. ఇందు నేటికిని ఋషులుగలరని ప్రతీతి. ఈ దేశములో యే క్షేత్రమునను శివునకు రెండు వివాహములు జరుగు సాంప్రదాయము లేదు. కాని యిచ్చట భ్రమరాంబకు మంత్రపూర్వక నిత్యనైవేద్యములతో పూజలు జరుగును. ఇది యీ క్షేత్రములో గల విశేషము. ఇచ్చట శంకరుడు సాంబ రూపమున పార్వతినిగూడుకొని గలడు, గాన పార్వతికి ప్రత్యేక పూజలు లేవు. అందువలన శివుడు మోక్షప్రదాత. ముముక్షువులకు కొంగు బంగారము. అందువలనే క్షేత్ర దర్శనము వలననే మోక్షము గలుగునని ప్రతీతి. కావున "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" అని పెద్దల వచనము. అభ్యుదయకాముకులకు పరప్రదాత్రి భ్రమరాంబ. ఈమె అభ్యుదయ శీల, జగన్మాత. లోక కల్యాణార్థము శ్రీశంకరులు శ్రీచక్రము నిచ్చట ప్రతిష్ఠించినట్లు తెలియుచున్నది. నిశ్రేయసాభ్యుదయ చింతామణి శ్రీశైలము. ఈ క్షేత్రమునకు సమీపమున గణపతి దేవాలయముగలదు. అదే సాక్షీ గణపతి దేవాలయము ఈ సాక్షీ గణపతి దేవాలయమునకు వచ్చిన యాత్రికుల పేర్లను తన జాబితాలో వేసుకొని అవసరము కలిగినప్పుడు తన తల్లి తండ్రులచే వారికి మోక్షము కలుగజేయునని ప్రతీతి. శ్రీశైల మల్లికార్జున లింగము యోగ లింగమగుట కారణముగ అజ్ఞాన, మాయామోహితులగు సామాన్య మానవుల మొఱ లాలకింపడని, భ్రమరాంబ భక్తుల మొఱ లాలకించునని ప్రతీతి. భక్తులు పలువురు అభ్యుదయ కాముకులగుట కారణముగ మోక్షప్రదాతయగు మల్లికార్జున శివుడు వారి మొఱలాలకింపక యుండగా భక్తులు యీ దేవుని "చెవిటి మల్లయ్య" అని అందురట. కాని మోక్షప్రదాతయగు శివునకు చెముడేమిటి?

తాసీషా కాలమునను న్న అక్కన్న-మాదన్నలు మల్లికార్జున భక్తులు. వారి కాలమున యీ క్షేత్రము రాజభోగముల ననుభవించినది. శ్రీశైల మహాక్షేత్ర గాథలు, పాతాళగంగ చరిత్ర వినితీరవలయును. శ్రీశైలము ఒక పుణ్యక్షేత్రము. ఒక దివ్యలోకము. చూచితీరవలయును.

"చాకున్న నీదు ముక్తుల
శ్రీ కాశీక్షేత్ర మెవ్వరికినే నిక్కం
బా కుధర మిచ్చు శిఖరా
లోకన మాత్రమున ముక్తులల్లసిలంగాన్"

శ్రీనాథుడు ఆ పుణ్యతీర్థమున-

గీ. అందు శేష ప్రతిష్ఠితుం డమృత దివ్య
లింగ మంగళమూర్తి ఖట్వాంగ పాణి
యార్ద్ర శశిమౌళి నాగేశ్వరాహ్వయుండు
ప్రతివసించు ననేక కల్పములనుండి"

అని కవి శివుని వర్ణించెను.

(ఇంకా ఉంది)

జ్ఞాపకాలు-:

నేను చదువుకున్న జాతీయ కళాశాల

శ్రీ ప్రభాకర్ జీ.

(అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి)

శ్రీ ప్రభాకర్ జీ ఆంధ్ర ప్రదేశ్ సర్వోదయ మండలి అధ్యక్షులుగా వెలుగుతూన్న ఇలాంటి రత్నాలలో ఒకరు. ఈయన చరిత్ర బందరు జాతీయ కళాశాల చరిత్రలో అనుబంధమై వికసించిన విధమును, ఆగస్టు 3,4 తేదీలలో బందరు జాతీయ కళాశాల స్వర్ణోత్సవ సందర్భమున తాను పూర్వవిద్యార్థుల సభకు ప్రారంభోత్సవంచేస్తూ శ్రీ ప్రభాకర్ జీ స్వయంగా ప్రసంగించారు! ఆయన స్వీయచారిత్రక ప్రసంగమును యీ క్రింది వ్యాసములో ప్రకటిస్తున్నాము.

—సంపాదకుడు

50 సంవత్సరముల మహత్తరమైన చరిత్ర కలిగిన మచిలీబందరు జాతీయ కళాశాల ఎంతోమంది జాతి రత్నాలను సానతీర్చిపెట్టినది. ఈనాడు ఈ రత్నాలు భారతమాత పుత్రి రత్నాలుగా అమూల్యమైన సేవాసితచ్ఛాయలు నలువైపులా వెదజల్లుతూన్నాయి.

1910నుంచి నేటివరకుఅయిదుదశాబ్దములఅమూల్యమైన సేవనందినది. జాతీయ కళాశాల. ప్రతి దశకములోను ఒక ప్రత్యేకమైన అభిరుచిని, అనుభవాన్ని తనలో పండించుకున్నదీ జాతీయ కళాశాల. 1931 నుంచి 35 వరకు అనగా రెండవదశలోనేనీ చరిత్రాత్మక పాఠశాలలో ప్రవేశించిన పూర్వ విద్యార్థిని. జీవితమే ఒక విశాలమైన విద్యాకేంద్రముగా భావిస్తున్న నన్ను యీ కళాశాల ఎలా ఆకర్షించిందో అభూమిక కొద్దిగా వివరించాలనుకుంటున్నాను.

ఇతః పూర్వమే, మన సమక్షంలో శ్రీరాధాకృష్ణ పండితులు చెప్పినట్లుగా, "అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ" అనే ఉపనిషద్వాక్యార్థమే నన్ని స్థలానికి తీసుకరావడానికి కారణభూతమై ఉన్నది- పైవాక్యాలు నేను చదువుతూ ఉండిన- అనంతపురం హైస్కూలు గది గోడలపైన అందముగా వ్రాయబడి వుండేవి. కాని ఆనాడు యీ వాక్యార్థాన్ని అందుకోడానికంత సాహసముండేది కాదు- సెకండు ఫారములో బుద్ధచరిత్ర చదువుకొన్నాను- అనంతరం క్రీస్తుగారథ విన్నాను- ఎలాగైతేనేమి తుదకు మహాభి నిష్క్రమణం సాగించవలసే ఉంటుందని దేశాంతరమైటనైనా వెళ్ళక తప్పదని ఆనాడు నేను నిశ్చయించుకున్నాను-

నీ సంపాదనైతే నేను అనుభవిస్తున్నాను. కాని నా సంపాదన నీవనుభవింపజాలవు. నామీద ఆశపెట్టుకోవద్దని నా తల్లికి నేను ముందే హెచ్చరిక చేశాను. ఒకనాటిరాత్రి అంతరాంతరాళమునుంచి ఉబికివస్తూన్న అగమ్యమైన ఉత్సాహాన్ని ఆపుకోలేక జ్యోతిర్వేషణోత్సాహముతోటిఇంటి నుంచి దేశాటన బయలు దేరాను. అఖండమైన పాదయాత్రతోటి అనంతపురంనుంచి మద్రాసు, మద్రాసు మీదుగా నెల్లూరు, నెల్లూరు నుంచి బందరువచ్చి ఇక్కడ కళాశాలలో చేరుకున్నాను.

నే నాశ్రయించిన మాతృత్రయము

మొదట తల్లిని ఇక నేను వదలుకున్నాను. ఆమె స్థానంలో అడవి బాపిరాజు, కాటూరి వెంకటేశ్వరరావు గారలు మాతృ మూర్తులుగా నా జీవితపు బహుముఖ వికాసానికి ఎంతగానో నన్ను ఆదుకున్నారు. మారిక్సిజము మొదలు వివిధ రాజకీయములు, అర్థశాస్త్రము, ఇతి హాసము, గాంధీవాదము, గ్రామ పునర్నిర్మాణము మొదలయిన పలువిధ విషయాలు ఇక్కడ నాకు అలవింపుకు వచ్చాయి. అప్పటి దేశకాల పరిస్థితులనుబట్టి మా సమక్షంలో మూడు మార్గాలు కనబడుతూండేవి. రవీంద్ర నిలయము, విశ్వభారతి, గాంధీ ఆశ్రమము, సేవాగ్రామము విప్లవ తత్వములోకి కమ్యూనిజము, నా హృదయం గాంధేయము వైపు అభిముఖమై పోసాగింది. 1938 సేవా గ్రామమువెళ్ళి చేరుకున్నాను. గాంధీజీ నా మాతృ తృతీయము. ఈ మూడవ తల్లి శీతలమైన కరుణాభరమృదుల పొత్తిళ్ళలో 1948 వరకు నే నెంతగానో పోషింపబడ్డాను. ఇక్కడే తుదన నేనొక మనిషిగా కూడ తయారు కాగలిగానని చెప్పవలసి ఉంటుంది. హింసాత్మకమైన కాలాలోచకాలతలను అహింసామార్గంలో మలచినవారు పావనమూర్తి మన బాపూజీ.

శిక్షణ విధానము నిర్వహించడమందు బాపూకి మించిన వేత్తలు లేరని విశ్వసించే వారిలో నేనూ ఒకణ్ణి. భౌతికము, ఆధ్యాత్మికములోకి సర్వాంగ సమగ్ర సమ వికాసానికి సమన్వయ పూర్వకమైన సందేశమందించిన ఏకైక వ్యక్తి పూజ్య బాపూజీ.

నాన్ వైలెన్స్ ఈజ్ ది ఎసెన్స్ ఆఫ్ డి సివిల్లిన్ అని గాంధీజీ వ్రాసిన ఒక సూత్ర వాక్యమునా ఓ జిజ్ఞాసను రేకెత్తించినది. ఆంగ్లేయులవంటి ఇతర నాగరిక ప్రపంచ మందలి క్రమబద్ధమైన పద్ధతులతోటి, నిర్ణీతమైన ప్రవర్తనతోటి మెలగుతూన్నట్లు అంటున్నారుగదా వారిలో అహింస అనుకోవలసినంతగా కనబడకపోవడానికి కారణమేమంటే ఉంటుందని బాపూజీని నేను ప్రశ్నించాను. అప్పుడాయన డిసిప్లిన్ అంటే ఏమిటో వివరిస్తూ-సమయానికి లేవడము, పెల్యూటు కొట్టడము, కదను త్రొక్కుటము, కవాయతు చేయడము, శిఫాయి కావడము, తుపాకి పేల్చడము అనే క్రమ శిక్షణకు లక్ష్యాలని చెప్పజాలము. భగవద్గీతలోని తృతీయాధ్యాయము తుదిని చెప్పిన 20 శ్లోకాలు అహింసా లక్షణ లక్షితమైన సలక్షణ మూర్తిని చిత్రిస్తాయని నిజమైన క్రమశిక్షణ యీ మార్గములోనే మనము పొందగలమని బాపూజీ నాకు పాఠము జెప్పారు.

సుప్రసిద్ధ గాంధేయ ఆర్థిక తత్వవేత్త అయిన శ్రీ జె. సి. కుమరప్ప ఆయన సోదరుడు భరతన్ కుమరప్ప గారలు కాకక్కడ సన్నిహిత సంబంధీకులయ్యారు. శ్రీ జె. సి. కుమరప్ప సేవా భాగ్యము, ఆయన సునిశిత మేధా విశేషము తెలుసుకోడానికి నేనొక ఉదాహరణ చెబుతాను.

వినోబాజీ భూదాన పదయాత్రి సందర్భంలో తమిళనాడు కట్టుబట్టి వెళ్ళడం జరిగింది. శ్రీ కుమరప్పగారు అప్పటికక్కడ ఆశ్రమంలోనే ఉంటూన్నారు. ఆశ్రమాన్ని సందర్శించడానికి వినోబాజీతో కూడా వారి మిత్రులమంతా కలిసి వెళ్ళాము. గోడకు తగిలించిన చిత్రాలను వినోబాజీ పరిశీలిస్తున్నారు. ఆ సందర్భములో శ్రీ వినోబాజీ ఒక చిత్రాన్ని వ్రేలితో చూపుతూ "కుమరప్పా ఈ చిత్రమెవరో మీకు తెలుసా అని అంటే కుమరప్ప ఈయన నాయజమాని-అది గాంధీజీ చిత్రపటము"అన్నారు. వినోబాజీ కుమరప్పవైపు వింతగా చూస్తున్నారు. ఇది గాంధీగారిపట్ల కుమరప్పకున్న శ్రద్ధ విశేషమనుకున్నారు. వెంటనే ప్రక్కన మరో చిత్రాన్ని కుమరప్ప వ్రేలితో చూపించారు. ఈయనెవరో మీకు తెలుసా-అది పొలము దున్నుతున్న ఒక రైతు చిత్రము-ఈయన నా యజమానికి యజమాని అని గాంభీరమైన ఛలోక్తి వినురుతూ తన ఆశయాన్నంతటిని ఇందులో కుప్పించిన శ్రీ కుమరప్ప మాటిగా తన శ్రద్ధను చాటారు. మన విద్యా విధానపు చరమ లక్ష్యముకూడ ఇలాంటి ఆశయమే అయి ఉండాలి. అప్పుడు మాత్రమే మన జాతీయ విద్యా కళాలలు కాగలవు.

విజ్ఞానము-ఆత్మ జ్ఞానము

విజ్ఞానం మన చేతిలో ఉన్నదా? విజ్ఞానం చేతిలో మనముండటూన్నామా? అని గట్టిగా మనం ఆలోచించినప్పుడు నేడు విజ్ఞాన ప్రవాహంలో మానవులను అమాంతంగా కొట్టుకొనే పోతున్నాము. ఈ సందర్భంలో ఆత్మ జ్ఞానమొచ్చి ఆదుకున్నగాని తారణలేదు. ప్రకృతి, వికృతి, సంస్కృతి అనే మూడు కత్తులు మన జీవితంలో ఉన్నాయి. సంస్కృతిలోనే మానవత్వమనేది వికసించడానికి అవకాశమున్నది. అయితే యీ సంస్కృతి మానవునియొక్క హృదయ కోశమునుంచే తయారు కావాలి. నేటి మానవుడు విపరీతంగా బుద్ధినే హెచ్చు పెంచుకపోతూన్నాడు. హృదయం నిస్సారమై శూన్యతను అనుభవిస్తున్నాడు అందుచేతనే.

కర్మజఖను ప్రజల అకార్
గరిణి ఉరియాజాకే చారిధార్
హృదయ ప్రాంతే హే జీవనాథ్
శాంత శరణ ఏకూ-

నలువైపులనుంచి కర్మ కాంతమనే కరాళమైన కాలమేఘాలు ఆక్రమించి ఆనందిస్తూన్న సమయంలో హే జీవన్ నాథ్, శాంతి రూపమైన శరణ కమలములతో నాలో ప్రవేశించవలసినదని శ్రీ రవీంద్రుడిచ్చిన గీతికా సందేశమును మనమంతా మనన చేయవలసిన సమయమిది అది నేను భావిస్తున్నారు-

క్రమ వికాసము

మానవవికాసానికిఒక క్రమముంటూ కూడా లేకుండా పోలేదు. వ్యక్తి జీవితాన్నుంచి సంఘ జీవితానికి సంఘ జీవితం నుంచి అధ్యాత్మక జీవితానికి అనుగమిస్తూ మనం ముందుకు పోవాలి గాంధిజీ కూడా మానవుడే అయితే పూర్తిగా వికసించిన మానవుడీయన.

వ్యక్తిముందు తల్లితండ్రుల దగ్గర శిక్షణ పొందుతాడు. అనంతరం సమాజంలో ప్రవేశించి విద్యాబుద్ధులను సంపాదిస్తాడు. యోగ్యుడై వృత్తి ఉద్యోగాన్ని అవలంబిస్తాడు. ఈ సందర్భంలో తాను సంపాదించిన రు. 1000 లలో 750 రూ. లు సంఘానికి అర్పించడానికిని, మిగతా 250 రూ. లు తాను అనుభవించడానికి వ్యక్తి తాను ధర్మగడ్డుడౌతూన్నాడు. ఇలాంటి సత్య దృష్టితోటి ఆర్థిక, సాంఘికాది విలువల్లో మార్పు లేకుండా పోయినట్లయితే మన మాశించిన సోషలిస్టిక్ పేట్రన్ ఆఫ్ సొసైటీ కలలో వార్తగానే మిగిలిపోతుంది.

మొత్తం పేత్ అయితే సూత్రమేమిటి అది వ్యక్తిగతమై ఉన్నంతవరకు దానికంతగా విలువలేదు. మానవుని సాధనా సంపత్తుల సంఘ మధ్యములోనే సిద్ధించాలి. తుదకు అధ్యాత్మమందు అంతర్లీనమై పోవాలి. దీన్నే బుద్ధభగవానుడు యీవిధంగా సూత్రీకరించి ప్రబోధించాడు.

బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి.

ఆంధ్రలో క్రొత్త పరిశ్రమల స్థాపన

ప్రభుత్వం పారిశ్రామికులకు ప్రోత్సాహాన్ని ఇవ్వగలదని ఆర్థిక మంత్రి

మద్రాసు, ఆగస్టు 24

ఆంధ్రప్రదేశ్‌లో క్రొత్తగా పరిశ్రమల స్థాపించే వారికి ప్రభుత్వము అవసరమయిన ప్రోత్సాహాన్ని ఇవ్వగలదని ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రిశ్రీకాసు బ్రహ్మానందరెడ్డి ఇక్కడ తెలిపారు. ఇక్కడ ఆంధ్ర వాణిజ్య మండలి సమావేశం ఆంధ్రప్రదే[illegible] శ్రామికాభి[illegible] ఎట్టిదో తె[illegible]

పెబ్బేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

యేర్పాటు చేయుటకు వనపర్తి సమితి నిర్ణయం

వనపర్తి, ఆగస్టు 24

వనపర్తి సమితి బ్లాకులోని పెబ్బేరు గ్రామములో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని యేర్పాటు చేయుటకు సమితి తీసుకొన్న నిర్ణయము కొనియాడదగియున్నది. కొత్తకోట వనపర్తిరోడ్డు, శ్రీ రంగాపురము గ్రామాలకన్నా పెబ్బేరు గ్రామము పెక్కు గ్రామాలకు అందుబాటులో యుండగలదు. అచట ఇంతవరకు సంస్థానము కాలములో ఒక వైద్యశాల యుండేది. కాని స్వాతంత్ర్యానంతరము దానిని యెత్తివేసి ఆయుర్వేదశాలను నెలకొల్పుట జరిగింది. ప్రస్తుతము అదియే చుట్టుపట్ల 40 గ్రామాలకు శరణ్యం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రము అచట యేర్పాటు చేయుటవల్ల బ్లాకు గ్రామాలకన్నిటికీఅది అందుబాటులో యుండగలదు.

ప్రాథమిక వైద్య కేంద్ర స్థాపనకు అవసరమగు రెండు ఎకరాల భూమి హైదరాబాదు - కర్నూల్ రోడ్డుపై గ్రామానికి పడమటి భాగములో యెన్నుకోబడింది అందుకు ప్రజలు ఇవ్వవలసిన 10వేల విరాళానికికూడ ప్రయత్నాలు జరుగుచున్నవి. విరాళాలు త్వరగా సేకరించినచో ఒక సంవత్సరము లోపుగా వైద్య కేంద్రము యేర్పాటు కాగలదని భావించబడుచున్నది.

రజకుల సమ్మె

వనపర్తి తాలూకా పెబ్బేరుగ్రామ రజకులు ఈమధ్య రెండు రోజులపాటు సమ్మె జరిపారు. రజకులకు ఇవ్వబడు వర్తనధాన్యము చాలా స్వల్పమని, వర్తనను హెచ్చించాలని కోపతూ వారిసమ్మెను జరిపారు. రజకుల కోర్కెలు డిసెంబరు మాసం తర్వాతనే పరిశీలింపబడునని, అంతకు లోగా వారేమి చేసినా లాభముండదని కొందరు గ్రామపెద్దలు నచ్చజెప్పగా సమ్మె విరమించుట జరిగింది.

కంచిరేవుపల్లిలోగీతపారిశ్రామిక సహకార సంఘం యేర్పాటు

వనపర్తి తాలూకా కంచిరేవుపల్లి గ్రామము[illegible] పారిశ్రామి[illegible] యేర్పాటు [illegible] శ్రామికా స[illegible] క్టర్ శ్రీ [illegible]ణలో అధ్యక్షులు [illegible] గౌడు, ఉ[illegible] గౌడు ఎన[illegible]

సెంట్రల్ రైల్వే

టెండర్ నోటీస్

నెం. 42/8/1961/ Cajg/SC/80.

సికింద్రాబాద్‌లో గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్ డైనింగ్‌కార్‌కు 1-10-1961 నుండి 6 మాసముల వరక

టెండర్ నోటీస్

సి. టి. వుడ్ చెక్కబడిన స్లీపర్లు 4"×6"×4' సైజులో 2000 మరియు గైరవుడ్ స్లీపర్లు సైజులో 2000 సప్లయిచేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఈ కర్ర బాగా పెరిగి బొడుపులు, పగుళ్ళు లేకుండా వుండవలెను. పనికిరాని స్లీపర్లన్నీ నిరాకరించబడి వెంటనే తీసివేసి విడిగా ఉంచబడును. మొత్తము 4000 స్లీపర్లు ఆర్డరు పొందిన తేదీనుండి వారమునకు 1000 స్లీపర్లచొప్పున సప్లయిచేయవలెను.

టెండర్ మేనేజింగ్ డైరెక్టరుపేర అడ్రసు వ్రాసి కవరు పైన "స్లీపర్ల కొరకు టెండర్" అని గుర్తించి, మా నిబంధనలు, షరతుల ప్రకారము కోరబడిన డిపాజిట్ పైకం రు. 500/- లతో టెండర్లు 31-8-1961 సా॥ 3-00 గం॥ లోపున అందునట్లు పంపవలెను.

ఫతేమైదాన్ రోడ్. హైద్రాబాద్-అం. ప్ర. } పర్చేజ్ ఆఫీసర్, నిజాం సుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్.

3వ సంయుక్త వారం!

షా ఫిలిమ్స్

కష్టసుఖాలు

తా॥ శివాజీగణేశన్, యస్. వి. రంగారావు, బి. సరోజాదేవి, శాంతకుమారి, యం. యన్. రాజం, టి. ఆర్. రామచంద్రన్, పద్మినిప్రియదర్శిని నటించినది.

చిత్రా- సికింద్రాబాద్

లక్ష్మి- వరంగల్. ప్రభాత్- నిజామాబాద్

ప్రతిరోజు 3 ఆటలు: 2-30, 6-15, 9-30 గం॥

—వాణీ ఫిలిమ్స్ విడుదల.

నేటి రాత్రి నేటి రాత్రి

చేతనా ఫిలిమ్స్:

గుళ్ళో పెళ్ళి (తెలుగు)

తా॥ కృష్ణకుమారి, రమణమూర్తి, సూర్యకళ, బాలిష్, పార్వతి, రమాదేవి, చదలవాడ, మిక్కిలినేని, రమణారెడ్డి.

దర్శకత్వం: కె. ఎస్. ప్రకాశరావు. సంగీతం: రమేష్‌నాయుడు.

కమల్-హైద్రాబాద్. రాజేశ్వర్-సికింద్రాబాద్.

ఆటలు: 3-00, 6-15, 9-30.

—మహేశ్వరి పిక్చర్స్ విడుదల.

పసందైన 19 వ వారం!

ప్రసాద్ ప్రొడక్షన్స్:

ససురాల్

తా: రాజేంద్రకుమార్, సరోజాదేవి, మహమూద్.

రాయల్ హైద్రాబాద్

ఆటలు: 3-00, 6-15 మరియు 9-30.

14 వ వారం! లక్ష్మి నాందేడ్. | 11 వ వారం! సైదియా బోరంగాబాద్. | 5 వ వారం! న్యూమదన్ గుల్బర్గా. | 2 వ వారం! రాజరాజేశ్వరి వరంగల్.

—ప్రకాష్ పిక్చర్స్ విడుదల.

6 వ సంయుక్త వారము

ఎ. వి. ఎమ్స్:

ఛాయ (హిందీ)

ప్రభాత్-హైద్రాబాద్.

ప్యారడైజ్-సికింద్రాబాద్.

నేడు 3 ఆటలు: 2-45. 6-15, 9-30.

(Bahar)

నేడే చూడండి.

ఋణానుబంధం

-: తారాగణం :-

నాగేశ్వరరావు, అంజలీదేవి, రేలంగి.

నూర్ మహల్ అంబర్‌పేట.

ఆటలు: 2-30, 6-00, 9-30 గం॥

శ్రీకాకుళం జిల్లాలో కొత్తబ్లాకుకు ప్రారంభోత్సవం

శ్రీకాకుళం: ఆగస్టు 25

1961 జూలై 4వ తేదీన శ్రీకాకుళంలో జరిగిన అధికార అనధికారుల ప్రత్యేక సమావేశంలో జాతీయ పొదుపు సంస్థ డైరెక్టరుమాట్లాడుతూ చిన్న మొత్తాల పొదుపు పథకానికి విరివిగా విరాళాలు సేకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలోనే రు 59900ల వరకు వసూలయ్యాయి. సోంపేటలో కొత్తగా నిర్మించిన వైశ్య సంఘం ధర్మశాలకు 1961 జూలై 6 వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య ప్రారంభోత్సవం చేశారు. యీ ధర్మశాలలో 22గదులున్నాయి. దీని నిర్మాణ వ్యయం అంచనా రూ. 45000 లు యింకా 24 గదులు నిర్మించే ప్రతిపాదన ఉన్నదని వైశ్య సంఘం కార్యదర్శి తెలిపారు. 16గదులను స్వంతఖర్చుతో నిర్మించడానికి 16 మంది వాగ్దానంచేశారు. ఆమదాలవలస బ్లాక్‌లోని పరిస్సి గ్రామంలో 1961 జూలై 7 వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి ముఖ్యమంత్రి పునాదిరాయివేశారు. ఈ కేంద్రం నిర్మాణానికి పార్లమెంటు సభ్యుడు శ్రీ బి. రాజగోపాల్ రావు రు. 10,000లు విరాళంగాయిచ్చారు. శాసనసభ్యుడు శ్రీ టి. పాపారావు సమావేశానికి అధ్యక్షత వహించారు. సంతకావటి గ్రామంలో పూర్వ విస్తరణబ్లాకుకు 1961 జూలై 7 వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభోత్సవంచేశారు. ఈ జిల్లాలో దీనితోకలుపుకొని 24 బ్లాకులు వున్నవి.

రోడ్లు వంతెనలు

ప్రభుత్వం మంజూరుచేసిన 23 పనులను హైవేసు శాఖ మొదలు పెట్టింది. 1961-62 సంవత్సరానికి ప్రభుత్వం మంజూరు చేసినది. 3,59,000ల మొత్తంలో 1961 జూన్ వరకు రు.2, 77,256,లు ఖర్చుపెట్టారు. మంజూరైన 23 పనులలో ముఖ్యమైన రవాణా దార్ల పై 10 చిన్న వంతెనలునిర్మించే పనులు కూడా చేరి వున్నాయి. చక్కెర ఉత్పత్తి కేంద్రాలకు రోడ్లు వేసే పథకం క్రింద 8 కొత్తరోడ్ల నిర్మాణాన్ని జిల్లాపరిషత్తు చేపట్టింది. 1961-62 సంవత్సరంలో వీటికొరకు రు. 55,250లు మంజూరైనవి. యీ సంవత్సరం మొత్తం రు. 51,454లు వీటికైఖర్చు చేశారు.

సహకారం

1961 ఏప్రిల్ 1వ తేదీ నుండి 31 జూలై వరకు 10 గ్రామాలకు వర్తించే 9 గ్రామ పరపతి సంఘాలను స్థాపించారు. యీ సంఘాల్లో 701 మంది సభ్యులను చేర్చుకున్నారు. స్వల్పాదాయ వర్గాల గృహనిర్మాణ పథకం క్రింద గృహనిర్మాణ సంఘాలకు మొత్తం రు. 11200 లను అప్పుగా యిచ్చారు, చిన్న మొత్తాల పొదుపు పథకం క్రింద రు.3,602 లు వసూలు చేశారు. 1961 జూలై నెలలో సమాచారశాఖ 11 చలనచిత్ర ప్రదర్శనలు నిర్వహించింది. 8650 మంది ప్రదర్శనలకు హాజరయ్యారు.

తలగం జమీన్ ఎస్టేటు

తలగం జమీను ఎస్టేటుకు సంబంధించి. 1968, 1969వ ఫసలీలకు గాను చెల్లించవలసిన రూ. 1624ల డి.ఐ.పి. మొత్తాన్ని శ్రీకాకుళం జిల్లా జడ్జి ఇ.ఎ.టి. వద్ద 1961 మే 30వ తేదీన ప్రభుత్వం తరపున తాను డిపాజిట్ చేసినట్టు సెటిల్మెంట్ డైరెక్టరు ప్రకటిస్తున్నారు.

1960-61 లో సెనగలపంట తుది అంచనా

న్యూఢిల్లీ, ఆగస్టు 25

1959-60లో కన్న 1960-61 లో దేశంలో సెనగల పంట విస్తీర్ణంలో తగ్గినా, దిగుబడి పెరిగిందని తుది అంచనానుబట్టి తెలుస్తోందని కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన అర్థిక, గణాంకశాఖ నిన్న నొక పత్రికా ప్రకటనలో తెలియజేసింది.

ఇందులో యింకా యీ వివరాలున్నాయి:

"1960-61లో దేశంలో23,488,000 ఎకరాల విస్తీర్ణంలోసెనగలపంట వేయబడింది. దిగుబడి 62,07,000 టన్నులు, 1959-60లో సెనగలపంట విస్తీర్ణము 25,972,000 ఎకరాలు. దిగుబడి 5,502,000 టన్నులు. అంటే, సమీక్షా కాలంలో అంతకుముందు సంవత్సరములోకన్న పంట విస్తీర్ణం 7.4 శాతం తగ్గింది. దిగుబడి 12,5శాతం పెరిగింది.

సెనగపంట పండించే అన్నిరాష్ట్రాలలోనూ ముఖ్యంగా రాజస్థాన్ లోనూ యీ పంట విస్తీర్ణం తగ్గింది. ఇందుకు కారణం విత్తునాటుకాలంలో శీతోష్ణ పరిస్థితులు అనుకూలముగా లేకపోవడమే. సమీక్షాకాలంలో, పంట దిగుబడి పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో పెరిగింది.

దేశం మొత్తంమీద, సెనగల పంట ఎకరా దిగుబడి సమీక్షాకాలంలో 592 పౌనులు. నిరుటి దిగుబడి 486 పౌనుల కంటే యిది 21.8 శాతం హెచ్చు.

పార్లమెంటు ప్రశ్నోత్తరాలు:

పారిశ్రామిక కార్మికులకు రేడియో కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగస్టు 25

ఆకాశవాణి ప్రసారముచేసే పారిశ్రామిక కార్మికుల కార్యక్రమము విసేందుకయి పారిశ్రామిక సంస్థలు ఇంతవరకు శ్రోతల జట్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించలేదనీ, అయినప్పటికీ ఇట్టి శ్రోతల జట్లను ఏర్పాటు చేసేందుకుగాను ఆయా సంస్థల యజమానులకు తోడ్పడవలసిందిగా పారిశ్రామిక కార్మికుల కార్యక్రమాలు ప్రసారము చేస్తున్న ఆకాశవాణి కేంద్రాలను ఆదేశించడము జరిగిందనీ, లోక్‌సభలో రేడియో సమాచార శాఖామంత్రి డాక్టరు బి. వి. కేస్కార్ శ్రీ బాలకృష్ణన్ అడిగిన ఒక ప్రశ్నకు లిఖితముగా సమాధానం ఇస్తూ తెలియజేశారు.

బాల పక్షవాతం నివారణకు రష్యన్ టీకా మందు ఫలితాల పరిశీలన

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని నిర్దిష్ట ప్రాంతాలలో బాల పక్షవాతము రాకుండా 1,01,268 మంది బాలలకు రష్యన్ టీకామందు వాడారని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ శ్రీ నంజప్పన్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకముగా సమాధానము చెప్పారు.

టీకాలు వేసిన వెంటనే ఫలితాలు తెలియవనీ, ఇందుకు కొంతకాలము పడుతుందనీ కూడా శ్రీ కర్మార్కర్ అన్నారు.

భారత వైద్య పరిశోధనా సంస్థ తాలూకు బాల పక్షవాత పరిశోధనా కేంద్రము (బొంబాయి) కూనూర్ లోని పాశ్చర్ సంస్థ యీ మందు ఫలితాలను పరిశీలిస్తున్నాయి. వాటి నిఫార్సులింకా అందలేదు.

ఈ టీకామందును భారతదేశంలో రెండు కేంద్రాలలో అంటే బొంబాయిలోని హాఫ్‌కిన్ సంస్థలోనూ, కూనూర్ లోని పాశ్చర్ సంస్థలోనూ తయారు చేయాలని తలపెట్టబడింది.

ధోరియంతో అణుశక్తి ఉత్పత్తి

ధోరియంతో అణుశక్తి తయారు చేయడము మన లక్ష్యము. అయితే దీనిని సాధించడానికి దీర్ఘకాలం పడుతుంది. సహజమైన యురేనియం ఇంధనముగా గల రియాక్టర్లతో పని చేస్తే ప్లుటోనియం ఉపఉత్పత్తిగా లభిస్తుంది. ఇది మొదటి దశ. ఈ ప్లుటోనియంను యురేనియంతోగాని, ప్లుటోనియంతోగాని వుపయోగించి యురేనియం 233 తయారు చేస్తారు. ఇది రెండవ దశ, మూడవ దశ థోరియం-యురేనియం 233 తో పనిచేసే రియాక్టర్లపై ఆధారపడి వుంటుంది. అయితే యీ మూడవదశ చేరడానికి పదేళ్ళు పడుతుంది.

కేంద్ర విదేశ వ్యవహారాల ఉపమంత్రిణి శ్రీమతి లక్ష్మీమీనన్ రాజ్యసభలో ఒక సభ్యుని ప్రశ్నకు ప్రధాన మంత్రి తరపున సమాధానము చెప్పారు.

పి. ఎల్. 480 క్రింద దిగుమతులు

అమెరికా పి. ఎల్. 480 క్రింద 1960 మే 4 న చేసుకున్న ఒప్పందం క్రింద 1961 జూన్ 30 వ తేదీ వరకూ భారతదేశానికి మొత్తము 20.85 మెట్రిక్ టన్నుల గోధుమలు లభించాయి. లభించిన ఇతర వ్యవసాయ సరుకుల వివరాలు: బియ్యము-2.49లక్షల మెట్రిక్ టన్నులు, జొన్నలు-53,000 మెట్రిక్ టన్నులు, మొక్కజొన్నలు 62,757 మెట్రిక్ టన్నులు, ప్రతి 3,27,000 బేళ్ళు, పొగాకు 7,87,634 కిలోగ్రాములు, సోయాచిక్కుడు నూనె 2,494 మెట్రిక్ టన్నులు.

రాజ్యసభలో ఆర్థిక శాఖ ఉపమంత్రిణి శ్రీమతి తారకేశ్వరిసిన్హా శ్రీ రామ్ సహాయ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానములో పై సమాచారము తెలియచేశారు.

కెనెరాబ్యాంకులో రఘునాథమల్ బ్యాంకు విలీనం

హైద్రాబాద్, ఆగస్టు 25

జి. రఘునాథమల్ బ్యాంకు లిమిటెడ్‌ను కెనరాబ్యాంకులో త్వరలో విలీనం చేయుట జరుగుతుందని ఒక పత్రికా ప్రకటన చేయబడింది. గత మూడు మాసాల్లోమూడు బ్యాంకులు కెనెరాబ్యాంకులోవిలీనంచేయబడినవి.

కెనెరాబ్యాంకు 1906లో స్థాపింపబడి 32 కోట్ల డిపాజిట్ కలిగివున్నది. రఘునాథమల్ బ్యాంకును దానితో కలుపకుండాప్రస్తుతం 97 శాఖలుకలిగి యుంది. రఘునాథమల్ బ్యాంకును కలుపుటవల్ల మరో 5 శాఖలు అధికమౌతాయి. ఈ విలీనం తర్వాత ఆంధ్రప్రదేశ్ లో 11 కెనెరాబ్యాంకుశాఖలుంటాయి. ఈ శాఖలు ఆదోని, హైద్రాబాద్ (3). సికింద్రాబాద్ (2), నిజామాబాద్, కొల్లాపూర్, విజయవాడ, వనపర్తి, వరంగల్‌లలో వుంటాయి.

స్వాతంత్ర్యదినోత్సవాలు

సంగారెడ్డిలో

ఆగస్టు 15 వ తేదీ ఉదయము ప్రభాతఫేరీకి పిమ్మట కాంగ్రెసు భవనముపై 7 గంటలకు శ్రీ లక్ష్మారెడ్డి కాంగ్రెసు(జిల్లాకాంగ్రెసుప్రెసిడెంటు) జాతీయ పతాకమును ఎగురవేసిరి. అనంతరము ఉన్నత పాఠశాల యితర పాఠశాలలపైబౌనుమున్సిపలుమరియు స్థానిక యితర సంస్థల భవనములపై ప్రభుత్వ కార్యాలయములపైజాతీయ పతాక మెగురవేయబడెను. పరేడు మైదానమున శ్రీ కలెక్టరు టి యన్ కపూరుగారు జాతీయ పతాక మెగురవేసి 15 సంవత్సరముల నుండి పురోగమిస్తున్న అభివృద్ధిప్రణాళికలనుగూర్చి యుపన్యసించిరి. శ్రీ కృష్ణమాచార్యులు ఎం, ఎల్. ఏ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ డి. రామారెడ్డి సహకార సెంట్రల్ బ్యాంకు ప్రసిడెంటు శ్రీ బి. నారసింహారెడ్డిసెమన్సు జడ్జి, శ్రీ లక్ష్మీపతిరావు అభివృద్ధి కార్యకలాపాలనుగూర్చి పంచాయతి ప్రణాళికలను గూర్చి యుపన్యసించిరి.

సాంస్కృతిక విద్యవైజ్ఞానిక రాజకీయ మొదలగు విషయాలపై ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ పరకు రామసింగుగారి యధ్యక్షతలోఉపన్యాసములు యేర్పాటు చేయబడినవి. ఈ సమావేశమునవిద్యార్థులేగాకఉపాధ్యాయ తదితరప్రముఖులెందరోపాల్గొనిరి.

మధ్యాహ్నము 2 గంటలనుండి పరేడుమైదానములో ఆటల పోటీల ప్రదర్శనములు జరుపబడెను.

రాత్రి ఉన్నత పాఠశాలలో జరుపబడిన సాంస్కృతిక కార్యకలాపాల సందర్భమున కలెక్టర్ సతీమణి ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానము గావించిరి

సంగారెడ్డి వర్తక బజారులో నిర్వహింపబడిన ఖవ్వాలి కార్యక్రమానికి బౌను మున్సిపాల్టీ ప్రసిడెంటు శ్రీ గాదె శంకరయ్య అధ్యక్షతవహించిరి.

కోకపేటలో

రాజేంద్రనగర్ బ్లాక్ పంచాయత్ సమితికి చెందిన కోకపేట పాఠశాల ఆధ్వర్యమున స్వాతంత్ర్యదినోత్సవాన ఉదయము 5 గంటలకు ప్రభాత ఫేరీ జరుపబడినది. గ్రామపంచాయతి ఉపసర్పంచ్ శ్రీ సొంటి రామప్ప త్రివర్ణ పతాకమును ఎగురవేసిరి. శ్రీ సి. యాదగిరి రెడ్డి (ప్రధానోపాధ్యాయులు)స్వాతంత్ర్యానంతరము.విద్యాశాఖ సాధించిన విజయములను గూర్చియు. నిర్బంధ ప్రాథమిక విద్య ఉద్యమము ందు గ్రామాధికార్ల పాత్రను గూర్చియు ఉపన్యసించిరి

గ్రామ పంచాయతినిధి నుండి వీధ మరియు హరిజన విద్యార్థులకు పాఠ్య గ్రంథములు: పంకలు పంచబడినవి.

కప్పర్లలో

ఆదిలాబాద్ సమితి బ్లాక్ కప్పర్ల గ్రామంలో స్వాతంత్ర్యదినోత్సవము సందర్భమున ఉదయము 6 గం॥ లకు ప్రభాతఫేరీ జరుపబడినది. తదనంతరము జె.వి.ఎస్. పాఠశాలభవనముపై ప్రధానోపాధ్యాయులుశ్రీఎం.కిష్టన్నచే పతాక మెగరవేయబడినది. మరియు గ్రామపంచాయతి కార్యాలయముపైన శ్రీ కె. రాజేశ్వర్(సర్ పంచ్) పతాకమునెగురవేశారు. ఈ సందర్భములో పబ్లిక్ మీటింగ్ శ్రీ కె రాములు అధ్యక్షతన జరుపబడినది స్థానికపంచాయతి తరపునుంచిపాఠశాల బాలబాలికలచేమరియుయువకులచేఆటలపోటీలు జరుపబడినవి. రాత్రి 8 గం॥ నుండి 11 గం॥ ల వరకు వినోద కార్యక్రమములు నిర్వహింపబడినవి.

ములకనూరులో

ఈనెల15న పదునాల్గవ స్వాతంత్ర్యదినోత్సవములు ములకనూను గ్రామమునందు వేడుకగా జరుపబడినవి ఉదయము 8-00 గంటలకు స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులచే పతాకారోహణము కావించబడినది. అచ్చటికి విచ్చేసిన పురప్రముఖులు, బ్లాక్ సిబ్బంది మరియు ఇతరప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరునుకలిసి గ్రామవీధులలో ఊరేగింపు జరిపిరి. ఆసందర్భమునే గొర్రెల అభివృద్ధి కేంద్రము, సోషల్ క్లబ్, రూరల్ బ్యాంకు, మహిళా సంఘము, పంచాయత్ కమిటీ, బ్లాక్ ఆఫీసు, యువజనక్లబ్ మున్నగువాని కార్యాలయములపద్ద జరిగిన జాతీయ పతాకారోహణోత్సవములందుపాల్గొనుట జరిగినది. తరువాత పాఠశాల విద్యార్థులకు. ఇతర బాల బాలికలకు బ్లాక్ మరియు పంచాయత్ కమిటీ లచే మిఠాయి పంచబడినది మధ్యాహ్నము ఆటలపోటీలు నిర్వహింపబడినవి. రాత్రి 8 గంటలకు బహిరంగ సభ శ్రీరాయపరెడ్డి (బి.డి.ఓ.) అధ్యక్షతన జరిగినది దానిలో శ్రీ టి. వెంకటయ్య, శ్రీరాజశేఖర శర్మ 15 వ ఆగస్టు ప్రాముఖ్యమును విపులీకరిస్తూ మాట్లాడిరి. ఎ. వెంకటనర్సమ్మ వివిధ పోటీలలో నెగ్గినవారికి బహుమతి ప్రదానం చేశారు ఈసందర్భంలో పాటల పోటీలు,కోలాటములు,విచిత్ర వేషధారణ మున్నగు వినోదకార్యక్రమములును, ఏకాంకికలు కూడా ప్రదర్శింపబడినవి. బ్లాక్ ఆధ్వర్యాన ఫిలిం షో ఏర్పాటు చేయబడినది. ప్రధానోపాధ్యాయుల వందనములతో కార్యక్రమాలు ముగిసినవి.

మెసర్స్ కల్వ సూర్యనారాయణ

ఉస్మాన్‌గంజు కమిషన్ ఏజంటు

ఫోన్ నెం. 4412

హైద్రాబాద్, ఆగస్టు 25

(క్వింటల్ ధరలు)

క్వింటల్ అంటే 100 కిలో గ్రాములు	
పాలకుర్కులు బియ్యం	56-55 61-00
గుజ్జులు ,,	61-00 69-00
నెం 19 నెంబర్లు	56-00 58-00
దొడ్డు బియ్యం	56-00 57-00
గర్కులు	61-00 69-00
నానకరాంలు	61-00 69-00
బంగారుతీగెలు	63-00 65-50
గొట్టెబియ్యం	52-00 54-00
24 నెంబర్లు	64-00 66-00
ఎస్.కె.కె. బియ్యం	64-00 65-00
కొత్తసాంబర్లు	65-00 72-00
పాతసాంబర్లు	68-00 73-00
కుసుమబియ్యం	61-00 73-00
పచ్చజొన్నలు	82-87 88-87
చట్టిజొన్నలు	83-00 84-87
తెల్లజొన్నలు	84-75 87-00
పసుపు	116-00 120-00
కందులు పెద్దవి	43-00 44-00
కందులు చిన్నవి	85-00 86-00
మినుములు	47-00 51-00
సెనగలు	44-50 47-00
పెసలు	86-00 88-10
పులవలు	84-00 85-00
బెల్లం	28-00 38-50
మిరపకాయలు	85-00 125-00
చింతపండు	70-00 85-00
పుల్లిగడ్డ	80-00 85-25
యెల్లిగడ్డ	75-00 85-00
తెల్ల నువ్వులు	110-00 120-00
ఆముదాలు	62-00 64-00
ధనియాలు	70-00 75-00
కుసుమలు	49-00 50-00
యిలాతిపల్కు-పెద్దది	118-00 120-00
యిలాతికాయ సం॥18	84-00 88-00
బన్సి గోధుమలు	50-00 58-00
శర్బతి గోధుమలు	48-00 54-00
పత్తిగింజలు	84-00 87-00
కందిపప్పు పెద్దది	57-00 60-00
కందిపప్పు చిన్నది	51-00 54-00
సెనగపప్పు	53-00 55-00
మినుపపప్పు	70-00 79-00
పెసరపప్పు	56-00 57-00
పల్కునూనె 10 కిలో	21-37 21-50
కల్నిపిండి	43-00 24-12
అనుములు	41-00 47-00

ఈప్రకారము యీరోజు అయిన రలువార్తాయించినాము. గిట్టినసరకులు పంపవచ్చును తెప్పించుకోవచ్చును.

వెండి బంగారు ధరలు

సముద్రాల రాఘవులుగారి చాదర్ఘాట్ సిద్ధంబర్ బజారు

ఫోన్ నెం. 4890.

హైద్రాబాదు, ఆగస్టు 26

బంగారము	148-75
ఆర్నోక్ చీపులు	144-00
నవరన్	94-00
వెండి 100 తు.	236-00
చిల్లర .	2-41

రాంపూర్‌లో

గ్రామ ప్రజలు విద్యార్థులు ఉదయం ప్రభాతఫేరీజరిపి ఆతర్వాత 8గంటలకు జండా వందనోత్సవములో పాల్గొన్నారు. పతాకారోహణము తర్వాత బాలురకు తీపి పదార్థములు పంచిపెట్టబడినవి.

10 నుండి 5 గంటల వరకు బాల బాలికల ఆటల పోటీలు, సాయంత్రం బహిరంగసభ నిర్వహింపబడినవి.

జిన్నారం

జిన్నవర గ్రామ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు ఉదయము ప్రభాతఫేరీ జరిపిరి. మండల్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బి రారాయణ ఉదయం జండా నెగురవేసిరి. మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ బి.వెంకులు, బి. చంద్రయ్య తదితర విద్యార్థులు సూత్రయజ్ఞము నిర్వహించారు. విద్యాకమిటి అధ్యక్షులు ఏ. రాంకృష్ణారెడ్డి యిక్కడి పాఠశాలలో 7వ వరగతికి ప్రారంభోత్సవము చేశారు.

లోకల్ సర్వీసుల ఉపసంహరణ

1961 అక్టోబర్ 1 నుండి 1962 మార్చి 31 తేదీకి దిగువ నుదాహరించిన సర్వీసులకు అనుమతి పొందిన కంట్రాక్టర్లనుండి భారతాధ్యక్షుని తరపున కమాండింగ్ ఆఫీసర్, ఏర్‌ఫోర్స్ స్టేషన్, హైద్రాబాద్‌చే సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

(1) ఫ్లయిట్ క్యాడెట్స్ మెయింటెనింగ్ సర్వీసెస్.

(2) ఫ్లయిట్ క్యాడెట్స్ మెస్ మేకింగ్ సర్వీసెస్.

షెడ్యూలువెంట టెండర్ ఫారములను యీ స్టేషన్ సీనియర్ ఎక్విప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయమునుండి ఉదయం 9-00 నుండి 11-00 గం. మధ్యన పనిరోజులలో ఉచితముగా పొందవచ్చును.

టెండర్‌దారు ప్రతి టెండర్ వెంట విడిగా కోరబడిన డిపాజిట్ పైకం రు. 100/- నగదులో స్టేషన్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌కు చెల్లించవలెను. ఏ విధమైన పైకము సి. డి. ఎ. (ఎఫ్) లేక సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వద్ద నిలిచియుండే యెడల అట్టిదానిని డిపాజిట్ పైకము క్రింద ఎంచబడదు. డబ్బు చెల్లించిన రసీదు జతపరుచని టెండర్లు పరిశీలించబడవు.

పూర్తిచేసిన టెండర్ ఫారములు, డిపాజిట్ పైకం చెల్లించిన రసీదు ఇన్‌కంటాక్స్ ఆఫీస్ అధికారిచే సంతకము చేయబడిన ఇన్‌కంటాక్స్ క్లియరన్స్ సర్టిఫికెట్‌ను టెండర్‌కు జతపరచి అట్టి దానిని సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు 15-9-1961 ఉదయం 10-00 గం. వరకు అందజేయవలెను.

టెండర్లు 15-9-1961 ఉదయం 10-00 గం. హాజరయిన టెండరుదార్ల సమక్షమున తెరచి వాటిలో పేర్కొనబడిన రేట్లు చదివి వినిపించబడును.

మృత్యువునెదిరించిన మూడేళ్ళ పిల్ల

న్యూయార్క్, ఆగస్టు 25

ఉటాలోని సాల్టులేక్ నగరంద్గర ఒక గూడ్సురైలుబండి ఒక కుని తిరిగే టప్పుడు వేగంగావస్తున్న బండికెదురుగా నిలుచున్న సూజీకే అనేమూడేళ్ళపిల్ల అన్నిపెట్టెలు తనమీదుగా వెళ్ళినపిదప సురక్షితంగా బ్రతికిబయటపడ్డది. రైలుపట్టాలమధ్య పడుకొని రైలువెళ్ళేంతవరకూ కదలకుండా ఉండితననురక్షించుకొన్నది. డ్రైవర్ ఆశ్చర్యచకితుడయ్యాడు. (నెఫెన్)

రేపాలలో

నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకా రేపాల గ్రామంలో స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంలో స్థానిక "గ్రామవెలుగు"సమాజంవారు విద్యార్థులు, యువకులకు ఆటలు, రచనలు, ఉపన్యాసాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి రేపాల పంచాయతీ బోర్డు అధ్యక్షులు శ్రీ సుంకరలక్ష్మీనర్సయ్య బహుమతులు పంచిపెట్టారు.

మాధ్యమిక పాఠశాలవద్ద శ్రీయల కారంగారెడ్డి. ప్రాథమిక పాఠశాల వద్ద శ్రీ యలకాలహ్మారెడ్డి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

శ్రీ వ్యాసం చెన్నకృష్ణదాసుహరికథ చెప్పారు. శ్రీయుతులు తేరాల సూర్యనారాయణశర్మ, వేములనరసింహం సంగీతం నిర్వహించారు.

సెంట్రల్ రైల్వే

ప్రకటన

ఇండియన్ రైల్వేల చట్టము యొక్క 55 మరియు 56 సెక్షన్‌ల ప్రకారం హైద్రాబాద్ గుడ్స్ షెడ్‌లో వున్నట్టి అన్‌డెలివర్డ్ గుడ్స్‌మరియు చెడిపోయి తీసివేయబడిన ఆహారధాన్యములును భారతాధ్యక్షుని తరపున 10-9-61 ఆదివారం ఉదయం 10-00 గం. కు బహిరంగ వేలములో అమ్మబడును. వేలమునకు వుంచబడిన వస్తువులు సరైనవని చెప్పుటకు రైల్వేపాలకవర్గము వారుబాధ్యత వహించరు మరియు వేలమునకుగల వస్తువుల ఆవివేయుటకు హక్కుగలిగి యున్నారు. వేలమునకుగల వస్తువులను హైద్రాబాద్ గుడ్స్ కార్యాలయములో వేలమునకు రెండురోజులు ముందుగా ఆఫీసు వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

చెడిపోయిన ధాన్యముమరియు విత్తనములు పశువులకు కోళ్ళకు మాత్రమే ఆహారముగా పనికి వచ్చును. ఈ ప్రత్యేకమైన షరతు పైనే అమ్మకము జరుపబడును. కొనేవారు యీ ధాన్యమును పైన పేర్కొనబడిన ప్రకారము వుపయోగించెదమని వ్రాత పూర్వకముగా యివ్వవలసి యుండును.

అలహాబాద్ బ్యాంక్ లిమిటెడ్.,

స్థాపితం: 1865.

ఛార్టర్డ్ బ్యాంక్‌కు అనుబంధించబడినది.

రిజిస్టర్డ్ ఆఫీసు: కలకత్తా.

14, ఇండియా ఎక్స్ఛేంజిప్లేస్.

బ్యాంకు యొక్క బ్రాంచీ కార్యాలయము బ్యారెల్లీ, షియాంగంజ్ నందు 14-8-61 రోజున ప్రారంభించబడినది.

ఎం. జె. మాక్‌లారెన్,

జనరల్ మేనేజర్.

(Saba)

6వ సంయుక్త వారం!

విజయా వారి:

జగదేక వీరుని కథ

సాగర్-హైద్రాబాద్.

2-00, 6-00, 9-30 గం॥

అలంకార్-సికింద్రాబాద్.

2-30, 6-15, 9-30 గం॥

రామా వరంగల్. | మోహన్ నిజామాబాద్.

—విజయ విడుదల.

4 వ సంయుక్త వారం!

ప్రతిచోట, ప్రతి నన్నిచేళము మిమ్ముల తన్మయుల జేయును.

మిత్రా ప్రొడక్షన్సు:

బసంత్

తా: నూతన్, పద్మిని కపూర్, మినోమంతాజ్, ప్రాణ్, కామెడి, మురాద్, కక్కు, జానీవాకర్.

నిర్మాత, దర్శకుడు: బి. మిత్ర. సంగీతం: ఓ. పి. నయ్యర్.

అశోక్ హైద్రాబాద్. మనోహర్ సికింద్రాబాద్.

ఆటలు: 3-00, 6-15 మరియు 9-30.

—మహేశ్వరి పిక్చర్స్ విడుదల.

నగర వార్తలు

డెమోక్రటిక్ లాయర్స్ అసోసియేషన్ హైద్రాబాదు శాఖ

ప్రజాస్వామ్యన్యాయవాదులసంఘమునకు చెందిన హైద్రాబాదుశాఖ సభ్యుల సమావేశము యీనెల 19 న శాఖ ఉపాధ్యక్షులు శ్రీ డి. ఎం. దేశముఖ్ గృహంలో జరిగింది. దీనిలో శ్రీ మనోహర్ రాజు సాక్షేనా కేంద్ర సంఘ కార్యవర్గంచేసిన నిర్ణయాలకు సంబంధించిన నివేదికను అందజేశారు.

"యువజన క్లబ్బు ఎన్నికలు"

కానుకుంట, ఆగస్టు 25

కానుకుంట (తాం॥ నర్సాపురము జి॥ మెదకు)లో స్వతంత్రదినోత్సవము నాడు శ్రీ ఇ. విఠల్ రెడ్డి సర్పంచు గారి అధ్యక్షతలో యువజనక్లబ్బు యెన్నికలు జరిగినవి. ఏకగ్రీవముగా ఈ క్రింది కార్యవర్గము యెన్నికైనది. శ్రీ ఎల్. వెంకటేశ్వరరావు (అధ్యక్షులు), శ్రీ ఇ. నారాయణరెడ్డి (ఉపాధ్యక్షులు), శ్రీ చిదంబర్ గుప్త (కార్యదర్శి), శ్రీ కె. నాగమల్లప్ప (కోశాధిపతి). వీరి అధ్వర్యములో శ్రీ సరస్వతీ గ్రంథాలయము, భజన మండలి అభివృద్ధి పరచుటకు చక్కని కార్యక్రమంతోబాటు ప్రతిజ్ఞగైకొనినారు.

న్యూయార్కు పత్తి

న్యూయార్కు, ఆగస్టు25

ప్రారంభం	34-48
ముగింపు	34-48

రాకపోకలు

లఘు పరిశ్రమలు ఆబ్కారీ మద్య నిషేధ శాఖల మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 1961 ఆగస్టు 31 వ తేదీన ఉదయం 8.30 గంటలకు నల్గొండ జిల్లా వలిగొండ వెళ్తారు. తరువాత వేపర్తి మొదలైన గ్రామాలు పర్యటించి, అదే రోజు సాయంత్రము 6 గంటలకు తిరిగి హైద్రాబాదు వస్తారు.

నాగార్జున కళాశాల విద్యార్థి సంఘ కార్యవర్గం

(మా. వి.)

నల్లగొండ, ఆగస్టు 25

ఈమధ్య నాగార్జున ప్రభుత్వ కళాశాలలో విద్యార్థి సంఘ ఎన్నికలు జరిగినవి. ఈ క్రింది అభ్యర్థులు సంఘ నిర్వాహక వర్గముగా ఎన్నికయినట్లు ప్రకటించబడినది.

అధ్యక్షుడుగా సి. మల్లారెడ్డి బి.ఏ. (2 వ సం॥), ఉపాధ్యక్షుడుగా పహిదు షాన్ బి. ఎస్సి. (2 వ సం॥), కార్యదర్శిగా పి. మాధవ రెడ్డి బి. ఎ. (2 వ సం॥), ఉప కార్యదర్శిగా గోపాల్ కిషన్ పి. యు. సి., సైన్సు అసోసియేషన్ కార్యదర్శిగా యం. పుల్లారెడ్డి బి. యస్ సి. (ఫైనల్), ఆర్ట్సు అసోసియేషన్ కార్యదర్శిగా శ్రీనివాసులు బి. ఎ. (2 వ సం॥), కామర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా యస్. రాములు బి. కామ్ (2 వ సం॥), లలితకళాసమితి కార్యదర్శిగా కృష్ణమాచారి, లాంగ్ వేజ్ అసోసియేషన్ సెక్రటరీగా యం. పాండురంగారెడ్డి బి. ఎ (ఫైనల్) యెన్నికయ్యారు. మరియు క్రీడాసంఘ జనరల్ క్యాప్టనుగా యం. రుక్మారెడ్డి (పి. యు. సి) యెన్నికయ్యారు.

నేటి రాత్రి నేటి రాత్రి

పత్రికలు మరియు ప్రేక్షకులచే ఏకగ్రీవముగా పొగడబడుచున్నది.

యస్. డి. నారంగ్స్ :

మోడర్న్ గర్ల్

తా॥ ప్రదీప్‌కుమార్, సయీదాఖాన్, స్మృతిబిశ్వాస్, నళినీఛోంకర్, మదన్‌పురి, హెలెన్, జానీవాకర్.

సంగీతం : రవి,

బసంత్ & అజంతా

హైద్రాబాద్ — సికింద్రాబాద్

నేడు, రేపు 4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30.

ప్రతిరోజు 3 ఆటలు: 3-30, 6-30 మరియు 9-30.

బసంత్ లో సోమవారము నుండి 3 ఆటలు: 3-30, 6-30, 9-30.

హనుమాన్ రాయ్‌చూర్ — మెజిస్టిక్ జాల్నా — ఫిరోజ్ వర్ధని

మీ సిట్లను అడ్వాన్సుగా రిజర్వు చేసుకొనండి.

— మూవీస్ ప్రయివేట్ లిమిటెడ్ విడుదల.

లేఖావళి

వనపర్తి సివిల్ హాస్పిటల్ దుస్థితి

అయ్యా!

వనపర్తి సివిల్ వైద్యశాల పరిస్థితి నానాటికి దిగజారిపోవుచున్నది. ఇందు లేడీ డాక్టరు లేక ప్రజలకు చాల యిబ్బంది కలుగుచున్నదని, ప్రభుత్వము వెంటనే తగు చర్య తీసికోవాలని గోలకొండ విలేఖరి కోరియుండెను. కాని లేడీ డాక్టరు విషయమటుంచి అసలు వైద్యశాల పరిస్థితి యీమధ్య పూర్తిగా దిగజారిపోయింది. స్థానికములో యున్న ఒక ప్రయివేటు డాక్టరు విరామము లేకుండా పని చేయుచున్నాడు. రోజూ రోగపీడితులు నూర్లకొలది ఆయనచే చికిత్స పొందుచున్నారు. కాని ప్రభుత్వ వైద్యశాలకు యెవరూ వెళ్ళడము లేదు. ఔన్ వెలువల ఒక మిషన్ వైద్యశాల కూడా యుంది. ప్రయివేటు డాక్టరుకు డబ్బిచ్చుకోలేని వారు అచటికివెళ్ళి చికిత్స పొందుచున్నారు. కాని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లుటేలేదు. ఇందుకు కారణమేమిటో జిల్లావైద్యాధికారులు గమనించి ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు తగు సౌకర్యాలను కల్పించాల్సియుంది. పేరుకు వనపర్తిలో సివిల్ వైద్యాలయాన్ని నిర్వహిస్తూ వేలకొలది రూపాయలను తగలవేయుటకన్నా దానిని యెత్తివేసిన బాగుండునని పిస్తుంది. అసలు ప్రభుత్వ వైద్యాలయాల్లో యుండే డాక్టర్లు డబ్బుకు కక్కుర్తపడి రోగులయెడల క్రమంగా ప్రవర్తించనందున ఆ డబ్బును ప్రయివేటు వైద్యులకే యిచ్చి యెందుకు చికిత్స పొందకూడదనే అభిప్రాయము ప్రజల్లో కలుగుచున్నది. సుమారు 200 గ్రామాలు గల తాలూకా అంతటికీయున్న యీ ఒకే ఒక వైద్యశాలకు కూడ ప్రజలు వెళ్ళుట లేదంటే యేదో ప్రబల కారణమే యుండాలి. అధికారులు విషయాలను తెలిసికొని త్వరలో తగు సౌకర్యాలు కలిగిస్తారని ఆశిస్తున్నాము.

వనపర్తి 24-8-61 — ఇట్లు ఒక పౌరుడు

గద్వాలఆర్టు,సైన్సు కళాశాల సాంస్కృతిక కార్యక్రమాలు

గద్వాల, ఆగస్టు 25

ఈనెల 22 వ తేదీన ఇక్కడ కళాశాలా విద్యార్థి సారస్వత సంఘ ఆధ్వర్యమున కళాశాలావరణలో శ్రీరాజరాజ నరేంద్రపట్టాభిషేక వార్షికోత్సవము సందర్భమున "ఆంధ్ర భారతావతరణము" అను నాటిక విద్యార్థులచే ప్రదర్శింపబడింది.

సంఘ కార్యదర్శి శ్రీశ్రీనివాసరావు సమావేశ ఉద్దేశమును వివరించి కాలేజి ప్రిన్సిపాలు గారైన శ్రీ ఐ. సూర్యనారాయణగారిని అధ్యక్షత వహింపవలసినదిగా కోరినారు. దైవ ప్రార్థనానంతరం శ్రీప్రిన్సిపాలుగారు ఆంధ్రి భాషా వైశిష్ట్యమును గూర్చి దానిని పూర్వమునుండి మహారాజులు ఎట్లు పోషిస్తూవచ్చిరో సమీక్షించారు. అనంతరం కాలేజి ఆంధ్రోపన్యాసకులు శ్రీసూర్యనారాయణమూర్తి ఎం. ఏ. గారు నన్నయభట్టారకుని ఆదికవి శబ్దశాసన బిరుదుల సార్థక్యాన్ని గురించి ఉపన్యసించారు. ఆంగ్లభాషోపన్యాసకులు శ్రీచక్రధరరావుగారు నన్నయ కవిత్వంలోని సొగసులను సోదాహరణముగా వివరించారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్రధాన ఆంధ్రోపాధ్యాయులు శ్రీలక్ష్మణాచార్య రాజరాజు ఆంధ్రాభ్యుదయానికి ఎట్లు తోడ్పడినది తెలుపుచు, నన్నయ రచనలోని రసవద్ఘట్టాలను క్లుప్తంగా సమీక్షించారు. పి. యు. సి. విద్యార్థి చెన్నకేశవ రెడ్డి మాట్లాడుటతో ఉపన్యాసాలు ముగిసినవి.

తరువాత విద్యార్థులు నారాయణ రెడ్డి (పి. యు. సి.) రాజరాజుగా, అడివి రావు (బి.ఎస్.సి.) మహామంత్రిగా, వేంకటేశ్వర శర్మ (పి. యు. సి.) నన్నయభట్టుగా, లక్ష్మన్న (పి. యు. సి.) నారాయణ భట్టుగా పాత్రలు ధరించి మహా భారతావతరణము అను నాటికను మనోహరముగా ప్రదర్శించారు. కార్యదర్శి వందన సమర్పణముతో కార్యక్రమము ముగిసినది.

గద్వాల కళాశాల విద్యా సంఘ కార్యవర్గం

గద్వాల ఆర్టు, సైన్సుకళాశాలలో యీనెల 16న జరిగిన కళాశాలవిద్యా (నలహా) సంఘ సాధారణ సభ్యసమావేశంలో సంఘ కార్యవర్గానికి ఈక్రింది సభ్యులు యెన్నికైనారు. ఈఎన్నికలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వి. సూర్యనారాయణ నిర్వహించారు.

అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్రీయుతులు రాజా కృష్ణ రాంభూపాల్, రాజా సోమ భూపాల్, కార్యదర్శి, కోశాధికారులు, శ్రీయుతులు డి. కె. సత్యారెడ్డి ఎం.ఎల్.ఏ. జి. నరసింహయ్య, సభ్యులు శ్రీయుతులు డా॥ పి ఆర్. రాయ్, పి. సుబ్బారెడ్డి, ఎం. నరసింగరావు.

తెలుగుసాహిత్యంలో బాలవాఙ్మయం

అభివృద్ధి చెందాలని ఆంధ్ర సాహిత్య పరిషత్ సన్మాన సభలో డా॥ సీతాపతి సూచన

కలకత్తా, ఆగస్టు 25

"కాలంతోపాటు ప్రకృతిలో మార్పు ఎంత స్వతఃసిద్ధమో భాషా సాహిత్యాలలో గూడా మార్పు అంత సహజమే. పాతనే ప్రామాణికంగా తీసుకొని అభ్యుదయాన్ని నిరోధించడము పొరపాటు" అని డా. గిడుగు సీతాపతి అన్నారు.

బాలవాఙ్మయాన్ని గురించి ప్రసావిస్తూ, ఈ శాఖ భారతీయ సాహిత్యాలలో విశేషించి తెలుగు సాహిత్యంలో చాలావెనుకబడి వుందనీ, దీనిని అభివృద్ధి పరచడానికి విశేషమయిన కృషి జరగాలని వివరిస్తూ, తాము 'భారతి'కి సంపాదకులుగా పనిచేసినప్పుడూ, తదనంతరం జరిగిన కృషిని ఆయనవివరించారు.

ఈ నెల 17 వ తేదీ సాయంత్రం యిక్కడి కిడ్డర్‌పూరు ఆంధ్రాస్కూలులో ప్రముఖ రచయితలు భాషాతత్త్వవేత్తలు, నటులయిన డాక్టరు గిడుగు వెంకటసీతాపతిని కలకత్తా ఆంధ్ర సాహిత్యపరిషత్తు సన్మానించి మంచిగంధపు పేటికను బహూకరించింది. సన్మానసభకునగరంనలుమూలల నుండి అనేకమంది విచ్చేశారు. పరిషద్ధ్యక్షులు శ్రీ ఎన్. ఎ. యాజులు అధ్యక్షత వహించారు.

పరిషత్తు సంయుక్తకార్యదర్శి శ్రీ రావినూతల సత్యనారాయణ డాక్టరు సీతాపతిని పరిచయంచేస్తూ తెలుగుసాహిత్యంలో ఆధునిక మార్గాలను తీసుకరావడంలో విప్లవాన్ని నడిపికంద్రినిమించినకొండుకునిపించుకున్నారన్నారు, భాషాతత్త్వశాస్త్రజ్ఞుల్లో భారత దేశంలోనేకాక, ప్రపంచంలో మొదటి శ్రేణికి చెందిన కొద్దిమందిలో డాక్టరు సీతాపతి ఒకరన్నారు. తెలుగు బాలవాఙ్మయం ఈనాడు ఇంతగావృద్ధి చెందడానికి డా॥ సీతాపతి మార్గాన్ని చూపించారన్నారు. సవరభాషాలిపిని సంస్కరించడమేగాక, ఆ భాషకొక నిఘంటువును, వ్యాకరణాన్నిరచించి, వాషింగ్‌టన్ ఇంటర్నేషనల్ అకాడమీ వంటి సంస్థచేత గౌరవింపబడడం యావదాంధ్ర జాతికే గర్వకారణమన్నారు. ఆంధ్రుల చరిత్ర, రాజనీతివంటి అంశాలపయి ప్రత్యేక కృషి సల్పి తెలుగు విజ్ఞాన సర్వస్వాన్ని రచించడంలో డా॥ సీతాపతి ప్రదర్శించిన ఉద్ధతకు కొలమానం లేదన్నారు.

శ్రీ పి. లక్ష్మణరావు సన్మాన పత్రాన్ని సమర్పించారు.

తదుపరి డా॥ సీతాపతి ప్రసంగిస్తూ, తమ ఎనభయి ఏళ్ళ జీవితములోని విశిష్టమయిన ఘట్టాలను, జ్ఞాపకాలను వివరించారు. ఈ నాడు ప్రపంచంలో పలుతావుల్లో రవీంద్రుని శతజయంత్యుత్సవాలు జరుగుతున్నాయి. రవీంద్రుడు మహాకవి. అతని రచనల్లో ఆ విశిష్టతవున్నది. అందుకనే విశ్వకవి అయ్యాడు.

రవీంద్రునికవిత్వంలోగొప్పతనాన్ని ప్రపంచం గుర్తించక ముందే మహాకవి గురజాడ ఈ శతాబ్దపు తొలిదశలోనే గుర్తించారు. అంతటి విశిష్టత గురజాడ కవిత్వంలోనూ వుంది. ఆయన దేశభక్తి గీతం ఒక్కటి చాలు ఆయన విశిష్టతను, భావనావటిమనూ ప్రమాణంగా తీసుకోవడానికి అన్నారు.

గ్రాంథిక వ్యావహారిక భాషావాదుల మధ్య జరిగిన వివాదాలను దృష్టాంతాలతోసహా వివరిస్తూ, వ్యావహారిక భాష భాషగా పరిగణింపబడడానికి రెండు దశాబ్దాలకు పైగా పోరాడవలసి వచ్చిందన్నారు. కాలంతోపాటు ప్రకృతిలో మార్పు ఎంతస్వతఃసిద్ధమో మానవుని నిత్యవ్యవహారాలలోకూడా అంతే. అలానే భాషా సాహిత్యాలు కూడా. ఈ వైచిత్ర్యానికి దూరంగా వుండగలగడం అసంభవం. ఈమార్పు భాషా సాహిత్యాలలో రెండు విధాలుగా జరుగుతుంది. అంతర్గతశక్తిసంపదలను వృద్ధిపరచుకొంటూ, బహిర్గతంగా వ్యాప్తిచెందుతుంది. అయితే ఈ అభివృద్ధి ఆయా సాహితీ వేత్తలలోనూ, సాహిత్యాలలోనూ విశాలభావాలు కలిగినప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది. సాధారణముగా పాశ్చాత్య సాహిత్య వేత్తలలో క్రొత్తదనాన్ని తెలుసుకోవాలనీ, కొత్తపదాలనుసృష్టించాలనీ ఉత్సుకతవుంటుంది. ఆ పదాలు ఏ దేశానికి సంబంధించినా, ఏ భాషకు సంబంధించినా, తమవిగా మల్చుకునే విశాలదృక్పథంవారికుంది. ఈరకమయిన భావన కలిగినప్పుడే భాషాసాహిత్యాల అభివృద్ధి నిరాటంకంగా జరుగుతుంది. మనంచాలా పదాలను మన నిత్యవ్యవహారాలలో వాడుకుంటున్నాం. ఆయా పదాలు సజాతీయం కావనే సాకుతో గ్రంథస్థమ చేయడానికి నిరాకరించడం అర్థంలేని మాట. ఇదేగాంధికవాదులకీ, వ్యావహారిక భాషావాదులకీ చిక్కు విడనిముడిగా తయారయింది. కాని రానురాను గ్రాంథికవాదులు నూతన చైతన్యానికి, నవ్యుల శక్తి సామర్థ్యాలకు తల ఒగ్గక తప్పలేదు. "తెలుగు సాహిత్యంలో విప్లవం 1930 నాటికి మరింత ఉద్ధృతరూపం దాల్చింది. అందుకు రాజకీయ చైతన్యం మరికొంత దోహదం కల్పించింది. ఈ రెండు విప్లవాలు ఒకదాని సరసన మరొకటి పయనించినప్పుడు మన భాషా సాహిత్యాల స్వరూపమే మారిపోయింది" అన్నారు. రాజకీయ నాయకులు "డౌన్ విత్ ది బ్రిటిష్ ఇంపీరియలిజం" అంటే గరిమెళ్ళ వంటి కవులు "మా కొద్దీ బెల్లదొరతనం" అంటూ విప్లవ శంఖాలను పూరించారన్నారు. "సాహిత్యం సజీవముగామనగలగాలంటే భాషఒక్కటే ప్రధానం కాదు. భావం ముఖ్యాంశం కావాలి. భావంలేని భాష ఉప్పులేని వంటకం లాంటిది అన్నారు. సంగీతం కేవలం శ్రవణానందాన్ని మాత్రమే చేకూర్చుతుంది. కాని సాహిత్యం ఆత్మానందాన్నివ్వడమేగాక, అది హృదయాలపై ముద్ర వేసుకుంటుంద"న్నారు.

రచనా విధానాన్ని గురించి ముచ్చటిస్తూ పాత్రోచిత భాషను వాడుకచెయ్యాల్సిన అవసరాన్ని గురించి వివరించారు. "కన్యాశుల్కం" సజీవనాటకం కావడానికిదే కారణమన్నారు. కుటుంబాలు, వంశాలు, దేశాలు చరిత్రలు నాశనం కావచ్చు. కాని భాషా సాహిత్యాలు అమరత్వాన్ని కలిగి వుంటాయి. ప్రపంచంతోపాటు ఇవికూడా ఉజ్జ్వలపథానికి పోతాయనడములో సందేహం లేదన్నారు.

పాశ్చాత్యులకూ, మనకూ గల ముఖ్యవైరుధ్యాన్ని వివరిస్తూ, మనం గతాన్ని ప్రమాణంగా తీసుకొని గర్విస్తుంటాం. కాని పాశ్చాత్యులు వర్తమానాన్ని ప్రమాణంగా తీసుకొని భవిష్యత్తుకు బాటలువేస్తారు. అందుకే వారన్ని రంగాలలోనూ అభ్యుదయాన్ని సాధించగలిగారు. ఈచైతన్యం మనలో కలుగనంత కాలం మనం అభివృద్ధిని సాధించగలగడం దుర్లభం. అందుకు ఈశరంవారంశా కృషిసల్పుతారనికాంక్షిస్తున్నానంటూ తమను సన్మానించిన ఆంధ్రసాహిత్యపరిషత్తుకు ఆశీర్వచనాలను అందజేస్తూ హర్షధ్వానాలమధ్య తమ సుదీర్ఘ ప్రసంగాన్ని ముగించారు.

కార్యదర్శి సభికులకు స్వాగతము పలుకగా, సంయుక్తకార్యదర్శి వందన సమర్పణ గావించారు.

కర్నూలు జిల్లాలో కాంగ్రెసు పరిశీలకుల పర్యటన

కర్నూలు, ఆగస్టు 25

కర్నూలు జిల్లాలో కాంగ్రెసు అభ్యర్థుల ఎన్నికల దరఖాస్తులను పరిశీలించడానికి ప్రదేశ్ కాంగ్రెసు నియమించిన పరిశీలకులు శ్రీ ఆదినారాయణరెడ్డి, శ్రీబొమ్మకంటిసత్యనారాయణ ఈనెల 27 నుండి 30వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలోపర్యటిస్తారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వి. సుబ్బారావుగారిని సిండికేట్ సభ్యునిగా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ నామినేట్ చేశారు.

ఇతర గోళాలలో నూతన జీవ స్వరూపాల ఉనికి

అంతరిక్ష యాత్రల ద్వారా పరిశోధన

మానవుని అంతరిక్ష యాత్రా విజయంలో, గెర్మన్ తితోఫ్ భూప్రదక్షిణయానం, అత్యంత ప్రాధాన్యం కలఘట్టం. భూమికి దూరమైన విశాల విశ్వం పరిసరాల ప్రభావం మానవునిపైన ఏ విధంగా ఉంటుందో పరిశీలించడానికి తితోఫ్ అంతరిక్షయానం అమూల్యమైన విజ్ఞాన సమాచారం అందించగలదు.

ఇంతేకాదు, సోవియట్ విజ్ఞాన శాస్త్రజ్ఞులకు, ముఖ్యంగా జీవవిజ్ఞాన శాస్త్రజ్ఞులకు ఈ పరిశోధనలు ఎంతో అవసరం. భూమిపై జీవాల గురించి జీవోత్పత్తి గురించిన ప్రాచీన సమస్యల పరిష్కారానికీ, అంతరిక్షంలో జీవపదార్థాల ఉనికి గురించీ, ఇతర గోళాలలోని నూతన జీవస్వరూపాల గురించీ కూడా తెలుసుకోడానికి ఎంతయినా అవసరం.

అంగారక గ్రహంలోనూ, శుక్ర గ్రహంలోనూ ఇతర గోళాలలోనూ జీవజాలంఉండి ఉండవచ్చునని ఊహించడానికి మాత్రమే మనకిప్పుడు అవకాశం ఉంది. ఒక్కటి మాత్రం నిశ్చయంగా ఊహించవచ్చు, జీవం అనేది ఒక్క భూమిమీద మాత్రమే కాదు, ఇంకా ఎక్కడో ఉండి తీరుతుంది సంక్లిష్ట పదార్థ స్వరూపాలలో ఒకటిగా జీవం అనేది ఇప్పుడొక విశిష్ట పరిణామదశను అందుకొన్నది.

పరిస్థితులు అనుకూలముగా ఉన్నచోట అల్లా, జీవజాలము ఉండి తీరుతుంది. ఇది కేవలము ఊహానిబట్టి యుక్తినిబట్టి చెప్పిన సిద్ధాంతముకాదు. చాలకాలము కిందటనే, కొన్నిఉల్కాఖండాలలో జీవపదార్థము ఉన్నట్లు కనుక్కొన్నారు. విశ్వాంతరాళంలో వ్యాపించి ఉన్న ధూళిలోనూ, జీవరసాయనిక పదార్థములోనూ, మన భూమికి ఇతర గ్రహాలకూ జీవోత్పత్తికి ఆధార భూతమైన పదార్థము ఉన్నదని ధ్రువపరచడానికి తగిన తొలి నిదర్శనాలు మాకు లభించాయి.

జీవసంకులమైన అన్యగోళాలనుంచి వ్యాప్తమైన ధూళిలో సూక్ష్మజీవకణాలు ఉండటానికి అవకాశం ఉంది. సహజముగా ఆత్మరక్షణశక్తిలేని జీవస్వరూపాలు అంతరిక్షములో నిలవలేవని మా అభిప్రాయము. మానవుడు అంతరిక్షములో దీర్ఘకాలం మనగలిగినట్లయితే, కృత్రిమ రక్షణ సౌకర్యాల పరిస్థితిలో జీవస్వరూపాలు ఉండే అవకాశము ఉన్నదని నిరూపించడానికి వీలుంటుంది.

తితోఫ్ అంతరిక్ష ప్రయాణము ఫలితముగా, అంతరిక్షములో జీవపదార్థము ఉన్నదో లేదో, జీవోత్పత్తికి బీజాలున్నవో లేవో, ఇతర గోళాలనుంచి వచ్చినవి ఏవైనా ఉన్నవో లేవో-ఈ సమాచారము తెలుసుకోడానికి వీలుంటుంది.

రెండో వోస్తోక్ యాత్ర ఫలితాలకోసము, జీవవిజ్ఞాన శాస్త్రజ్ఞులము అందరమూ అత్యంత కుతూహలంతో నిరీక్షిస్తున్నాం. విశాల విశ్వములో జీవవ్యాప్తిగురించీ, జీవోత్పత్తిగురించీ అనేకాంశాలు విశదం కాగలవని ఆశిస్తున్నాం.

— అలజ్గాండర్ ఒపరిన్

కి. శే. కోటంరాజు రామారావు కుటుంబానికి సహాయం

ఏరూపంలో చేయాలో ప్రభుత్వం యోచిస్తున్నదని లోకసభలో రైల్వేమంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 25

దురదృష్టవశాత్తు కదుల్తున్న రైలునుండి పడి మరణించిన శ్రీ కోటంరాజు రామారావు కుటుంబానికి ఎట్టిసహాయం చేయాలో రైల్వే నిర్వాహకులు యోచిస్తున్నారని రైల్వేమంత్రి శ్రీ జగజీవన్ రాం నిన్న లోకసభలో చెప్పారు.

కీ॥ శే॥ రామారావు కుటుంబానికి రైల్వే అధికారులు చెల్లించాల్సిన పరిహార విషయమై చేయబడిన అనుబంధప్రశ్నలకు సమాధానమిస్తూ ప్రస్తుత నిబంధన ప్రకారం కుటుంబానికి పరిహారం యిచ్చుటకువీలులేదనీ, రామారావు వ్యక్తిత్వాన్ని గమనించి ఆయన కుటుంబానికి ఎట్టి సహాయము చేస్తేబాగుంటుందో తెలుసుకునేందుకై రైల్వేబోర్డుకు చెందిన ఒక వ్యక్తిని శ్రీమతి రామారావు వద్దకు పంపామనీ, ఆయన కుమార్తెలు, కుమారులు అర్హతలు కలిగిపండి పరిదుద్యోగులుగా ఉన్నచో వారికి ఉద్యోగాలు లభించేయటకు తాను తలపెట్టానని మంత్రి చెప్పారు.

మొదట శ్రీమతి రామారావును కలిసిన వ్యక్తి నివేదికతో సంతృప్తి పడక మరో వ్యక్తిని ఆమె దగ్గరకంపగా ఆయన నిన్నతిరిగి వచ్చాడనికు యేవిధమైన సహాయం చేయుటకు వీలుందో పరిశీలించుటకు ఆయనకోరబడినాడని శ్రీ జగ్‌జీవన్ రాం చెప్పారు.

రామారావు మరణోదంతాన్ని గూర్చి జరిపిన విచారణ ఫలితంగా ఆయన మృత్యువు ప్రమాదవశాత్తు జరిగినట్లు తేలిందని, రైల్వే అధికారుల దోషమయి సుమంతే నాలేదనిఅంతకు ముందు శ్రీ వాట్ పాయ్‌కు రైల్వే ఉప మంత్రి సమాధాన మిచ్చారు.

మల్లవరంలో గ్రంథాలయం

కోరుకొండ బి. డి. ఓ. చే ప్రారంభోత్సవం

కోరుకొండ, ఆగస్టు 25

"ప్రపంచ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. దైనందిన దేశవికాస విషయ గ్రహణకు తోడ్పడే గ్రంథాలయాలు నలుచెరగులా అభివృద్ధిచెందిన నాడే అభ్యుదయసాధన సులభతరమవుతుంది" అని కోరుకొండ జిల్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ డి. బసవరాజుగారు యిటీవల మల్లవరంగ్రామములో గ్రంథాలయ ప్రారంభోత్సవ సందర్భంలో జరిగిన సభకు అధ్యక్షత వహిస్తూ విశదీకరించారు. సభాప్రారంభానికిముందు శ్రీమైలవరపుపుల్లయ్య పంతులుగారు సభికులకు స్వాగతము చెప్పారు.

కోరుకొండపంచాయతీసమితి అధ్యక్షులు శ్రీ వుల్లి సత్యనారాయణమూర్తి గారు ప్రసంగిస్తూ యిలా అన్నారు. "పంచాయతీ సమితి ప్రాంతములోని ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయస్థాపనకు కృషి జరుగుతున్నది. త్వరలో అన్ని గ్రామాలలోనూ నెలకొల్పుగల మనే నా విశ్వాసం. అయితే వాటిని సద్వినియోగపరచుకోవలసిన బాధ్యత ప్రజలపైన వున్నది".

అనంతరం శ్రీ యుతులు అతిథి సత్యనారాయణమూర్తి (సమితి సభ్యులు) పున్నమరాజు రాధాకృష్ణమూర్తి ప్రభృతులు గ్రంథాలయాల విస్తరణావశ్యకతను గురించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ అధ్యక్షులు శ్రీ పాలాడి మల్లిఖార్జునరావుగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

కాపవరంలో స్వాతంత్ర్య దినోత్సవం

కాపవరం సమితి ప్రాథమిక పాఠశాలలో స్వరాజ్యావతరణ దినోత్సవం అత్యంతవైభవముగా జరిగింది. కోరుకొండ బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ డి. బసవరాజుగారుపతాకావిష్కరణ జరిపి స్వాతంత్ర్య దినోత్సవవిశిష్టతను విశదీకరించారు. శ్రీయుతులు బి. జనార్దనరావు (విద్యా విస్తరణాధికారి), రావుల సూర్యనారాయణమూర్తి (సాంఘిక విద్యా వ్యవసాయ కోద్యోగి)గారుకూడాఉపన్యసించారు.

తవుడు నుండి నూనె తీత

రాయపూర్‌లో ఫ్యాక్టరీ నిర్మాణం

ఇందోర్, ఆగస్టు 25

మధ్యప్రదేశ్‌లోని రాయ్‌పూర్ వద్ద బియ్యపు తవుడు నుండి నూనెను తీసే ఫ్యాక్టరీ ఒకటి రు. 16.25 లక్షలతో ఏర్పరచబడుతున్నది. ఈ ఫ్యాక్టరీకై మధ్యప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ రు. 5 లక్షల అప్పు ఇస్తున్నది. దీని ఉత్పాదకశక్తిరోజుకు 25 నుండి 35 టన్నులవరకు ఉండగలదు. తవుడు నుండి తీసే ఈ నూనె ఆహారంగా ఉపయోగింప తగ్గది. దీనికి స్వదేశంలోను విదేశాలలోను పుష్కలముగా మార్కెట్ లభిస్తుంది. ఇంకా తవుడు నుండి మైనం నబ్బులో కలుపడానికి పనికివచ్చే పదార్థం తయారవుతుంది. గ్వాలియర్ వద్ద ఒక దుక్కఇనుము ఫ్యాక్టరీగూడా ఏర్పరచబడగలదు.

భారత దేశంలో బ్రెజిల్ కొత్త రాయబారి

న్యూఢిల్లీ, ఆగస్టు 25

సెనార్ మేరియోడా కోస్టాగైమారెస్ భారత దేశంలో బ్రెజిల్ రాయబారిగా నియమితులయ్యారు.

ఆయన 1902 డిసెంబరు 24 న బ్రెజిల్‌లోసావ్‌పాలోలోజన్మించారు. బ్రెజిలియన్ జాతీయరక్షణ కళాశాలలో పట్టభద్రులయ్యారు.

ఆయన బ్రెజిలియన్ దౌత్యశాఖలో 1928 లో చేరారు. 1955 జులై 14 నుంచి యింతవరకూ ఆయన కోస్టారికాలో బ్రెజిల్ రాయబారిగా పనిచేస్తున్నారు.

యువతీ యువకులు అంతర్వివాహాలకు పూనుకోవాలి

విజయవాడ అంతర్వివాహ సంస్థ విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 25

అంతర్వివాహ సంఘ అత్యవసర కార్యవర్గ సమావేశం సంఘ ఉపాధ్యక్షులు శ్రీమతి గోపరాజు సరస్వతి గారి అధ్యక్షతన యీనెల 20 వ తేదీ ఉదయం విజయ ట్యుటోరియల్ కాలేజీలో జరిగింది.

సమావేశ ప్రారంభంలో సంఘ కార్యదర్శి శ్రీ నాగేశ్వర్ సంఘము స్థాపింపబడిన నాటినుండి జరిగిన అభివృద్ధిని సమీక్షిస్తూ ప్రసంగించారు.

సమావేశములో శ్రీయుతులు టి. చిత్తరంజనదాసు, యల్. చిరంజీవిరావు, లో॥ వెంకటరత్నం, శ్రీమతి హేమలతా, లవణంగారలు పాల్గొనిరి. ప్రత్యేక ఆహూతులుగా శ్రీ జి.టి. జ్ఞానమడిగారుకూడ హాజరైరి.

అంతర్వివాహము చేసికొనగోరు యువతీ యువకులు తమ పేర్లను, వివరములను వెంటనే సంఘ కార్యాలయమునకు పంపించవలసినదిగా కోరుతూ కార్యవర్గం తీర్మానించింది.

ఇంతకు పూర్వమే అంతర్వివాహం చేసికొనిన వారి వివరములు సేకరించుటకుగాను ప్రత్యేక రిజిస్టరు సంఘం ప్రారంభించినది గనుక అట్టి వారు తమ వివరములను సంఘమునకు తెలియచేయవలసిందిగా కోరింది.

అంతర్వివాహ సంస్థను ప్రోత్సహించు అభిమానులు తమ శక్త్యనుసారం విరాళాలను కార్యదర్శి పేర సంఘ కార్యాలయమునకు పంపవలసినదిగా విజ్ఞప్తి చేసింది.

అంతర్వివాహ సంఘ కార్యవర్గ సమావేశం ఎప్పటి పరిస్థితిని అప్పుడు సమీక్షించి చురుకుగా కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు, నిర్వహించబడుటకుగాను ప్రతి నెల జరపవలెనని తీర్మానించింది.

సేద్యానికి ధర్మసాగరం చెరువునీటి వినియోగం

వరంగల్ మున్సిపాల్టీ ప్రత్యేక సమావేశంలో చర్చలు

వరంగల్, ఆగస్టు 25

ధర్మసాగరం చెరువునుండి ధర్మసాగరం రైతులకు సేద్యం నిమిత్తం నీరువదిలే విషయమై వరంగల్ మున్సిపాల్టీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిన్న జరిగినప్పుడు వాగ్వాదం జరిగింది. ఈ సమస్య మీద వరంగల్ మున్సిపాల్టీ చర్